ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 205 పేజీలు: 8+4 వెల: 6.50



అంతరిక్ష రంగంలో జెన్‌జి ముందంజ: ప్రధాని 5లో

బంగ్లాలో హిందూ టీచర్ కుటుంబం దారుణ హత్య


# సంక్షోభం నుంచి సంక్షేమంలోకి

## అమరావతి అభివృద్ధిలో కీలకదశకు చేరాం

## రెండేళ్ల ప్రగతికి భోగాపురమే సాక్ష్యం

## సమర్థ నీటి నిర్వహణతో 552 టిఎంసిలు పొదుపు

## మరో మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నామని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. అమరావతి నగరాభివృద్ధిలో కీలక మైలు రాళ్లుదాటామని వివరించారు. ఎన్నికల సందర్భంలో చేసిన ప్రతివాగ్దానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్లిందన్నారు. అన్నింటినీ అధిగమిస్తూ సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నాం. అధికారాన్ని బాధ్యతగా, పాలకులు పనిచేస్తున్నాం. సామాజిక మాధ్యమంలో 'ఎక్స్'లో ఆయన చేసిన పోస్టుల్లో ఎపి అభివృద్ధి శరవేగంతో జరుగుతుందన్నారు. ప్రాంతీయ అసమానతలు లేకుండా రాష్ట్రమంతటా కేంద్రీకరించి అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో తమ రెండేళ్ళకుపైబడిన పాలనలో సాధించిన అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్టు కళ్లేదుటి సాక్ష్యంగా నిలిచిఉంటుందన్నారు. ప్రతి పౌరుడిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతివర్గాన్ని గెలిపించడమే అజెండాగా పనిచేస్తున్నాం. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ... రాష్ట్ర భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాం. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజలతరఫున ధన్యవాదాలు చెబుతున్నా అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేయడంలేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారాన్ని తమ భుజాలపై ఉన్న ఒక బాధ్యతగా మాత్రమే తాము భావిస్తున్నామన్నారు. తాము పాలకులం కాదని, ప్రజలకు సేవ చేసే సేవకులం మాత్రమే అని ఆయన తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రతి పౌరుడిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని, సమాజంలోని ప్రతి వర్గాన్ని గెలిపించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని సిఎం స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను తప్పకుండా నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్‌కు పటిష్టమైన బాటలు వేస్తున్నామని వివరించారు. అటు కేంద్ర ప్రభుత్వ సహకారం, అటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నాం. గడిచిన రెండేళ్లుగా సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టాం. 552 టిఎంసిలు పొదుపు చేసుకున్నాం. ఇవే మనకు శ్రీరామరక్ష. ప్రస్తుతం ప్రధాన రిజర్వాయర్లల్లో 586 టిఎంసిలుఉన్నాయి. ఉత్తరాంధ్ర ప్రాజెక్టు

>>2

# లిక్కర్ స్కాంలో మాజీమంత్రి కారుమూరి అరెస్టు

## హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఇడి అధికారులు

### స్కాంలో మాజీ మంత్రికి రూ.10 కోట్లు ముడుపులు అందినట్లు ఆరోపణలు

### కారుమూరి కుమారునితో పాటు మరో ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేసిన ఇడి

### మాజీ మంత్రి ముందస్తు బెయిలు పిటిషన్‌ను ఇటీవలే కొట్టివేసిన సుప్రీం కోర్టు



**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తుబెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జులై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈస్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇడి అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎపిలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఇడితన దర్యాప్తులో గుర్తించింది. మార్కెట్ రేట్ల కన్నా ఎక్కువధరకు కాంట్రాక్టులు కట్టబె

>>2

# క్షేత్రాలకు కొత్త రోడ్లు

- 100 పైగా ప్రధాన ఆలయాలకు గ్రామీణ రోడ్ల అనుసంధానం
- రూ. 120 కోట్లతో 205 కి.మీ రహదారులు
- ఐఎస్ జగన్నాథపురం, అహోబిలం తదితర పుణ్యక్షేత్రాలకు రహదారి నిర్మాణం
- సత్యసాయి శతజయంతికి రూ.30 కోట్లతో రోడ్లు: డి.సిఎం పవన్



ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు రహదారులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 23, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని ఆధ్యాత్మిక కేంద్రాల ప్రగతికి రహదారులును నిర్మిస్తున్నట్లు డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు డిసిఎంవో నుంచి కీలక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు దేవాలయాలకు సరైనరహదారి సౌకర్యంలేని పరిస్థితులు ఉన్నాయి. వాడపల్లి లాంటి పుణ్యక్షేత్రాలకు రోజు రోజుకీ భక్తుల సంఖ్య అయితే పెరుగుతుంది గానీ, వారికి సరిపడ రోడ్డు సౌకర్యం మెరుగుపడడం లేదన్న అంశం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. క్షేత్ర స్థాయి పర్యటనల్లో అలాంటి ఎన్నో ఆలయాలు ఆయన కంటపడ్డాయి. కొన్ని ఆలయాల దుస్థితిని ప్రజలు వినతపత్రాల రూపంలో పవన్ కల్యాణ్ అందజేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దేవుని దర్శనానికి వెళ్లే దారి లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా దాదాపు 100కు పైగా ప్రధాన క్షేత్రాలను 205 కిలోమీటర్ల పొడుగున రోడ్లతో అనుసంధానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీ జీ రాం జీ, సాస్కి తదితర నిధులతో బడి, గుడి, ఆసుపత్రి, పంట పొలాలకు వెళ్లే మార్గాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ముందుకు తీసుకువెళ్తున్నారు. సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ జిల్లాలో పుట్టపర్తి అనుసంధాన రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన గుడి బాట పనులు అత్యంత వేగంగా పూర్తి చేసే విధంగా పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 120 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారుల్లో

>>2

# భారీ వర్షసూచన

## 50 కి.మీ వేగంతో ఈదురుగాలులకు అవకాశం

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలోహోమంత్రి వంగలపూడి అనిత అధికారులను అప్రమత్తం

>>2


ఒడిశా తీరంలో సరకు నౌక మునక 2లో





# 31న వెలిగొండకు కృష్ణా జలాలు

## నిర్వాసితులకు రూ. 768 కోట్లు చెల్లింపు: మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

**ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** వెలుగొండ ప్రాజెక్టుకు ఈ నెల 31న 10 టీఎంసీల కృష్ణా జలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఆదివారం ప్రకాశం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరులోగా వెలుగొండకు నీటిని అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. 1996 మార్చి 5న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని మంత్రి గుర్తుచేశారు. సరిగ్గా 30 యేళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు పనులను పూర్తి చేసి తన చేతుల మీదుగా నీటిని విడుదల చేయబోతున్నారని తెలిపారు. ఇది ప్రకాశం జిల్లా ప్రజలకు ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలతో పాటు ప్రాజెక్టు పరిధిలోని పలు ప్రాంతాలకు సాగునీరు, తాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి నీటి భరోసా పెరగడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్పారు. గత

>>2



ఆదివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం

# బ్రిక్స్ దేశాల మధ్య మరింత క్రీడా సహకారం

## విశాఖలో ఉమ్మడి ప్రకటన

**విశాఖపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం విశాఖపట్నంలో ఆదివారం విజయవంతంగా ముగిసింది. క్రీడా రంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయిస్తూ బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటనను ఏకాభిప్రాయంతో ఆమోదించారు. క్రీడల ద్వారా యువత అభివృద్ధి, మహిళల భాగస్వామ్యం, సమగ్రత, సాంస్కృతిక మార్పిడి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ.. బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యం కేవలం ప్రకటనలకే

>>2

# పోరాటం ఆగదు: జూడాలు

**గుంటూరు మెడికల్, ఆగస్టు 23, ప్రభాత వార్త:** జూనియర్ వైద్యుల రాష్ట్రవ్యాప్త ఆందోళన 14వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి తదుపరి చర్చలకు పిలుపు రాకపోవడంతో జూనియర్ వైద్యులు వెనక్కి తగ్గకుండా నిరసన కొనసాగిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు, శిక్షణ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని అధికారి కార్యాలయం సమీపంలో శాంతియుతంగా ఆందోళన చేపట్టారు. ఆందోళనలో భాగంగా సుమారు 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛందంగా విడతలవారీ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇటీవల జూనియర్ వైద్యుల సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశం అనంతరం కూడా ప్రభుత్వం తదుపరి చర్చలకు పిలవకపోవడంపై వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆందోళ

>>2



దివంగత ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆదివారం అమరావతిలో నివాళిని అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

## ఆంధ్రకేసరికి సిఎం చంద్రబాబు ఘన నివాళి

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు సిఎం చంద్రబాబు ఘన నివాళిని అర్పించారు. తన కార్యాలయంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన "ఎక్స్"లో పెట్టిన పోస్టులో నిరాడంబరత, నిజాయితీ, పట్టుదల, క్రమశిక్షణ, నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటి వారినైనా ఎదిరించే గుణం కీ.శే.టంగుటూరి ప్రకాశం పంతులు నైజం అని చంద్రబాబు శ్లాఘించారు. ప్రజా సంక్షేమమే ఊపిరిగా జీవించిన ఆంధ్రకేసరి తెలుగువారి సాహసానికి, పౌరుషానికి ప్రతీక. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆ మహనుభావుని విశిష్ట వ్యక్తిత్వాన్ని, సాహస పోరాటాన్ని స్మరించుకుంటూ ఆయన స్మృతికి నివాళులు అర్పిద్దాం అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు

**మంత్రి నారా లోకేశ్ నివాళి..**

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. బ్రిటీష్ తుపాకులకు ఎదురు నిలిచి ఆంధ్రకేసరిగా ఆయన పేరు గడించారు. రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా రాష్ట్రానికి వారు అందించిన సేవలను స్మరించుకుందాం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫీల్డ్‌కు మరో అడుగు

### 160 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 2,069 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. తొలివిడతగా 160.32 ఎకరాలకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అర్లి బి పరిధిలో 58 మంది రైతుల భూములు ఇందులో ఉన్నాయి. కచ్‌కంటి, టాక్లి ప్రాంతాల్లో మరికొంత భూమికి నోటిఫికేషన్ సిద్ధమవుతోంది. 60 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని అధికారులు సూచించారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం అర్లిబి గ్రామ పరిధిలోని 58 మంది రైతుల నుంచి సేకరించనున్న భూమి వివరాలను తాజా నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. అదే మండలంలోని కచ్‌కంటి గ్రామ పరిధిలో 29.19 ఎకరాలతో పాటు టాక్లి గ్రామ శివారులోని మరో 5.20 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ రెడీ చేస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రావు వెల్లడించారు. నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి మరో 60 రోజుల్లో ఎవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలపాల్సి ఉంటుందని అన్నదాతలకు సూచించారు. త్వరలోనే గ్రామసభలు నిర్వహించి పరిహారం విషయంలో అభిప్రాయ సేకరణ చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ అనుమతి లేకుండా నోటిఫికేషన్‌లో పొందుపర్చిన భూములకు సంబంధించిన ఎలాంటి లావాదేవీలు, అభివృద్ధి, తాకట్టు వంటి పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు.

కీలకమైన అనుకుంట, ఖానాపూర్ గ్రామ శివారులో సర్వే పూర్తి చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు ముందుగా మూతపడ్డ సీసీఐ భూములను సేకరిస్తారని ప్రచారం జరిగినా.. వాటి జోలికి వెళ్లడం లేదని అధికారులు చెప్పారు. దీంతో ఆ పరిశ్రమ తిరిగి తెరుచుకునే ఆశలు సజీవంగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఆదిలాబాద్ పట్టణం నుంచి అనుకుంట మీదుగా వెళ్లే ప్రధాన దారిని కచ్‌కంటి గుండా మళ్లిస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయా గ్రామస్థుల్లో కలవరం మెదలైంది. తాజాగా బెంగళూరు నుంచి వచ్చిన ఇండియన్ కోస్ట్ గార్డ్ సర్వీసు విభాగ బృందం ఏరియల్ సర్వే చేయడం.. దాంతో పాటుగా భూసేకరణ ప్రక్రియ ఊపందుకోవడం ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధిపై ఆదిలాబాద్ జిల్లా వాసుల్లో ఆసక్తి నెలకొంది.

## మండపానికి తరలిస్తుండగా కూలిపోయిన వినాయక విగ్రహం

**ముంబయి,ఆగస్టు 23:** భారీ వినాయక విగ్రహాన్ని మండపానికి తరలిస్తుండగా కూలిపోయింది. అక్కడున్న జనంపై ఆ భారీ విగ్రహం పడటంతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. దక్షిణ ముంబై భూలేశ్వర్‌లోని బలరామ్ మర్చంట్ రోడ్డులో ప్రతి ఏటా భారీ గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పది గంటల సమయంలో 22 అడుగుల ఎత్తైన భూలేశ్వరచా రాజా వినాయక విగ్రహాన్ని స్థానిక మండపానికి వాహనంలో తరలించసాగారు. ఫ్రేమ్‌కు ఉన్న కొన్ని నట్స్, బోల్ట్స్ వదులుగా ఉండటం వల్ల ఆ భారీ విగ్రహం ముందుకు పడిపోయింది. అక్కడున్న యువకులపై అది పడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ సంఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే ముంబై అగ్నిమాపక దళం, ముంబై పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, 108 అంబులెన్స్ సర్వీస్, మున్సిపల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు.మరోవైపు గాయపడిన వారిని జేజే ఆసుపత్రికి తరలించారు.

## సంక్షోభం నుంచి సంక్షేమంలోకి

>> లకు వచ్చే నీరు కూడా బాగా తగ్గింది. తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశాం. పోలవరం ఎడమ కాల్వ పనులు వేగంగా సాగుతున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నుంచి అనకాపల్లి వరకు నీళ్లు తీసుకెళ్తాం. విశాఖలోని పరిశ్రమలు, డేటా సెంటర్లకు నీళ్లు అందిస్తాం. పరిశ్రమలకు, ఉద్యాన పంటలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి డెల్టాలో తప్ప ఎక్కడ వరిపంట వేసినా ఇబ్బందులు వస్తాయి. నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు రావొచ్చు. కర్నూలు జిల్లాలో ఈసారి ఉల్లి సాగు తగ్గొచ్చు అని తెలిపారు. జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాం. ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారు. మరో మూడేళ్లలో రూ.35,555 కోట్లతో 36 ప్రాజెక్టులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ఇవన్నీ పూర్తయితే 19.16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించవచ్చు. ఎల్‌నినోపై పోరాటానికి పంచ సూత్రాలు పెట్టుకున్నాం. భూగర్భజలాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. రైతులంతా వర్షపు నీటిని ఎక్కడికక్కడ పొదుపు చేసుకోవాలి. నేరేడు, మడ్డువలస ఫేజ్2 ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తాం. నాగావళి, వంశధార లింక్‌ను 2027 జూన్ నాటికి, తోటపల్లి బ్యారేజ్‌కు రూ.249 కోట్లు ఖర్చు చేసి 2027జులైలోగా పూర్తి చేస్తాం. వంశధార, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. ఇవి పూర్తయితే రాష్ట్రంలో కరవు అనే మాటే ఉండదని చంద్రబాబు అన్నారు. పొగాకు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇప్పించామని చంద్రబాబు పేర్కొన్నారు. నష్టపోయిన మామిడి, కోకో, ఉల్లి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. పశుగ్రాసానికి సమస్య రాకుండా ఏర్పాట్లు చేశామని, పశువుల కోసం గడ్డి బాగా పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా 15,300 గోకుల షెడ్లు నిర్మించామని, ఈఏడాది కూడా మరికొన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. సంక్షోభం వచ్చినప్పుడు అందరూ కలిసి పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని చంద్రబాబు అన్నారు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సేంద్రియసాగు విధానంలో పంటలసాగు పెరగాలన్నారు. మెట్ట ప్రాంతాల రైతులకు మెరుగైన సాగు విధానం ప్రకృతి సేద్యమని తెలిపారు. మీ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రతి ఎమ్మెల్యే, మంత్రీ ప్రోత్సహించాలని కోరారు. అన్నదాతల నుంచి వచ్చే పంటలబీమా దరఖాస్తులు పెరిగాయని వివరించారు. పంటల బీమాలో దేశంలోనే ఐదో స్థానంలో ఉండటం మనకు గర్వకారణమని వెల్లడించారు. సంక్షేమం గురించి మాట్లాడటంతో తమ ప్రభుత్వం సరిపెట్టుకోదన్నారు. అమలు చేసి తీరుతామన్నారు. ప్రతి పథకం మంచి ఫలితాలను సాధిస్తున్నాయని తెలిపారు.

## మరింత క్రీడా సహకారం

>> పరిమితం కాకుండా క్రీడాకారులు, కోచ్‌ల పరస్పర మార్పిడి, సంయుక్త క్రీడా పోటీలు, క్రీడా శాస్త్ర పరిజ్ఞాన భాగస్వామ్యానికి వాస్తవిక వేదికగా మారాలని పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ క్రీడా వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని, మైదానం నుంచి పతకం సాధించే స్థాయి వరకు క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని మాండవియా తెలిపారు. క్రీడా వస్తువుల తయారీ రంగంలో పెట్టుబడులు, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.మూడు కీలక ప్రతిపాదనలకు ముందడుగు..భారత్ బ్రిక్స్ అధ్యక్షతలో క్రీడా రంగంలో మూడు ప్రధాన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. క్రీడాశాస్త్రం, క్రీడాకారుల పనితీరు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, ఆవిష్కరణలపై సహకారం కోసం బ్రిక్స్ క్రీడా సాంకేతికత వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనున్నారు.క్రీడా వస్తువుల తయారీ రంగంలో సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, వాణిజ్యం, సరఫరా వ్యవస్థలపై సహకారం కోసం బ్రిక్స్ క్రీడా తయారీ సదస్సును నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించనున్నారు.సాంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ, సాంస్కృతిక మార్పిడికి బ్రిక్స్ సంప్రదాయ, స్వదేశీ క్రీడల ప్రదర్శన క్రీడలను అక్టోబర్ 12, 13 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు.

## పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ నేడు ఇరాన్‌లో పర్యటన

**ఇస్లామాబాద్,ఆగస్టు 23:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ సోమవారం ఇరాన్‌లో పర్యటించనున్నారు. ఇరాన్ నాయకత్వంతో ఉన్నతస్థాయి చర్చలు జరిపి ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ పరిస్థితులు, పశ్చిమాసియాలో శాంతి, భద్రత అంశాలపై చర్చించనున్నారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ పరిస్థితులపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో మునీర్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. మునీర్‌తో పాటు ఒక ప్రతినిధి బృందం కూడా ఇరాన్‌కు వెళ్లనున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రాంతీయ శాంతి, భద్రతను ప్రోత్సహించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలను కొనసాగించడం ఈ పర్యటన ఉద్దేశమని ఆయన తెలిపారు. నిలిచిపోయిన శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రయత్నంఅమెరికా, ఇరాన్ మధ్య జూన్ 17న వర్చువల్‌గా కుదిరిన 60 రోజుల తాత్కాలిక శాంతి అవగాహన ఒప్పందం ఈనెల 17తో ముగిసింది. ఈ ఒప్పందానికి పాకిస్థాన్ హామీదారుగా వ్యవహరించింది. అయితే ఒప్పందం ముగిసినప్పటికీ ఇరుదేశాల మధ్య తదుపరి పరిణామాలపై స్పష్టత లేకపోవడంతో గల్ఫ్, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.ఈ నెల ప్రారంభంలో పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఇరాన్‌లో పర్యటించి అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో చర్చలు జరిపారు. ఆ చర్చలకు కొనసాగింపుగానే మునీర్ పర్యటన జరుగుతున్నట్లు భావిస్తున్నారు. 60 రోజుల వ్యవధిలో ఉన్నతస్థాయి చర్చలు జరిపి పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించాలన్న లక్ష్యంతో పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లింది. అయితే ఇప్పటివరకు అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఇరాన్ అధ్యక్షుడు అమెరికాఇరాన్ శాంతి అవగాహన ఒప్పందం ఆశించిన ఫలితాలను సాధించక పోయినప్పటికీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఈనెల 23న దానిని సమర్థించారు.

### వారం - వర్జ్యం

24-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ద్వాదశి పూర్తి
న.పూర్వాషాఢ రా.8.26
వ.తె.5.14-ఉ.6.59
దు1. మ.12.34-మ.1.24
దు2. మ.3.05-మ.3.55
రాహు ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు

### వార్తాఫలం

**మేషం :** భాగస్వాములు, నమ్మిన సన్నిహితులు, తమ వంతు సహాయసహకారాలను అందిస్తారు. ఋణబాధలు తప్పవు.

**వృషభం :** విద్యా, సాహిత్య కళారంగాలలోని వారికి అనుకూలంగా ఉంటుంది. కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయి. శుభవార్తలు.

**మిథునం :** తక్కువ కాలంలో సాగే తాత్కాలిక వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి. పోటీ తత్వాన్ని మరింతగా కలిగి ఉంటారు.

**కర్కాటకం :** నిర్మాణాత్మక కార్యక్రమాలలో పురోభివృద్ధి గోచరిస్తోంది. వెన్ను నొప్పి బాధిస్తుంది. క్రయ విక్రయాలు సాగిస్తారు.

**సింహం :** వివాదాస్పద అంశాలను అనుకూలంగా మలచుకోవడానికి యత్నాలను ముమ్మరం చేస్తారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**కన్య :** బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అనుకూల బదిలీ అవకాశాలు గోచరిస్తున్నాయి. స్త్రీల నుండి సహాయం పొందుతారు.

**తుల :** ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అవసరం. పట్టువిడుపు ధోరణిని కలిగి ఉంటారు. శుభ కార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం :** కార్యాలయంలో చోటు చేసుకునే అంతర్గత రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. వస్త్రా లాభం కలుగుతుంది.

**ధనుస్సు :** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండూ కలిసిరావు. సకుటుంబంగా శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మీ మనోభావాలను అర్థం చేసుకునే వారి వలన ఊరట పొందుతారు. కొత్త ఋణం తీసుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం :** అనుకూల బదిలీ అవకాశాలు గోచరిస్తున్నాయి. ప్రతి విషయంలోనూ ధీమాగా వ్యవహరిస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**మీనం :** వ్యవహారాలలో స్పష్టత లోపిస్తుంది. అదనపు బరువు బాధ్యతలు విసుగుపుట్టిస్తాయి. ఆరోగ్యం, వాహనాల విషయంలో జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఒడిశా తీరంలో సరకు నౌక మునక

**భువనేశ్వర్, ఆగస్టు 23:** ఒడిశా తీరానికి సమీపంలోని బంగాళాఖాతంలో ఒక భారీ సరుకు రవాణా నౌక మునిగిపోయింది. పనామా పతాకంతో ప్రయాణిస్తున్న ఈ నౌక, ఒడిశా నుంచి సింగపూర్‌కు ఇనుప ఖనిజం లోడ్‌తో వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. పరదీప్ తీరానికి సుమారు 240 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. నౌకలోని సిబ్బందిలో ఎక్కువ మంది చైనా జాతీయులను ప్రాథమిక సమాచారం అందుతోంది. సహాయక చర్యల కోసం సమీపంలోని ఇతర నౌకలను కూడా అధికారులు అప్రమత్తం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది సిబ్బందిని సురక్షితంగా కాపాడారనే విషయంపై స్పష్టత రాలేదని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఈనౌక పనామా దేశానికి చెందిన భారీ కార్గో నౌక ఎంవీ ఓషన్ విన్నర్ అని తేలింది. ఈ నౌకలోని 24 మంది సిబ్బందిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడగా, మరో 22 మంది గల్లంతయ్యారు. వీరి కోసం ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. విశాఖపట్నానికి 700 కి.మీ, ఒడిశాలోని పరదీప్ తీరానికి సుమారు 230 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌక మునిగిపోయిందని అధికారులు చెబుతున్నారు. భారీగా ఇనుప ఖనిజంతో ఆగస్టు 20న పారాదీప్ పోర్టు నుంచి బయలుదేరిన ఈ నౌక రెండు రోజుల తర్వాత ట్రాకింగ్ సిస్టమ్ నుంచి అదృశ్యమైంది. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 20 మంది చైనా జాతీయులు కాగా, ముగ్గురు మయన్మార్ వాసులు, ఒక బంగ్లాదేశీయుడు ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన శ్రీవిజయపురంలోని మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ రక్షణ చర్యలు చేపట్టింది. ఇండియన్ నేవీకి చెందిన నిఘా విమానం రంగంలోకి దిగి, సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న లైఫ్ రాఫ్ట్)లను గుర్తించింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎంటీ ఈసోపస్ అనే వాణిజ్య నౌకను అధికారులు అటు వైపు మళ్లించారు. లైఫ్ రాఫ్ట్‌ల సాయంతో ప్రాణాలు దక్కించుకున్న ఇద్దరు నావికులను ఈ వాణిజ్య నౌక రక్షించింది. ప్రస్తుతం వారికి వైద్య సాయం అందిస్తున్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన వరాద్, అన్మోల్, విజిత్ నౌకలు గాలింపు ఆపరేషన్‌ను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. నౌకలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక మరేదైనా అత్యవసర పరిస్థితి ఎదురైందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

## భారీ వర్షసూచన

>> చేశారు. ఉత్తరాంధ్రలో వర్షాలు పడుతున్నందున జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తీరప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను పాటించాలన్నారు.ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మత్స్యశాఖ, విపత్తుల నిర్వహణ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. అటు వర్షాల కోసం మార్కాపురం జిల్లాలో స్థానికులు వినూత్న పూజలు నిర్వహించారు. బంగాల్ బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తాజా బులెటిన్‌లో తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాతావరణం చల్లబడనుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వానలు పడతాయని అధికారులు అంచనా వేశారు. అలాగే శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇక తగిన వానలు లేక బెట్ట పరిస్థితులు నెలకుని ఉండటంతో రైతులు వర్షాల కోసం పూజలు చేస్తున్నారు.

వానలు సమృద్ధిగా పడాలని రైతులు, ప్రజలు వినూత్న పూజలు చేస్తున్నారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలం పిల్లికుంట తండాలో గ్రామస్థులు ప్రత్యేక భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ స్థానిక పోలేరమ్మ, గంగమ్మ తల్లులకు బిందెలతో నీళ్లు పోసి జలాభిషేకం చేశారు. ముఖ్యంగా గంగమ్మ తల్లికి 101 బిందెల నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాన దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. పాడిపంటలు వృద్ధి చెంది, ప్రతి ఒక్కరూ సిరిసంపదలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గ్రామస్థులు మొక్కుకున్నారు.




ఆదివారం గుంటూరు వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు, శిక్షణ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని అధికారి కార్యాలయం సమీపంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

## పోరాటం ఆగదు: జూడాలు

>> నలో భాగంగా మన సమస్యలను ఒక్క మాటలో ఎలా చెప్పగలం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు తమ సమస్యలు, అనుభవాలను స్వయంగా వివరించే అవకాశం కల్పించారు. అలాగే ఆందోళనకు సంబంధించిన అంశాలను హావభావాల ద్వారా గుర్తించే వినోదాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, తమ డిమాండ్లు, సవాళ్లను ఒక బృందం హావభావాలతో వ్యక్తపరచగా మరో బృందం వాటిని గుర్తించింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయినా జూనియర్ వైద్యులు శాంతియుతంగా, క్రమశిక్షణతో ఆందోళన కొనసాగించారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**చర్చలకు సిద్ధమే.. పరిష్కారం చూపాలి**

తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని జూనియర్ వైద్యులు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి, సమస్యలకు స్నేహపూర్వక పరిష్కారం చూపాలని కోరారు.

## మాజీమంత్రి కారుమూరి అరెస్టు

>> ట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపి సిఐడి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి విచారణ కొనసాగిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజ్ కెసిరెడ్డి, అప్పటి ఏపి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఇడి ఆరోపిస్తోంది. ఈ సిండికేట్‌లో మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌కు కూడా వాటా ఉందని, వారి కుటుంబానికి సుమారు రూ.10 కోట్లకు పైగా ముడుపులు అందినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది.ఈ కేసులో భాగంగా జూన్ నెలలో ఇడి విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. మొదట రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసింది. అనంతరం కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుంది. ఇప్పుడు మాజీ మంత్రి కారుమూరిని కూడా అరెస్ట్ చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

## క్షేత్రాలకు కొత్త రోడ్లు

>> 26 నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 40 శాతం రహదారులకి సంబంధించిన పనులు 50 శాతం మేర పూర్తయ్యాయి. అందులో ప్రఖ్యాత శ్రీ లక్ష్మీ నరసింహా క్షేత్రం అంతర్వేది, అహోబిలం, మదనపల్లి నియోజకవర్గంలోని శ్రీ గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, మారుమూలన ఉన్న ఆలయాలు దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, మర్రిపూడి వద్ద ఉన్న పుడియగిరి లక్ష్మి నరసింహా స్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం తలుపులమ్మలోవ మార్గం, ఐ.ఎస్ జగన్నాథపురం ఘాట్ రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయి. పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ రోడ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాస్కి నిధులతో చేపట్టిన కోనసీమ తిరుమల వాడపల్లి కరకట్ట మార్గం, రూ. 3 కోట్లతో అర్ధగిరి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం రోడ్డు తెనాలి, రాయచోటి తదితర నియోజకవర్గాల్లో చేపట్టిన రోడ్లు, నిడదవోలులో ఆంజనేయస్వామి రోడ్డు, పూతలపట్టు నియోజకవర్గం తోటవారిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయం తదితర రహదారుల పనులు వివిధ స్థాయిల్లో పురోగతిలో ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించిన దాదాపు 72 కిలోమీటర్ల రోడ్లు సైతం వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి. పుణ్య క్షేత్రాలకు వెళ్లే రోడ్ల నాణ్యతా ప్రమాణాల విషయంలో శ్రద్ధ వహించాలని పవన్ కల్యాణ్ అధికారులకు నిర్దేశం చేశారు. పంచాయతీరాజ్ శాఖ నిర్మించే రోడ్లు భక్తులకు సుదీర్ఘ కాలం ఉపయోగపడాలని సూచనలు చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆలయాల రోడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించి, భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులకి తెలియజేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని ఆలయాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పవన్ కల్యాణ్ నాయకత్వలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## 31న వెలిగొండకు కృష్ణా జలాలు

>> ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. నీటి విడుదలకు అవసరమైన పనులను ప్రాధాన్యంతో పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. నిర్వాసితులకు మొత్తం రూ.900 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా మూడు విడతల్లో రూ.768 కోట్లను అందించామని మంత్రి వివరించారు. మిగిలిన నిర్వాసితులకు కూడా త్వరలోనే నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిర్వాసితుడికి అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యలను అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

## ఉపరాష్ట్రపతితో కలిసి నేడు మొక్కజొన్న కొత్త వంగడాన్ని ఆవిష్కరించనున్న సిఎం

**విజయవాడ ఆగస్ట్ 23, ప్రభాతవార్తప్రతినిధి:** రైతుల పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రయోగానికి ఏలూరు జిల్లా ముసునూరు వేదిక కానుంది. దేశంలో తొలి నాన్ జీఎంఓ పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా ఆవిష్కరించనున్నారు. ఏలూరు జిల్లా జిల్లా ముసునూరులో గోర్మే పాప్ కార్న్‌కా సంస్థ ఆధ్వర్యంలో జన్యు పరంగా మార్పు చెందని మొక్కజొన్న వంగడాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించనున్నారు. గోర్మే పాప్‌కార్న్‌కా ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మెయిజ్ సాగుతో వేలాది మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉంది. ముసునూరులోని ప్లాంట్ ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటిగా నిర్మించారు. దేశంలోని వేలాది సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో సంస్థ కీలకంగా ఉంది. సోమవారం తొలి నాన్‌బిటీవీ పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించనున్నారు.

## స్వదేశీ పరిజ్ఞానంతోనే ఎకె203 ఆవిష్కరణ

### భారత సైన్యానికి ఎంతో మేలంటున్న రక్షణరంగ నిపుణులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** భారత్ పూర్తిగా స్వదేశీ ముడి పదార్థాలతోనే విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా తయారైన ఎకె203 రైఫిల్‌ను ఆవిష్కరించింది. దీనికి షేర్ అని పేరు పెట్టారు. ఈ రైఫిల్ ఆటోమేటిక్, బరస్ట్ ఫైరింగ్ టెస్టుల్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. 2019లో భారత్, రష్యా మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఎకె203 రైఫిళ్లను భారత్‌లోనే తయారు చేసేందుకు ఇండోరష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైంది. భారత్‌లో తయారైన రైఫిళ్లలో మొదటగా దిగుమతి చేసుకున్న కిట్‌లను ఉపయోగించగా, ఇప్పుడు దేశీయ భాగాల వాటాను పెంచారు. తాజాగా తయారైన షేర్‌లో ప్రతీ విడిభాగం, ముడి పదార్థం భారత్‌లోనే తయారైంది. కేవలం రైఫిల్‌ను భారత్‌లో అసెంబుల్ చేయడమే కాకుండా, దాని తయారీకి అవసరమైన ప్రతీ వస్తువును భారత్‌లోనే దేశీయంగా అభివృద్ధి చేశారు. ఎకె203లో సుమారు 50 ప్రధాన భాగాలు, 180 ఉప భాగాలు, దాదాపు 120 తయారీ ప్రక్రియలు ఉన్నాయి. వీటన్నింటినీ భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసేందుకు ఐఆర్ఆర్‌పి అనేక దేశీయ సరఫరాదారులను అభివృద్ధి చేసింది.

ఎకె203 7.62 39 మిమీ కార్ట్రిడ్జ్‌ను ఉపయోగించే గ్యాస్‌ఆపరేటెడ్, మ్యాగజైన్‌ఫెడ్ అసాల్ట్ రైఫిల్. ఫోల్డింగ్, అడ్జస్టబుల్ స్టాక్, ఎర్గోనామిక్ గ్రిప్, ఆధునిక ఆప్టికల్ పరికరాలను అమర్చేందుకు రైల్ సిస్టమ్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం భారత సైన్యం ఉపయోగిస్తున్న ఇన్సాస్ రైఫిల్‌కు దీనిని ప్రత్యామ్నాయంగా తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అమేథీలోని కోర్వా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఈ రైఫిళ్లను తయారు చేస్తున్నారు. మొత్తం 6,01,427 ఎకె203 రైఫిళ్లను తయారు చేసే కాంట్రాక్ట్ ఉంది. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,200 కోట్లు. ఉత్పత్తి గడువును కూడా అక్టోబర్ 2032 నుంచి డిసెంబర్ 2030కు ముందుకు తీసుకొచ్చారు. ఈ లెక్కన కోర్వా ప్లాంట్ ప్రతీ రోజు 600 రైఫిళ్లను తయారు చేయాల్సి ఉంటుంది. ప్రతీ 100 సెకన్లకు ఒక రైఫిల్ తయారు కావాలి. ఈ రైఫిళ్లలో వాడుతున్న దేశీయ వస్తువులు 2025 మధ్య నాటికి 50 శాతం ఉండగా, ఇది ఇప్పుడు 100 శాతానికి చేరుకుంది.

# బ్రహ్మోత్సవాలకు అదనపు లడ్డూలు రెండింతలు

## 10లక్షల బఫర్‌స్టాక్‌పై దృష్టి



**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత భక్తులు అంతే పవిత్రంగా భావించే లడ్డూప్రసాదాలను ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు గతంకంటే రెండింతలు అదనంగా తయారుచేయాలని టిటిడి కసరత్తు చేస్తోంది. ప్రతిరోజూ 10లక్షల వరకు లడ్డూలు బఫర్‌స్టాక్ ఉంచాలని ఇప్పటికే అధికారులు నిర్ణయించారు. ఆదిశగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పోటు విభాగాన్ని ఆదేశించారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో 5లక్షల వరకు లడ్డూలు అదనంగా తయారుచేసి నిల్వ ఉంచుకునేవారు. శ్రీవారి ఉత్సవాలు జరిగే ఆ తొమ్మిది రోజులు భక్తులు సరాసరి 4లక్షల వరకు లడ్డూలు కొనుగోలుచేసేవారు. ఇప్పుడు ఆ సంఖ్య సాధారణ రోజుల్లోనే 4.50లక్షల వరకు లడ్డూలు అమ్ముడవుతున్నాయి. ఈ నేపధ్యంలో సెప్టెంబర్ 15నుండి 23 వరకు తొమ్మిదిరోజులు జరిగే తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు 10లక్షల లడ్డూలు బఫర్‌స్టాక్ చేసుకోవాలని కీలక నిర్ణయం తీసుకోవడం శ్రీవారి ప్రసాదాలకు భక్తుల నుండి డిమాండ్ ఏ పాటిదో అర్థమవుతుంది. అలాగే అక్టోబర్‌లో జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవ రోజుల్లోనూ ఇదే రీతిలో లడ్డూలను నిల్వచేసుకునే దిశగా అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవడం, సాధారణరోజుల్లోనూ సరాసరి 90వేలమంది వరకు భక్తులు ఇష్టదైవాన్ని దర్శనం చేసుకోవడం జరుగుతోంది. ప్రతిరోజూ 4లక్షల నుండి 4.20లక్షల వరకు లడ్డూలు కూడా విక్రయాలు ప్రాధాన్యత సంతరించుకుంది. సామాన్యభక్తులు ఒక్కొక్కరు స్వామివారి దర్శనం తరువాత ఖచ్చితంగా ఐదునుండి 10వరకు లడ్డూలు కొనుగోలుచేసి తీసుకెళ్తుండటం విశేషం. ఈ నేపధ్యంలో బ్రహ్మోత్సవాల రోజుల్లో అదనంగా మరింత మంది భక్తులు తిరుమలకు విచ్చేసే అవకాశం ఉండటంతో భక్తులకు లడ్డూలు లేదనే మాట వినిపించకుండా 10లక్షల వరకు లడ్డూలు నిల్వచేసుకునేలా పోటు విభాగం పనితీరు కీలకం కానుంది. ప్రతిరోజూ పోటులో ఇప్పుడు 4లక్షల వరకు లడ్డూలు ఎంతో నాణ్యతతో, రుచిగా తయారవుతున్నాయి.

**అదనపు విక్రయాలపైనే టిటిడి దృష్టి:** తిరుమలకు వచ్చిన భక్తులు ఎంతో పవిత్రంగా ,భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదం అదనంగా విక్రయాలు జరుగుతుండటంతో టిటిడి ఆదాయం కూడా రికార్డుస్థాయిలో పెరుగుతోంది. ప్రతినెలా కోటిపైగానే లడ్డూలు విక్రయాలు జరుగుతున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టిటిడి అధికారులు లడ్డూ ఉత్పత్తిని కూడా భారీగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను విక్రయిస్తోంది. ఒక్కోనెలలో 1.25కోట్ల లడ్డూలు విక్రయాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

శ్రీవారి ప్రసాదాల తయారీలో ముఖ్యంగా లడ్డూల నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న టిటిడి రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 లక్షల నుండి 4.5 లక్షల వరకు లడ్డూలు తయారవుతుండగా, ప్రత్యేక సందర్భాల్లో ఉత్పత్తిని మరింత పెంచుతోంది. అత్యంత పవిత్రమైన శ్రీవారి ప్రసాదమైన లడ్డూల తయారీ కోసం రోజువారీగా 68 టన్నులకు పైగా ముడి పదార్థాలను టిటిడి వినియోగిస్తోంది. లడ్డూ తయారీకి రోజుకు సుమారు 32 టన్నుల చక్కెర, 16 టన్నుల శెనగపిండి, 16 టన్నుల నెయ్యి, 3.5 టన్నుల జీడిపప్పు, 2 టన్నుల ఎండుద్రాక్ష, 400 కిలోల యాలకులు, 800 కిలోల కలకండ వినియోగిస్తున్నారు.

ఒక్క చిన్న లడ్డూ తయారీకి సగటున 167 నుండి 170 గ్రాముల ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఇందులో సుమారు 78 గ్రాముల చక్కెర, 39 గ్రాముల శెనగ పిండి, 36 గ్రాముల నెయ్యి, 7 గ్రాముల జీడిపప్పు, 3 గ్రాముల ఎండుద్రాక్ష తదితర పదార్థాలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత లడ్డూ ప్రసాదాల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల్లో ఎలాంటి మలినాలు లేకుండా చూసేందుకు శ్రీవారి పోటులో రెండు అత్యాధునిక ఏఐ ఆధారిత కలర్ సార్టింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ముడి పదార్థాల్లోని మలినాలను తొలగించి అత్యుత్తమ నాణ్యత గల ముడి సరుకులను మాత్రమే వినియోగిస్తున్నారు.



### ఎఇఇ నియామక పరీక్షలకు

## మొదటిరోజు 79% హాజరు

**తిరుపతి,ఆగస్టు 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్పీడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న రాత పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం ఉదయం తిరుపతిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, మధ్యాహ్నం చెర్లోపల్లి వద్దనున్న అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తనిఖీ చేశారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా ఎస్పీడిసిఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో ఆదివారం 23 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు 79 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. సంస్థపరిధిలోని 23 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 2,583 మందికిగానూ 2,053 మంది, మధ్యాహ్నం 3,174 మందికిగానూ 2,518 మంది హాజరయ్యారు. మొత్తం కలిపి 5,757 మందికిగానూ 4,571 మంది హాజరైనట్లు వివరించారు. ఎస్పీడిసిఎల్ పరిధిలో 79 శాతం మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరైనట్లు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరీక్షా కేంద్రాల్లో ఉదయం 8,061 మందికిగానూ 6,094 మంది, మధ్యాహ్నం 8,122 మందికిగానూ 6,196 మంది హాజరయ్యారని, అభ్యర్థుల హాజరు 76 శాతంగా నమోదైందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్/హెచ్‌ఆర్ డి సిహెచ్ రామచంద్రరావు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చిన్నరెడ్డప్ప, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది.


తిరుపతి:8712652679,చిత్తూరు:7993147979, నెల్లూరు: 08612320427, అన్నమయ్య: 9440817449, కడప: 08562242457, కర్నూలు: 7382614308,నంద్యాల:7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847.

## సెప్టెంబర్ 1న గుంటూరులో జరిగే నిరసన ర్యాలీకి మద్దతు: భూపతిరాజు రవీంద్ర రాజు

**విజయవాడ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 1న గుంటూరులో ఎపిసిపిఎస్ఇఎ తలపెట్టిన భారీ నిరసన ర్యాలీకి ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు మద్దతు ప్రకటించారు. ఈ భారీ ర్యాలీ నిరసనకి అధిక సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనాలని ఆయన పిలుపునిచారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి రిటైరైన ఎంతోమంది పెన్షన్ విషయములో చాలా ఇబ్బందులకు గురవు తున్నారని, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేసి ఓపిఎస్ అమలు చేస్తామని మాట ఇచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాల న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌తో పవన్ కళ్యాణ్ చర్చించి సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే వేయాలని, ఐఆర్‌ప్రకటించాలని, పెండింగ్ డిఏలు, సరెండర్ లీవ్ బకాయిలు, మెడికల్ రీయంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని చిన్నారి రేవతి మృతి

**సత్తెనపల్లి, ఆగస్టు 23, ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి సెంటర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం రేవతి (12) అనే చిన్నారి లిఫ్ట్‌లో ప్రమాదవశాత్తు ఇరుక్కోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి యజమాని నెల రోజుల క్రితమే ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. చిన్నారి మృతితో వడ్డవల్లి పోలేరమ్మ గుడి సెంటర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రేవతి (ఫైల్)

# స్థానిక ఎన్నికల్లో రూరల్ మండల ఓటర్లు ఎవరి వైపు?

### కూటమి ప్రభుత్వానికా..ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకు వస్తున్న వైసిపికా?: రూరల్ మండల కూటమి, వైసిపి ఆశావహులలో విస్తృత చర్చ

**అనంతపురం రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రూరల్ మండలంలో ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటీసీ అన్ని స్థానాలను మేమే గెలుస్తాము, మేమే గెలుస్తాము అని ధీమాలో కూటమి నాయకులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.స్థానికసంస్థలఎన్నికలుఈఏడాదిచివరిలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అయితే రూరల్ మండలంలోని ఓటర్లు కూటమి కి జై కొడతారా? లేక ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తున్న వైఎస్సార్సీపీకి జై కొడతారా? అన్నది స్థానిక సంస్థలు ఎన్నికల ఫలితాలలోతేలిపోతుంది.ఈ ఏడాదిలోగా స్థానిక సంస్థల మున్సిపల్, పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలను పూర్తి చేస్తేనే గ్రామాలకు 16వ ఆర్థిక సంఘం నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎన్నికల కమిషన్ కూడా ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వసతులపై దృష్టి పెట్టింది. ఈ ప్రక్రియ ఇలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎటువైపు మోగు చూపుతారనేది కూటమి, వైసిపి నాయకులు, టికెట్లు ఆశిస్తున్న అశాహులలో ఉత్కంఠ రేపుతుండం గమనార్హం.రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు సంతృప్తి చెంది జై కొడతారా ? లేక ప్రభుత్వ వైఫల్యాలు ప్రభావం చూపి ప్రతిపక్ష పార్టీ అయినా వైస్సార్సీపీ వైపు ఓటర్లు ముగ్గు చూపి ఓట్లు వేసి గెలిపిస్తారా అనే ఆందోళనలు కూడా మొదలయ్యాయి.

**రూరల్ మండల టిడిపి, వైసిపి ఆశాహులలో విస్తృతంగా చర్చ:** రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి 25 ఎంపీటీసీలు, 22 గ్రామపంచాయతీలు, అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి 11 ఎంపీటీసీ లు,4 గ్రామ పంచాయతీలు మొత్తం అనంతపురం రూరల్ మండలంలో 26 గ్రామ పంచాయతీలు, అదేవిదంగా 36 ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పిటిసి స్థానం ఉన్నాయి. అనంతపురం రూరల్ అతిపెద్ద మండలం, అత్యధిక జనాభా, ఓటర్లు కలిగి జిల్లా కేంద్రంలో భాగమై ఉంది.

రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులనుగెలిపించడంలో రూరల్ మండల ఓటర్లే కీలకపాత్ర పోషిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సహజంగా రాష్ట్రంలో అధి కారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ నే.. మెజార్టీ స్థానాలు గెలుచుకొని అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి ప్రభుత్వ పాలన బాగుందా, లేక, అధ్వానంగా ఉందా అనేది నిర్దేశించనున్నాయి. అక్టోబర్ లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అటు కూటమి, ఇటు వైసిపి ఆశాహుల అభ్యర్థులు ఇప్పటినుంచే గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం పై ప్రజలలో సానుకూలత ఉందా, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు బాగా పనిచేస్తాయా, లేక ఇంకా సూపర్ సిక్స్ హామీలలో చేయలేని హామీలు ముంచుతాయా న్న ప్రశ్నలు కూటమి నాయకులలో తలెత్తుతున్నాయి. ఇక వైసిపిలో కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయంలో సకాలంలో పనులు జరగకపోవడం, సూపర్ సిక్స్ హామీలలో ఇంకా నెరవేర్చని నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు దాటిన వారికి నెలకు 1500, అదేవిధంగా50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు పింఛన్ అందించే పథకం, వీటితోపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ అందించలేదు,ఈ పథకాల వైఫల్యాలతో విసుగు చెంది ప్రజలు ప్రతిపక్షానికే ఓట్లు వేసి మోగ్గు చూపుతారని, వైసిపి నాయకులలో ఆశాభావం వ్యక్తం అవుతుండం గమనార్హం. ఇలాంటి పరిస్థితులలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ టికెట్లు వచ్చి లక్షలాది రూపాయలు ఎన్నికల ఖర్చు చేసిన ప్రజలు గెలుపోటములు ఎలా నిర్ణయిస్తారోనన్న ఆందోళన ప్రధాన పార్టీల టికెట్లు ఆశించే నాయకులలో వ్యక్తమవుతోంది.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

### మంత్రి అచ్చెన్నాయుడు



**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 23, ప్రభాతవార్త:** ప్రాంతాలు అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ సూరాడవానిపేటలో ఆదివారం పర్యటించారు. తొలుత దివంగత నేత మాజీ వైస్ ఎంపీపీ, సూరాడ భీమారావు తొలి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం సరైన రహదారులు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటే నేడు సాధించిన ప్రగతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. 1982 నుంచి దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు నాయకత్వంలో,ప్రజల నిరంతర ఆదరణతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో నడిపించగలిగామని పేర్కొన్నారు. నేటి యువత నాటి పరిస్థితులను, నేటి ప్రగతిని గమనించి అభివృద్ధి ప్రయాణానికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు.

**మూలపేట-భోగాపురం నాలుగు వరుసల రహదారి :** మూలపేట పోర్టు నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు సముద్ర తీరాన్ని ఆనుకుని నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయితే ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయని అన్నారు. అలాగే మూలపేట పోర్టుకు అనుసంధానంగా అనేక పరిశ్రమలు ఈ ప్రాంతానికి రానున్నాయన్నారు. ఇందులో భాగంగా కోరమండల్ పరిశ్రమ ఏర్పాటు కానుందని పేర్కొన్నారు, శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ప్రగతికి ఒక చారిత్రాత్మక ముందడుగు రూ.2,250 కోట్ల పెట్టుబడులతో వచ్చే ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి స్థానిక యువతకు ముందుగానే ఉచిత శిక్షణ అందించి ఉద్యోగాల్లో వారికి తొలి ప్రాధాన్యం కల్పించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రూ.650 కోట్లతో మంచినీటి ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని తెలిపారు. వంశధార జలాలను ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మూలపేట పోర్టు, దాని పరిసరాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమలతో స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అచ్చెన్నాయుడు తెలిపారు.

**మేఘవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ :** మత్స్యకార గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు, లోవోల్టేజీ ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు మేఘవరంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం.. ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జున రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, దుపాన రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాడాన రమణమ్మ,రెడ్డి అప్పన్న, పుక్కళ్ల శ్రీనివాస్, దుపాన కృష్ణ, పరపటి రాజశేఖరరెడ్డి, సూరాడ దాసురాజు, బీజేపీ మండల అధ్యక్షులు దేపిల్లి కామయ్య, శ్రీరంగం రాజులు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులపై సర్కార్ నిర్లక్ష్యం

### ప్రైవేటు సంస్థలను బలీయం చేస్తున్నారు: జగన్ ఆరోపణ



**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు విద్యాసంస్థలను బలీయం చేసే దిశలో ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని మాజీ ముఖ్య మంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. దీని వెనుక ప్రభుత్వ ఉద్దేశపూర్వక చర్యలు ఉన్నాయన్నారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తు చేశారు. మనబడి నాడునేడు కింద రూ. 8,524కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## తిరుమల సమాచారం



### పవిత్ర ప్రతిష్టతో పవిత్రోత్సవాలు ప్రారంభం

**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఆదివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా శాస్త్రోక్తంగా జరిపించే ఈ మూడురోజుల ఉత్సవాల్లో మొదటిరోజు ఆదివారం పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది.మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మళ్ళీ యధాతధంగా యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఎవిఎస్ఒ రాజశేఖర్, అర్చకులు, గృహస్థ భక్తులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 8న విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

#### 7న సిఫార్సులేఖలు స్వీకరించరు



**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశునికి ఈ ఏడాది జరగనున్న రెండు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది.ఈ సంద ర్భంగా 8వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దుచేసింది. దీనికి ముందు సోమ వారం 7వతేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సులేఖలు తీసుకురావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే సెప్టెంబర్ 15వ తేదీ నుండి 24వతేదీ వరకు పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరిం చబోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.17లక్షలు విరాళం

**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. ఆదివారం గుంటూరు జిల్లా సత్తెనపల్లె మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన వినోద్ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 17 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డిడి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.



### శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం

**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనం సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.రాజేశ్వరరావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిప్రకాశ్, రాష్ట్రమంత్రి జనార్ధన్‌రెడ్డి, బిసివై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ ,ఎంఎల్ మాధవి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారం దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## థింసా నృత్యంలో బ్రిక్స్ ప్రతినిధుల హుషారు

### రుషికొండలో విదేశీ అతిథుల సందడి

**విశాఖపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త :** బ్రిక్స్ సదస్సు కోసం విశాఖకు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులు ఆదివారం సాయంత్రం రుషికొండ బీచ్‌లో సందడి చేశారు. రుషికొండ అందాలను ఆస్వాదించిన విదేశీ అతిథులకు ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక కళాకారులు సంప్రదాయ నృత్యాలతో బ్రిక్స్ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. గరగ నృత్య ప్రదర్శనలకు విదేశీ ప్రతినిధులు విశేషంగా ఆకర్షితులై.. కళాకారులతో కలిసి థింసా నృత్యంలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయ కళలపై ఆసక్తి చూపుతూ కళాకారులతో మమేకమయ్యారు. తొట్లకొండలో బౌద్ధ వారసత్వ దర్శనం..అనంతరం బ్రిక్స్ దేశాల ప్రతినిధులు ప్రముఖ బౌద్ధ వారసత్వ పర్యాటక కేంద్రం తొట్లకొండను సందర్శించారు. తొట్లకొండ చారిత్రక ప్రాధాన్యత, బౌద్ధ వారసత్వ విశేషాలను గైడ్ వారికి వివరించారు.బ్రిక్స్ సదస్సుతో విశాఖకు వచ్చిన విదేశీ అతిథులకు నగర ప్రకృతి అందాలతో పాటు స్థానిక సంస్కృతి, సంప్రదాయ కళలు, బౌద్ధ వారసత్వాన్ని పరిచయం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


వార్త

మన వ్యవహారాల విషయంలో మనం మనస్సుతోనూ, ఇతరుల విషయంలో హృదయంతోను ఆలోచించాలి.

- చార్లెస్ జి. రెయినర్

# అధిక ధరల చేవ్రాలు!

ఏదో బంగారం ధర పెరుగుతోంటే ఏమో అనుకున్నాం గానీ ముందు ముందు సామాన్యుడి జీవనవ్యయంపై కూడా దెబ్బతగులుతుందని తెలుసుకునేందుకు చాన్నాళ్లు పట్టింది. నిత్యావసర వస్తువుల ధరలు కూడా అనూహ్యంగా పెరిగిపోయాయి. సాగు బాధలకైతే 'ఎల్‌నినో'బూచిని, చమురు ధరల పెరుగుదలకు పశ్చిమాసియా యుద్ధ బూచిని చూపెట్టడం పరిపాటి అయిపోయింది. తాజాగా బియ్యం ధరలు పెరిగిపోయాయి. ఏ చమురు ధరో పెరిగితే ఎక్కడ్నించో రావాలిగా ఆంక్షలు, అదుపాజ్ఞలు కారణంగా రవాణా చార్జీలు పెరిగాయని అనుకుంటూ సరిపెట్టేసుకోవచ్చు. కానీ నిత్యావసర వస్తువుల పరిస్థితే అర్థం కావడం లేదు. ఒకేసారి సామాన్యుడి వంటింటిపై నిత్యావసరాల ధరల పెంపు పిడుగు పడింది. రిటైల్ చక్కెర ధర 16 ఏళ్ల నాటి గరిష్టానికి చేరిన వారంలోనే బియ్యం ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సీజన్‌ల ప్రభావం అనుకుంటే పొరపాటే. చక్కెర ఎగుమతిలో రికార్డు సృష్టించుకున్న భారత్ చక్కెర దిగుమతులు చేసుకునే స్థాయికి దిగిపోయింది. ఇదేదో ఇప్పటికిప్పుడు 'ఇథనాల్' దెబ్బకు పెరిగిన వ్యవహారంగా చెప్పలేం. గత యేడాది ఆగస్టు 18న కిలో చక్కెర ధర రూ. 46.43 ఉంటే ప్రస్తుతం ఒక నెల రోజుల్లోనే 13 శాతం పెరిగి రిటైల్ ధర రూ. 52.30కు చేరుకుంది. అలా అని మార్కెట్ దుకాణాల్లో అదే రేటుకు అమ్ముతున్నారని అనుకోరాదు. అసలే యుద్ధ సమయం, ఆపై ఎల్‌నినో ఎఫెక్ట్, ఆపై పండుగల తరుణం కనుకనే ఇలా ధరల పెంపులో వ్యత్యాసాలు, తమకు అందుబాటులో లేని ధరలతో ప్రతి వినియోగదారుడు గుండెలు బాదుకుంటున్నాడు. ఒకేసారి వీటన్నిటి ధరలూ మూకుమ్మడిగా దాడి చేయడమంటే సామాన్యుడి జీవనం మీద అధిక బరువు పెట్టడమే. ఈ సందర్భంగా జనానికి ఊరట కలిగించే ఏ చర్యకూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు తీసుకోలేకపోవడం మూలిగే నక్క మీద కొబ్బరికాయ పడిన చందాన ఉంది. పశ్చిమాసియా యుద్ధ సమయంలో విదేశీ దిగుమతులపై రవాణా భారం తడిసిమోపెడైంది. ఉద్యోగుల చేతిలో ఆహారపదార్థాలు చిక్కిశల్యమైపోయాయి. ధరల భారం పెరిగిపోయింది. పెరిగిన ధరలతో వారికి దొరికింది ఇడ్లీకి బదులు బటన్ ఇడ్లీ. బొండా స్థానే పునుగులు చేతికందాయి. అటు ధర పెరిగితే ఇటు తినుబండారం బరువు తగ్గింది. మధ్యలో యుద్ధంఆగినా సామాన్యునికి ఊరట లేదు. ఇక రాదని తేలిపోయింది. ఇక మధ్యాదాయ వర్గాల నెలవారీ బడ్జెట్ బాగా పెరిగిపోయింది. ఈ ధరల పెరుగుదల సీజనల్‌గా వచ్చే భారం కాదు. విధానపరమైన లోపాలు, ముందస్తు ప్రణాళిక లేక డిమాండ్, సప్లై జాగ్రత్తలు తీసుకున్నామనే విషయంపై పూర్తి అవగాహన పాలకులకు లేకపోవడమే. ఈ యేడాది రుతుపవనాల లోటు, వాతావరణ అంతరాయాలతో కూరగాయల ధరలు అత్యధికంగా పెరిగాయి. ఉల్లి ధర అత్యంత వేగంగా పెరిగిపోయింది. బియ్యం, చక్కెర కూరగాయలు ఒకేసారి పెరిగితే ప్రత్యామ్నాయం దొరకదు. గంజి మెతుకులతో సరిపెట్టుకుందామనుకున్నా బియ్యం కిలో 65 రూపాయలకు చేరుకుంది. ప్రభుత్వాలు రేషన్ బియ్యం సరఫరాచేస్తున్నా అవి తెల్లరేషన్ కార్డుల వారికే. తెలంగాణలో సన్నబియ్యం ఇస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ముతకబియ్యమే. ముతక బియ్యం తినేందుకు వీలుగా ఉండవని ప్రతీతి. కేవలం దోసెలకుమాత్రమే వినియోగిస్తుంటారు. రేపోమాపో రేషన్ బియ్యం రేటు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రతి కుటుంబానికి బియ్యం, పంచదార, నిత్యావసర వస్తువులు సమకూర్చడానికి చేస్తున్న ప్రయత్నాలు సామాన్యుడికి పెద్దగాఅందుబాటులోలేవు. ఇలా నిత్యావసర వస్తువుల ధరలుఒకేసారి పెరిగితే, వాటి ధరలు అదుపు తప్పితే దాని ప్రభావం వంటింటి ఖర్చునుండి ఆర్థికవ్యవస్థ వరకు ఉంటుంది ధరల నియంత్రణలో ప్రభుత్వం వ్యాపార వర్గాలు, వినియోగదారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. సరఫరా వ్యవస్థల బలోపేతం, అక్రమ నిల్వల్ని వెలికితీయడం, కృత్రిమ కొరతను అరికట్టడమూ అవసరమే. చక్కెర దేశీయ ఉత్పత్తి తగ్గడాన్ని ప్రభుత్వం నిర్ద్వంద్వంగా ప్రకటించినా, వాతావరణ ప్రభావం పెరుగుతున్నడిమాండ్‌లకనుగుణంగా సరకు సేకరణ, నిల్వలు తగ్గకుండా అజమాయిషీ చేయగల వ్యవస్థను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. చక్కెర ధర పెరగడానికి, కొరత ఏర్పడడానికి ప్రత్యేక కారణం ఒకటి వినిపిస్తోంది. చాలా విచిత్రంగా ఉంది. అక్టోబరు 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త సీజన్‌కు ఓపెనింగ్ స్టాక్ దాదాపు 35 లక్షల టన్నులకు పడిపోయింది. ఇది గత మూడు దశాబ్దాల్లో అత్యల్పం. ఈ విషయంపై ముందే అవగాహన ఉన్నా ప్రభుత్వం మేల్కోలేదు. దాదాపు 10 ఏళ్ల తర్వాత మొదటిసారిగా 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఇదేకాకుండా నెలకు 10టన్నుల కన్నా ఎక్కువ చక్కెర వాడే బల్క్ వినియోగదారులకు, మిఠాయి దుకాణాలు, సాఫ్ట్‌డ్రింక్ కంపె నీలు, 15 రోజుల అవసరానికి మించి నిల్వ ఉంచరాదని సరి కొత్తగా ఉత్తర్వులు ప్రభుత్వం సవరించింది. కొరత రాబో తోందని తెలిసి తప్పుడు ఉత్పత్తి అంచనాలతో ముందు ఎగుమతులకు అనుమతినిచ్చి తర్వాత సరుకు నిల్వలు అవసరానికి మించి లేనప్పుడు చేతులు కాలక ఆకులు పట్టుకున్న చందాన ఏంచేయాలో తోచక ప్రభుత్వం చేతులెత్తేసింది. రానున్న మూడు నెలలు పండుగల కోసం చక్కెర వినియోగం ఎక్కువే. నిల్వలు ఖాళీ చేసుకుని ఇప్పుడు అంత చక్కెరను మార్కెట్లో 14 నెలల గరిష్ట ధరకు కొంటున్నాం. ప్రజావసరాలను సంయమనంతో బేరీజు చేసుకోకుండా వినియోగదారుల నెత్తిన అధిక ధరలు రుద్దడం ఇదే మొదటిసారి కాదు. ఆఖరిసారీ కాదు.



వస్త్రధారణ మనసును తెలిపేదిగా ఉండాలి. అంటే వస్త్రాలను బట్టి మనసు శుభ్రతను అర్థం చేసుకోగలగాలి.

మహాత్మా గాంధీ



బహిరంగంగా కన్పించే మురికి గుంటలకన్నా, మనసులో మాలిన్యంగల వ్యక్తుల వల్లే జాతికి ప్రమాదం.

డా॥ రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### ఉద్యోగాల సృష్టి కీలకం

భారత ఆర్థికవ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలువిస్తృతంగా ప్రజలకు చేరాలంటే ఉద్యోగాల సృష్టి కీలకం. 2026-27 తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి సుమారు 7.3శాతంగా ఉండవచ్చన్న అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే ఏప్రిల్-జూన్ 2026 పీఎల్ఎఫ్ఎస్‌ప్రకారం దేశవ్యాప్త నిరుద్యోగరేటు 5.4 శాతంగా ఉండగా, 15-29 ఏళ్ల యువతలో అది 15.9 శాతంగా ఉంది. పట్టణ యువత, యువమహిళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. అందువల్ల తదుపరి వృద్ధి దశను ఉద్యోగ కేంద్రితంగా మార్చాలి. మాన్యుఫ్యాక్చరింగ్, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ భాగాలు, నిర్మాణం, పర్యాటకం, లాజిస్టిక్స్ వంటి శ్రమాధారిత రంగాలను విస్తరించాలి. టైర్-2, టైర్-3 నగరాల్లో ఉపాధికేంద్రాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లుఅభివృద్ధి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలో అయితే అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలోయథేచ్ఛగాసంచరిస్తున్నారు. సాధారణంగా సూర్య కిరణాల వేడిమి30నుంచి 35డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగాఉంటాయి. ఈకిరణాలుచర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది.

- పి. వెంకట్, సికింద్రాబాద్

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం ఠంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి, చిన్న, సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో, కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలా లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపాలి.

-కె. రామారావు, నల్గొండజిల్లా

### ఆరోగ్యమే మహాభాగ్యం

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఇడ్లీ, రైస్‌సాంబర్ లేదా ఇతర బలమైన ఆహారంతో మెత్తగా కలిపి తినిపించడం చూస్తుంటాము. ఇకచాలు అన్నా కూడా వినకుండా చందమామ, కాకమ్మ కథలు చెబుతూ బలవంతంగా ముద్దనోట్లో కుక్కుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి అజీర్తి, వాంతులు చేసుకొని ఏడుస్తుంటారు. దాంతో కన్నవాళ్లకు ఆందోళన కలగడం సహజం. ఇది ఏమాత్రం బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యనిపుణులు చెబుతుంటారు. చిరుతిళ్లు తినే పిల్లలకు ఆకలి మందగించడం వల్ల ఫుడ్ సరిగ్గా తినరు. కావున వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఎదిగే పిల్లలకు వెరైటీగారాగిజావ, ఉడికించిన కూరగాయలు, అన్నంలో కలిపి పెట్టాలి. అలాగే ఫ్రూట్ సలాడ్స్ అందించాలి.

- ఆర్.వి.చరన్, బెంగళూరు

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంతజాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈ కోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపుకాకుండా వినియోగదారుఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటనే భర్తీచేసి కేసులు వేగవంతం చేయాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### నగదు కొరత

ఒకప్పుడు బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు నేరుగా వెళ్లి నగదు తీసుకునే పరిస్థితి వుండేది. ప్రస్తుతం దేశమంతటా ఏటిఎంలు రావడంతో ఖాతాదారుడు బ్యాంకు శాఖలకు వెళ్లి నగదు తీసుకునే శ్రమ చాలా వరకూ తప్పింది. దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖలు తమ ఖాతాదారులకు ఏటిఎం కార్డుల సదుపాయంఅందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే దేశవ్యాప్తంగా కొన్ని నగరాల్లోని ఏటిఎంలలో బ్యాంకులు సరిపడా నగదు నిల్వలు ఉంచడం లేదు. ఈ విషయం లో ఆర్‌బిఐ అన్ని బ్యాంకుల శాఖలకు దిశానిర్దేశం చేసి ఏటిఎంలలో నగదు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

-జి. అశోక్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామీణ మహిళల శ్రమకు విలువ పెరగాలి

*గ్రామీణ మహిళల కోసం ఇప్పటికే ఉన్న పథకాల మధ్య సమన్వయం చేయడం ముఖ్యం. వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి. ఈ వ్యవస్థలో ఒక భాగం బలహీనంగా ఉన్నా మహిళల ఆదాయం పెరగడం కష్టం. గ్రామీణ మహిళలు పనిలోకి వస్తున్న సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు వారి పనికి వచ్చే ఆదాయం కూడా పెరగాలి. వారు చేసే పని స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వాలి. తాము సంపాదించిన డబ్బుపై నిర్ణయం తీసుకునే హక్కు కూడా పెరగాలి. భారతదేశానికి ఇప్పుడు అవసరమైనది మహిళల శ్రమను మరింత పెంచడం కాదు, వారు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ కల్పించడం. అదే గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచుతుంది. అదే గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలపరుస్తుంది.*

డి జె మోహన రావు

'వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి". భారతదేశంలో గ్రామీణ మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరుగుతోంది. అయితే దీనిని ఆర్థిక పురోగతిగా చూడటానికి ముందు ఒక ప్రశ్నకు సమాధానం కావాలి. మహిళలు ఎక్కువగా పనిచేస్తున్నారా, లేక వారి ఆదాయం, ఆర్థిక భద్రత కూడా పెరుగుతున్నాయా? 2026 జూన్‌లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల గ్రామీణ మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 36.6 శాతానికి చేరింది. 2025 జూన్‌లో ఇది35.2 శాతం. అంటే ఏడాదిలో 1.4 శాతం పాయింట్లు పెరిగింది. ఇది సానుకూల మార్పే. అయితే ఈ గణాంకం పని లేదా పని కోసం ప్రయత్నాన్ని మాత్రమే సూచిస్తుంది. ఆ పని ద్వారా వచ్చే ఆదాయాన్ని కాదు. అందువల్ల తదుపరివిధాన లక్ష్యం మహిళల పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ఎక్కువ ఉత్పాదకత, ఎక్కువ ఆదాయంగా మార్చడం కావాలి. ఒక మహిళ తక్కువ ఆదాయం వచ్చే పనిలో ఎక్కువ సమయం గడిపినా, ఆమె శ్రామిక శక్తిలో భాగంగా లెక్కించబడవచ్చు. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితిలో పెద్ద మార్పురాదు. వ్యవసాయం దీనికి స్పష్టమైన ఉదాహరణ. మహిళలు సాగు, పశుపోషణ, పంటల కోత తర్వాతి పనుల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. అయితే వారి ఆదాయం పెరగాలంటే భూమి, రుణం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ సలహాలు, మార్కెట్లకు మెరుగైన ప్రాప్యత అవసరం. తాము పని చేసే వనరులపై, ఆ పని ద్వారా వచ్చే ఆదాయంపై మహిళలకు ఎక్కువ నియంత్రణ ఉన్నప్పుడే పెరిగిన శ్రామిక భాగస్వామ్యం కుటుంబ ఆదాయాన్ని పెంచుతుంది. ఇక్కడ అసలు లక్ష్యం మహిళలు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ తీసుకురావడం. వ్యవసాయ ఉత్పత్తిని సాధారణ రూపంలో విక్రయించడానికి బదులు శుద్ధి చేయడం, నిల్వ చేయడం, ప్యాక్ చేయడం, విలువ పెంచిన ఉత్పత్తిగా మార్చడం ద్వారా ఆదాయాన్ని పెంచవచ్చు. ఇందుకు గ్రామ స్థాయిలో అవసరమైన పరికరాలు, నిల్వ కేంద్రాలు, నాణ్యత పరీక్షలు, మార్కెట్ సమాచారం అందాలి. ఇలా చేస్తే మహిళలు తక్కువ ఆదాయం వచ్చే పనుల నుంచి ఎక్కువ ఆదాయం వచ్చే దశల్లోకి వెళ్లగలరు. స్వయం సహాయక సంఘాలు ఈ మార్పుకు ఉపయోగపడగలవు. ఇప్పటివరకు అవి ప్రధానంగా పొదుపు, చిన్నరుణాలకు ఆధారంగా ఉన్నాయి. ఇక వాటిని వ్యాపారాలను పెంచే వేదికలుగా మార్చాలి. 2026 జూన్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 700 స్వయం సహాయక వ్యాపార కేంద్రాలు, 1,000 జిల్లా స్థాయి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రకటించింది. ఉత్పత్తి రూపకల్పన, ప్యాకేజింగ్, నాణ్యత, మార్కెట్‌కు సిద్ధం చేయడంపైనా దృష్టిపెట్టింది. ఈ కేంద్రాలు మహిళలను రుణాలు తీసుకునే స్థాయి నుంచి ఉత్పత్తి చేసి, విక్రయించే స్థాయికి తీసుకెళ్లాలి. లఖ్‌పతి దీదీ కార్యక్రమం ఈ మార్పుకు స్పష్టమైన ఆదాయ లక్ష్యాన్ని ఇచ్చింది. ప్రభుత్వం మొదట మూడు కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని, దాన్ని ముందుగానే చేరుకున్న తర్వాత 2029మార్చి నాటికి ఆరు కోట్లకు పెంచింది. 2026 జూలై నాటికి3.46 కోట్లకుపైగా స్వయం సహాయక సంఘాల సభ్యులు లఖ్‌పతి దీదీలుగా గుర్తించబడ్డారు. ఈ పథకంలో సంవత్సరానికి



కనీసం లక్ష రూపాయల ఆదాయం రావడమే కాకుండా, అది కనీసం నాలుగు వ్యవసాయ కాలాలు లేదా వ్యాపార చక్రాలపాటు నిలకడగా ఉండాలనే ప్రమాణం ఉంది. కాబట్టి తదుపరి దశ లక్ష రూపాయల ఆదాయాన్ని చేరుకోవడంతో ముగియదు. ఆ ఆదాయం ప్రతి సంవత్సరం కొనసాగి, క్రమంగా పెరిగేలా చేయడం తదుపరి లక్ష్యం. అయితే ఉత్పత్తి చేసినంత మాత్రాన ఆదాయం పెరగదు. దానికి సరైన మార్కెట్ కూడా కావాలి. ఒక మహిళ తయారు చేసిన వస్తువుకు కొనుగోలుదారు లేకపోతే, మంచి ధర రాకపోతే లేదా నిల్వ, రవాణా ఖర్చులు ఎక్కువైతే ఆమె వ్యాపారం ఎదగదు. అందువల్ల మహిళా వ్యాపారాలకు ప్రభుత్వ కొనుగోళ్లు, పెద్ద మార్కెట్లతో అనుసంధానం, ఉమ్మడి ప్యాకేజింగ్-నిల్వ సదుపాయాలు, నాణ్యత ధ్రువీకరణ వంటి మద్దతు అవసరం. రుణంవ్యాపారాన్ని ప్రారంభిస్తుంది. మార్కెట్ దాన్ని ఆదాయంగా మారుస్తుంది. మార్కెట్, రుణం ఉన్నా మహిళలకు వాటిని ఉపయోగించడానికి సమయం లేకపోతే ప్రయోజనం పరిమితమవుతుంది. 2024 కాల వినియోగ సర్వే ప్రకారం 15-59 ఏళ్ల మహిళల్లో 24.9శాతం మంది వేతనంతో కూడిన కార్యకలాపాల్లో పాల్గొంటే, పురుషుల్లో ఈ వాటా 74.5 శాతం. ఇదే వయస్సులో వేతనం లేని సంరక్షణ పనుల్లో మహిళల భాగస్వామ్యం 93.9 శాతం కాగా, పురుషుల్లో 45 శాతం. పిల్లల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, మెరుగైన రవాణా, ఇంటి పనిని తగ్గించే సదుపాయాలు అందుబాటులో ఉంటే మహిళలకు ఆదాయం వచ్చే పనికి ఎక్కువ సమయం దొరుకుతుంది. అందువల్ల వీటిని సంక్షేమ కార్యక్రమాలతో పాటు మహిళల ఆర్థిక భాగస్వామ్యానికి అవసరమైన సదుపాయాలుగా చూడాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా మహిళలవ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించగలదు. ఫోన్, అంతర్జాలం అందుబాటులో ఉండటంతో పాటు ధర నిర్ణయించడం, లెక్కలు నిర్వహించడం, డిజిటల్ చెల్లింపులు తీసుకోవడం, ఆన్‌లైన్‌లో వస్తువులు విక్రయించడం, వినియోగదారులతో వ్యవహరించడం వంటినైపుణ్యాలు కూడా అవసరం. అందువల్ల సాంకేతిక శిక్షణను సాధారణ అవగాహనకు పరిమితం చేయకుండా మహిళలు చేస్తున్న పనికి నేరుగా ఉపయోగపడేలా రూపొందించాలి. మహిళల ఆర్థిక పురోగతిని కొలిచే విధానంలో కూడా మార్పు అవసరం. మహిళల శ్రామిక భాగస్వామ్యం ఎంత పెరిగిందన్నది ఒక సంఖ్య మాత్రమే. వారు ఎంత సంపాదిస్తున్నారు, వారి వ్యాపారం ఎంతకాలం కొనసాగుతోంది, ఎంత రుణం అందుతోంది, ఉత్పత్తికిఎంత మంచి ధర వస్తోంది, తమ సంపాదనపై నిర్ణయంతీసుకునే అవకాశం ఎంత ఉందన్నదీ తెలుసుకోవాలి. అప్పుడు ఏ పథకం మహిళలను పనిలోకి తీసుకువస్తుందో, ఏ పథకం వారి ఆదాయాన్ని నిజంగా పెంచుతుందో స్పష్టంగా తెలుస్తుంది. అందువల్ల గ్రామీణ మహిళల కోసం ఇప్పటికే ఉన్న పథకాల మధ్య సమన్వయం చేయడం ముఖ్యం. వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి. ఈ వ్యవస్థలో ఒక భాగం బలహీనంగా ఉన్నా మహిళల ఆదాయం పెరగడం కష్టం. గ్రామీణ మహిళలు పనిలోకి వస్తున్న సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు వారి పనికి వచ్చే ఆదాయం కూడా పెరగాలి. వారు చేసే పని స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వాలి. తాము సంపాదించిన డబ్బుపై నిర్ణయం తీసుకునే హక్కు కూడా పెరగాలి. భారతదేశానికి ఇప్పుడు అవసరమైనది మహిళల శ్రమను మరింత పెంచడం కాదు, వారు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ కల్పించడం. అదే గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచుతుంది. అదే గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలపరుస్తుంది. ●

# ఆయుధ లైసెన్స్‌లను సమీక్షించడం అవసరం

శ్రీశైలం దూడం


తుపాకీ చేతిలో ఉండటం రక్షణకు అవసరం కావచ్చు. కానీ అదే తుపాకీ ఎదుటివారి గుండెల్లో భయం పుట్టించే సాధనంగా మారితే? లైసెన్సు ఉన్న ఆయుధం చట్టబద్ధమైనదే కావచ్చు. దాన్ని ఉపయోగించే తీరు మాత్రం చట్టబద్ధంగా ఉండాలి. ఇక్కడే అసలు ప్రశ్నమొదలవుతుంది. నక్సలిజంముప్పు తగ్గడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు తన భద్రతను తగ్గిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా ప్రకటించారు. భద్రతా ముప్పు తగ్గిందని భావించి ముఖ్యమంత్రి, డీజీపీ స్థాయి వ్యక్తులకే రక్షణను పునఃపరిశీలిస్తున్నప్పుడు సాధారణ వ్యక్తుల వద్ద కొనసాగుతున్న ఆయుధ లైసెన్సుల అవసరాన్ని కూడా ఒకసారి పరిశీలించాల్సిన సమయం రాలేదా? నిన్నటి ముప్పు ఈరోజు లేకపోతే..నిన్నటి అనుమతిని ఈరోజు కూడా ఎందుకు కొనసాగించాలి? లైసెన్సు మంజూరు చేసిన నాటి పరిస్థితులు మారితే ఆ అవసరం ఇంకా ఉందా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాదా? 2025 మేలో అప్పటి డీజీపీ జితేందర్ వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 7,125 చెల్లుబాటు అయ్యే ఆయుధ లైసెన్సులు, 9,294 నమోదిత ఆయుధాలు ఉన్నాయి. గత మూడేళ్లలో 510 కొత్త లైసెన్సులు మంజూరయ్యాయి. ఇవి కేవలం గణాంకాలు కావు. ప్రతి లైసెన్సు వెనుక ఒక వ్యక్తి, ఒక ఆయుధం, ఒక బాధ్యత ఉంది. అందుకే ప్రశ్న కొత్త లైసెన్సులు ఎన్ని ఇచ్చారన్నదే కాదు. ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? ఆ అవసరం ఇప్పటికీ ఉందా? ఆయుధం ఎలా ఉపయోగిస్తున్నారు? అన్నదే. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, భూవివాదాలు, వ్యక్తిగత తగాదాలు, సెటిల్‌మెంట్లలో ఆయుధ ప్రదర్శన జరుగుతోందనే ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి. ప్రతి ఆరోపణ నిజమని చెప్పడం కాదు. కానీఫిర్యాదు వచ్చినప్పుడు లైసెన్సు ఉందన్న ఒక్క కారణంతో దాన్నితేలిగ్గా తీసుకోవడం కూడా సమంజసం కాదు. తుపాకీని చూపించడం ద్వారా ఎదుటివారిపై మానసిక ఒత్తిడి తెస్తే అది రక్షణ భావనను దాటి పెత్తనానికి దారితీసినట్టే. తుపాకీ చట్టంఇచ్చిన అనుమతి కావచ్చు. కానీ సమాజంపై ఆధిపత్యానికి అది పాస్‌పోర్టు కాదు. సైబర్ నేరగాడు తెరవెనుక నుంచి ప్రజల డబ్బును దోచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆయుధాన్ని దుర్వినియోగం చేసే వ్యక్తి మాత్రం సమాజం కళ్లముందే భయాన్ని సృష్టించే అవకాశం ఉంది. మార్గాలు వేరు కానీ ప్రజల భద్రతకు ముప్పు కలిగితే రెండింటినీ చట్టం సమానంగా చూడాలి. అందుకే పోలీసు నిఘా కేవలం అక్రమ ఆయుధాలపైనే కాకుండా చట్టబద్ధంగా ఉన్న ఆయుధాల దుర్వినియోగంపైనా ఉండాలి. పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తున్న డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆయుధ లైసెన్సుల సమీక్ష మరో ముఖ్యమైన పరీక్ష కావచ్చు. రాజకీయ పలుకుబడి, ఆర్థిక స్థాయి, సామాజిక ప్రభావం వంటి వాటికి అతీతంగా ప్రతి లైసెన్సును ఒకే ప్రమాణంతో పరిశీలించగలిగితే అది ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. నిజమైన ముప్పు ఉన్నవారికి ఆయుధం అవసరం కావచ్చు. కానీ అవసరం ముగిసినప్పుడు సమీక్ష కూడా అవసరమే. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం లైసెన్సుపై చర్య తీసుకోవడం కూడా అదే వ్యవస్థ బాధ్యత. సమాజంలో ఒక ప్రమాదకరమైన భావన పెరగకూడదు 'నా దగ్గర గన్ ఉంది నన్నెవరూ ఏమీ చేయలేరు' అనే ధోరణి. చట్టం ఇచ్చిన లైసెన్సు చట్టం నుంచి మినహాయింపు కాదు. ప్రజాస్వామ్యంలో అసలైన బలం తుపాకీ గొట్టంలో ఉండదు. చట్టంపై నమ్మకంలో ఉంటుంది. భయంతో వచ్చిన గౌరవం గౌరవం కాదు. అది మౌనంగా భరించిన భయం. అందుకే రాష్ట్రంలోఆయుధ లైసెన్సులపై ఒకసారి సమగ్ర సమీక్ష జరగాలి. ముప్పు ఉన్న వారిని రక్షించాలి. అవసరం లేనివారిని గుర్తించాలి. దుర్వినియోగం నిర్ధారణైన చోట చట్టం తనపని తానుచేయాలి. ఎవరి పలుకుబడి ఎంత ఉన్నా ప్రమాణం ఒక్కటే కావాలి. తుపాకీ రక్షణకు ఉండాలి, పెత్తనానికి కాదు. లైసెన్సు హక్కు కాదు బాధ్యత. భద్రత పేరుతో వచ్చిన ఆయుధం సమాజానికి భయంగా మారకూడదు. అప్పుడే ప్రజలు పోలీసు వ్యవస్థను కేవలం భద్రత కల్పించే సంస్థగా కాకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించే వ్యవస్థగా విశ్వసిస్తారు. ●

# బలూచిస్థాన్ స్వాతంత్ర్యంపై తటస్థ వైఖరి మేలు



కృష్ణ బాలాజి పల్లపోతు

అరేబియా సముద్ర తీరంలోని బలూచిస్థాన్‌లో, మక్రాన్ పర్వత శ్రేణుల్లో హింగోల్ నది ఒడ్డున ఉన్న ఒక గుహలో హింగ్లాజ్ మాతకొలువై ఉంది. సతీదేవి పురాణగాథతో ముడిపడిన ఈ ప్రాచీన క్షేత్రం హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్య క్షేత్రాల్లో ఒకటి. ప్రతి ఏడాది వసంత కాలంలో జరిగే హింగ్లాజ్ యాత్రకు పాకిస్థాన్‌లోని హిందువులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల మధ్య కాలినడకన సాగే ఈ యాత్రను, స్థానిక ముస్లింలు కూడా 'నానీ కా హజ్'గా గౌరవించడం, ఆ క్షేత్రానికి ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. బలూచిస్థాన్ చరిత్రలో 1947 ఆగస్టు ఒక కీలక అధ్యాయం. అప్పట్లో బలూచ్ ప్రాంతంలోని పలు రాజకీయ సంస్థానాల్లో 'కలాత్ ఖానేట్' ఒకటి. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆ సంస్థానానికి చివరి పాలకుడు మీర్ అహ్మద్ యార్ ఖాన్ అహ్మద్‌జై. బ్రిటిష్ పాలన ముగింపు దశలో, అహ్మద్‌జై కలాత్ కు స్వతంత్ర హోదాను కొనసాగించాలని కోరారు. జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్‌తో కుదిరిన ఒక అవగాహనలో, కలాత్ సంస్థానాన్ని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించే ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. కానీ పాకిస్థాన్ ఏర్పడిన తర్వాత ఆ వైఖరిలోమార్పు రావడంతో, చివరకు 1948 మార్చి 27న కలాత్ పాకిస్థాన్‌లో విలీనమైంది. అయితే అంతటితో బలూచ్ స్వాతంత్ర్య ఆకాంక్ష సుఖాంతం కాలేదు. 1948లో అహ్మద్‌జైసోదరుడు ప్రిన్స్ అబ్దుల్ కరీమ్ నేతృత్వంలో సాయుధ ప్రతిఘటన మొదలైంది. ఆ తర్వాత పలు దశల్లో పెద్దఎత్తున తిరుగుబాట్లు జరిగాయి. 2003 నుంచి కొనసాగుతున్న ప్రస్తుత దశలో బలూచ్ వేర్పాటు వాదసంస్థల సాయుధ కార్యకలాపాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. 2026 ప్రారంభంలో బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఒకేసారి జరిగిన దాడుల్లో భద్రతా బలగాలు, పోలీస్ స్టేషన్లు, ఇతరప్రభుత్వ సంస్థలు లక్ష్యంగా మారాయి. ఈ దాడులకు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత ప్రకటించుకుంది. ఇప్పుడు, కలాత్‌ను స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించే అవగాహన కుదిరిన 8 దశాబ్దాల తరువాత, ఫ్రీ బలూచిస్థాన్ మూవ్‌మెంట్‌కు చెందిన 'మిర్ యార్ బలూచ్' ఈ సంవత్సరం జూలైలో బలూచిస్థాన్ భూభాగానికి, రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ పేరుతో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం ప్రకటించారు. 1947లో కలాత్ సంస్థానానికి స్వతంత్ర సార్వభౌమ హోదాను గుర్తిస్తూ కుదిరిన అవగాహనను, నేటి విస్తృత బలూచిస్థాన్ స్వాతంత్ర్యానికి చారిత్రక ఆధారంగా ఈ ఉద్యమం చూపుతోంది. ఈ నేపథ్యంలో, ఈ ఉద్యమ నాయకులు తమ స్వాతంత్రాన్నిగుర్తించాలని ఐక్యరాజ్యసమితితోపాటు అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ప్రత్యేక జెండా, జాతీయ గీతం, కరెన్సీ, పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకొన్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ స్వయంప్రకటనకు ఇప్పటివరకు ఏ దేశం లేదాఅంతర్జాతీయ సంస్థ గుర్తింపు ఇవ్వలేదు. అనేక వేర్పాటువాద సంస్థలు, వర్గాలు వేర్వేరు స్థాయిల్లో పనిచేస్తున్నాయి. కలాత్ సార్వభౌమత్వాన్ని మొత్తం బలూచిస్థాన్ స్వాతంత్ర్యానికి చారిత్రక



ఆధారంగా చూపే ఈ వివరణను, అన్నివర్గాలు అంగీకరిస్తున్నాయా అన్నది కూడా స్పష్టం కాలేదు. మిర్ యార్‌బలూచ్ ప్రకటనకు మిగిలిన వర్గాలన్నింటి అంగీకారం, బలూచ్‌ప్రజల విస్తృత మద్దతు ఉందని చెప్పడానికి ఆధారాలులేవు. పైగా, 1933 నాటి మోంటెవీడియో కన్వెన్షన్‌లో పేర్కొన్న ప్రమాణాల ప్రకారం ఒకస్వతంత్ర రాజ్యానికి నిర్దిష్ట భూభాగం, ప్రభుత్వం, ఇతర దేశాలతో సంబంధం నెరిపే సామర్థ్యం వంటి లక్షణాలు ఉండాలి. ఈ ప్రమాణాల దృష్టితోచూసినా, ఆ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా గుర్తించడానికి తగిన పరిస్థితులు లేవు. అందువల్ల ప్రస్తుత పరిణామాన్ని, బలూచ్ జాతీయవాద ఉద్యమంలోని ఒక వర్గం, తన స్వాతంత్ర్య డిమాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు సాధించే దిశగా తెస్తున్న ఒత్తిడిగా మాత్రమే చూడాలి. విస్మరించలేని మరో కోణంచైనా. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ప్రణాళికలో అంతర్భాగమైన చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌లో గ్వాదర్ కీలక భాగం. అయితే గ్వాదర్ ఉన్నప్రాంతంలోనే బలూచ్ వేర్పాటు వాదం బలంగా ఉండటం, చైనా ప్రాజెక్టులు, సిబ్బందిపై తరచూ దాడులు జరగడం బీజింగ్‌కు భద్రతా పరమైన సవాలుగా మారింది. భారత్ ప్రయోజనాల దృష్ట్యా కూడా ఈ పరిణామాలకు ప్రాధాన్యం ఉంది. చైనా వ్యూహాత్మక విస్తరణకు భద్రతాపరమైన సవాళ్లు పెరగడం, ఆ విస్తరణ వేగాన్ని పరిమితం చేయడం భారతదేశానికి అయాచితంగా వ్యూహాత్మక ప్రయోజనాన్ని కలిగించే అంశాలే. అందువల్ల బలూచిస్థాన్ ఉద్యమాన్ని భారత్, పాకిస్థాన్ అంతర్గత సమస్యగా మాత్రమే కాకుండా, తనకు కీలకమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా ఉనికికి సవాలు విసరగల అంశంగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. అంతేగాక, బలూచిస్థాన్‌లో అస్థిరత మరింత తీవ్రమైతే, అది భారత్-పాకిస్థాన్ సరిహద్దు భద్రతపైనా పరోక్షప్రభావం చూపే అవకాశం కూడా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం. బలూచిస్థాన్ చర్చకు వచ్చినప్పుడల్లా, బలూచ్ వేర్పాటువాద ఉద్యమానికి భారత్ మద్దతు ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తూ వస్తోంది. భారత్ మాత్రం ఇటువంటి ఆరోపణలను ఖండిస్తూ, బలూచిస్థాన్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేస్తూవచ్చింది. ఈ నేపథ్యంలో తాజా స్వాతంత్ర్య ప్రకటనపై భారత్ వైఖరి ఎలా ఉండాలి, అవసరమైతే ఎలా ప్రతిస్పందించాలి, ఈ పరిణామం భారత ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది అన్నవి ముఖ్యమైన ప్రశ్నలు. ఈ సందర్భంలో మరో అంశం కూడా ప్రస్తావించుకోవాలి. పాకిస్థాన్ బలూచిస్థాన్‌లోని స్వాతంత్ర్య డిమాండ్‌ను మాత్రం తన అంతర్గత వ్యవహారంగా కొట్టిపారేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎత్తిచూపడం ద్వారా పాకిస్థాన్ వాదనలోనిడొల్లతనాన్ని, ద్వంద్వనీతిని భారత్ చాకచక్యంగా ఎండగట్టవచ్చు. అయితే, పాకిస్థాన్‌కు అసౌకర్యం కలిగించే ప్రతి అంశానికి బహిరంగంగా మద్దతు తెలపడం భారత్ అనుసరిస్తూ వస్తున్న, సంయమనంతో కూడిన దౌత్యనీతికి అనుగుణంగా ఉండదు. దానికి తోడు బలూచిస్థాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించడం, ఆ ఉద్యమానికి బహిరంగ మద్దతు ఇవ్వడం వంటి ప్రతికూల నిర్ణయాలు, పాకిస్థాన్ అంతర్గత ఘర్షణలో భారత్‌ను ప్రతినాయకుడి పాత్రలో నిలబెడతాయి. భారత్ ఇతర దేశాల్లోని వేర్పాటువాద ఉద్యమాలను ప్రోత్సహిస్తోందన్న పాకిస్థాన్ ప్రచారానికి బలం చేకూర్చినట్లవుతుంది కూడా. అదే అలుసుగా కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ మరింత దూకుడు ప్రదర్శించే అవకాశమూ ఉంటుంది. అందుచేత ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజంలోని ఇతర దేశాల మాదిరిగానే బలూచిస్థాన్ స్వాతంత్ర్య ప్రకటనను గుర్తించకుండా, ఉద్యమానికి అధికారిక మద్దతు ఇవ్వకుండా తటస్థంగా ఉండటం భారత్‌కు సముచితమైన మార్గం. ●

# అంతరిక్ష రంగంలో 'జెన్‌జి' ముందంజ



## సరికొత్త టెక్నాలజీల ఆవిష్కరణ

## జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ వ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక ఆయస్కాంతంలా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జెన్‌జీ యువత సరికొత్త టెక్నాలజీలను నిర్మిస్తోందని ప్రశంసించారు. ఆదివారం ప్రధాని మోడీ తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నారు. అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ పేర్కొన్నారు. స్పేస్ సెక్టార్‌లోని స్టార్టప్‌ల సిఇఒలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జెన్‌జీ యువత సరికొత్త టెక్నాలజీని నిర్మిస్తోందని ప్రశంసించారు. అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ పేర్కొన్నారు. దేశ యువతను కొనియాడుతూ ఈ రోజు మన జెన్‌జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారన్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోందన్నారు.

ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు. 2023లో ఇదేరోజున చంద్రయాన్3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దేశ యువతను కొనియాడుతూ ఈ రోజు మన జెన్‌జీ ఇంజనీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు, మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోందిఅని అన్నారు. ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు. 2023లో ఇదే రోజున చంద్రయాన్3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ యేడాది ఆవిష్కరణ, సహకారం, ప్రపంచ అంతరిక్ష నాయకత్వం" అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ, దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు ఎంతో అవసరమని పిలుపునిచ్చారు.



# హాఫీజ్ సయీద్‌కు ఎన్ఐఎ కోర్టు సమన్లు

## పహల్గాం ఉగ్రదాడి కేసులో బిగుసుకొంటున్న ఉచ్చు

**న్యూఢిల్లీ,ఆ గస్టు 23:** పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రధాన నిందితుడిగా లష్కర్ ఏ తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ చేర్చిన నేపథ్యంలో అతడికి సమన్లు పంపడానికి ఎన్ఐఎ కోర్టు సిద్ధం అవుతోంది. ఈ మేరకు జమ్మూ కాశ్మీర్ లోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని సమన్లలో ఎన్ఐఎ అధికారులు ఆదేశించే అవకాశం ఉంది. దాంతో పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఆయనకు ఉచ్చు బిగుస్తున్నట్లుగా భావించవచ్చు. ఇక ఇప్పటికే ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు హాఫీజ్ సయీద్ కు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ సమన్లను లాహోర్‌లోని సయీద్‌కు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషన్ ద్వారా పాకిస్థాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు ఈ సమన్లను జారీ చేసే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రం సమాయత్తం అవుతోంది. ఇదిలా ఉండగా 26/11 ముంబై ఉగ్రదాడుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దాడుల వెనుక మాస్టర్ మైండ్‌లుగా నిషేధిత లష్కరే తోయిబా హాఫీజ్ సయీద్, జకీవుర్ రెహమాన్ లఖ్వీలతో సహా మొత్తం ఆరుగురు ప్రధాన నిందితులు ప్రస్తుతం పరారీలో ఉండగా వారికి కోర్టు జారీ చేసిన ప్రకటన ఉత్తర్వుల్ని అందజేసేందుకు ముంబై పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఈ ఉగ్రవాదులకు ఇంటర్ పోల్ ద్వారా నోటీసుల్ని జారీ చేయాలని ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు. మరోవైపు కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టడంలో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హాఫీజ్ సయీద్ పాత్రపై పాకిస్థాన్‌కు చెందిన ఓ మతగురువే సంచలన వ్యాఖ్యలు చేశారు. కాశ్మీర్‌కు హాఫీజ్ సయీద్ ఏకంగా 10 వేల మంది ఉగ్రవాదులను పంపాడని పాకిస్థాన్ మతగురువు నజీర్ మదానీ బహిరంగంగా ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన పహల్గామ్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ ఘటన వెనకున్నట్లు తేలిన నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి వాటిని పూర్తిగా ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను హతమార్చింది.

# తారిక్ భారత్ పర్యటనకు తొందరేమీ లేదు

## బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయమంత్రి హుమాయూన్



**ఢాకా, ఆగస్టు 23:** బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్ భారత పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి హుమాయూన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. శనివారం హుమా యూన్ మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లా ప్రధాని తారిక్ భారత పర్యటనకు తొందరపడా ల్సి న అవసరంలేదన్నారు. మోడీ ప్రభుత్వంతో సానుకూల సంబం ధాలు కొనసాగించాలని తాము కోరుకుంటున్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలలో తగినంత పురోగతి సాధించిన తర్వాత.. సరైన సమయం చూసుకొని తారిక్ రెహ్మాన్ భారత పర్యటనకు వెళ్తారని హుమయూన్ పేర్కొన్నారు. ప్రధాని అధికారిక పర్యటనకు తగిన సన్నాహాలు, ఇరుపక్షాల మధ్య అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు అవసరమని తెలిపారు. మరోవైపు ఈ పర్యటపై బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిక్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నిందితులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం బంగ్లా వేచిచూస్తున్నట్లు సమాచారం. మరో వైపు సెప్టెంబరు 12-13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన ఢిల్లీ పర్యటనకు వస్తారని వార్తలువచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ఇటీవల ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

# నేడు చైనాలో అజిత్ దోవల్ పర్యటన




**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం చైనాలో పర్యటించనున్నారు. భారత్‌చైనా సరిహద్దు నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ అవుతారు. ఇద్దరు నేతలు భారత్‌చైనా సరిహద్దు వివాదంపై 25వ విడత చర్చల్లో పాల్గొననున్నారు. దోవల్, వాంగ్ యీలు మంగళవారం చర్చలు జరపనున్నారు. దాదాపు 2,488 కిలోమీటర్ల పొడవైన భారత్ చైనా సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ఈప్రత్యేక ప్రతినిధుల చర్చల ప్రక్రియను 2003లో ప్రారంభించారు. ఇరు దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు కూడా ఈ చర్చల్లో పాల్గొంటున్నారు. సరిహద్దు సమస్యతో పాటు భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించి అనేక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ నెలలో బ్రిక్స్ సదస్సు న్యూఢిల్లీలో జరగబోతోంది. ఈ సమావేశానికి ముందు భారత్, చైనాల మధ్య ఈ హైలెవల్ మీటింగ్ జరుగుతోంది. బ్రిక్స్ సమ్మిట్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వచ్చే అవకాశం ఉంది. ఇంకా అధికారిక ప్రకటన వెలువడకున్నా, షీ జిన్‌పింగ్ భారత్‌కు వస్తే ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది.

# వందేమాతరం గీతం మధ్యలోనే వెళ్లిపోయిన యుపి స్పీకర్

**ఉన్నావ్ (యుపి), ఆగస్టు 23:** ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన ఓ పాఠశాల కార్యక్రమంలో ఊహించని ఘటన వెలుగుచూసింది. ప్రిన్సిపాళ్ల కౌన్సిల్, విద్యా సదస్సు ముగింపు సందర్భంలో ముఖ్య అతిథిగా హాజరైన యూపీ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలోనే వేదిక దిగి వెళ్లిపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రోటోకాల్ ప్రకారం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన వెంటనే జాతీయ గీతం ప్రారంభమైంది. అయితే గీతం సాగుతుండగానే ఆయన వేదిక వెనుక వైపునకు నడుచుకుంటూ వెళ్లారు. సతీష్ మహానా వేదిక దిగుతున్న సమయంలో అక్కడేఉన్న ఆయన అనుచరులు, మద్దతుదారులు ఆయనను చుట్టుముట్టి పాదాలకు నమస్కరించడం ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన నేరుగా తన వాహనంఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పూరన్ నగర్‌లోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై నిర్వాహకులు వివరణ ఇస్తూ.. స్పీకర్ ఉన్న ప్రదేశానికి, జాతీయ గీతం మైక్ స్పీకర్లకు మధ్య కాస్త దూరం ఉండటం వల్ల ఈ పొరపాటు జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

# అణ్వస్త్ర తయారీకి ఇరాన్ కసరత్తులు




**టెహ్రాన్, ఆగస్టు 23:** ఇరాన్‌ను ఏదో విధంగా లొంగదీసుకునేందుకు ఆరు నెలలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమైనీతో పాటు టాప్ కమాండర్లు అందరినీ చంపేసినా ఆ దేశం మాత్రం ట్రంప్‌కు లొంగడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక విలవిల్లాడుతున్న ట్రంప్ ఆ అసహనంతో ఇరాన్ ఆయువు పట్టు అయిన హార్ముజ్ జలసంధిని దిగ్బంధించారు. అటువైపుగా వచ్చే ఇరాన్ నౌకలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఇరాన్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. తాజాగా హార్ముజ్ తమదేనని ట్రంప్ ఓ మ్యాప్ కూడా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇక చివరి అస్త్రం వాడేందుకు సిద్ధమవుతోంది. ఇన్నాళ్లూ ఏ అణ్వస్త్రాలు తయారుచేస్తున్నదని ఇరాన్‌ను అమెరికా ఇజ్రాయెల్‌లు కట్టడిచేస్తు వస్తున్నాయో ఇపుడు అదే అణ్వస్త్రాన్ని తయారుచేసేందుకు ఇరాన్ సిద్ధం అవుతోంది. ట్రంప్ చేస్తున్న దాడులతో ప్రపంచ దేశాలకు అణ్వస్త్రాలు సమకూర్చుకోవాల్సి న అవసరం ఏర్పడుతోందని ఇరాన్ తాజాగా ప్రకటించింది. అణ్వస్త్ర నిరోధక ఒప్పందాలపై సంతకాలుచేసిన దేశాలకు కానీ, అణు ఇంధన సంస్థలో భాగస్వాములైన దేశాలకూ కానీ అమెరికానుంచి రక్షణ లేదని ఇరాన్ తేల్చిచెప్పేసింది. ప్రపంచ అణు భద్రతను ట్రంప్ దెబ్బతీస్తున్నారని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఆరోపించారు. ఇరాన్‌పై దాడుల వల్ల అణ్వాయుధాలు సంపాదించాలనే దేశాల కోరిక పెరిగిందన్నారు.

# రాహుల్‌ను బ్యాట్‌మాన్‌గా పోలుస్తూ విడియోలు వైరల్

## ఎఐసిసి కార్యాలయం ముందు కూడా భారీ పోస్టర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయం వెలుపల తాజాగా వెలిసిన పోస్టర్లు, బ్యానర్లు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌కు తెర తీశాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఓ నూతనరూపంలో చిత్రీకరిస్తూ వెలిశాయి. ఇప్పుడవి అందరి దృష్టిని ఆకర్షిస్తోన్నాయి. రాహుల్ గాంధీని హాలీవుడ్ సూపర్ హీరో క్యారెక్టర్ బ్యాట్‌మ్యాన్‌తో పోల్చుతూ ఈ పోస్టర్లు వెలిశాయి. రియల్ లైఫ్ బ్యాట్‌మ్యాన్‌గా అభివర్ణిస్తూ ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశాన్ని కాపాడే ఓ సైలెంట్ గార్డియన్‌గా, వాచ్ ఫుల్ ప్రొటెక్టర్‌గా ఈ పోస్టర్లలో రాహుల్‌గాంధీని అభివర్ణించారు. రాజకీయంగానే కాకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లపై కూడా హాట్ డిబేట్స్ సాగుతున్నాయి ఈ పోస్టర్ల మీద. యువతతో పాటు ముఖ్యంగా జెన్‌జీ ఓటర్లను రాహుల్‌గాంధీ విపరీతంగా ఆకట్టుకున్నట్టయిందనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల రాహుల్ గాంధీ నిర్వహించిన ఓ ఇంటరాక్టివ్ సెషన్‌లో ఈ బ్యాట్‌మ్యాన్ ప్రస్తావన వచ్చింది. దీని తర్వాతే ఈ పోస్టర్లు వైరల్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవలే రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతతో ప్రత్యక్షంగా ముచ్చటించేందుకు ఆస్క్ మీ ఎనీథింగ్ అనే డిబేట్‌ను ప్రారంభించారు. విద్యార్థుల నిరసనలు, విద్యావ్యవస్థ, దేశ



ఆర్థిక విధానాలు, వ్యక్తిగత ఆలోచనల వంటి విభిన్న అంశాలపై సాగిందీ సెషన్. ఇందులో ఓ ఒక నెటిజన్ మీరేమైనా బ్యాట్‌మ్యానా అంటూ సరదాగా రాహుల్ గాంధీని ప్రశ్నించాడు. దానికి ఆయన నవ్వుతూ ఈ ప్రపంచంలో నన్ను, బ్యాట్‌మ్యాన్‌ను ఇంతవరకు ఎవరూ ఒకే రూమ్‌లో చూడలేదు, చూడలేరుకూడా అంటూ బదులు ఇచ్చారు. దీనికి తోడు బ్యాక్‌గ్రౌండ్‌లో డార్క్ నైట్ సినిమా థీమ్ మ్యూజిక్‌తో వర్షంలో నిల్చొనిఉన్న ఓ వీడియో క్లిప్‌ను కూడా రాహుల్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కన్నడ సూపర్ స్టార్ పవర్ హౌస్ క్యారెక్టర్ దీంతో ఈ బ్యాట్‌మ్యాన్ పోలిక నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయింది.

# సూట్‌కేస్‌లో శవం ముక్కలు.. కొన్ని ముక్కలతో బిర్యానీ!

**ఆగ్రా, ఆగస్టు 23:** చెన్నై నుంచి ఢిల్లీ వెళ్తున్న రైలులో లభించిన ఓ సూట్ కేసులో మహిళ శరీర భాగాలు బయటపడిన కేసును పోలీసులు ఛేదించారు. ఆగ్రా రైల్వే స్టేషన్‌లో సూట్‌కేసు లభించగా అందులో లభించిన శరీర భాగాల మూలాలు చెన్నైలో దొరికాయి. 350కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు చివరకు అనుమానితుల ఇంటిని కనుగొన్నారు. అక్కడకు వెళ్లి చూడగా పోలీసులకు భయానక దృశ్యాలు కనిపించాయి. మహిళ శరీరాన్ని ముక్కలుగా కోయడమే కాకుండా ఆనవాళ్లు లేకుండా చేసేందుకు వాటితో బిర్యానీ వండినట్లుగా గుర్తించి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నెల 5న చెన్నై నుంచి ఢిల్లీ బయలుదేరిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఓ జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనుంచి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తనిఖీ చేయగా అనుమానాస్పదంగా కనిపించిన ఎరుపు రంగు సూట్‌కేస్ కనిపించింది. దాన్ని తెరిచి చూడగా అందులో మహిళ మృతదేహానికి సంబంధించిన శరీరభాగాలు ఉండటంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దర్యాప్తులో ఆ సూట్‌కేస్ చెన్నై నుంచే రైలులో పెట్టినట్లు గుర్తించారు. దీంతో ఆగ్రాపోలీసులు తమిళనాడు పోలీసులను సంప్రదించారు. కేసును ఛేదించేందుకు చెన్నై పోలీసులు రంగంలోకి దిగారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని 350కిపైగా సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ పురుషుడు, ఓ మహిళ కలిసి ఎరుపు రంగు సూట్‌కేస్‌తో స్టేషన్‌కు వచ్చినట్లు గుర్తించారు. వారు సూట్‌కేస్‌ను తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఉంచి అక్కడినుంచి వెళ్లిపోయారు. అనంతరం చెన్నై పార్క్ రైల్వే స్టేషన్ నుంచి సబర్బన్ రైలు ఎక్కి గూడువాంజేరి చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గూడువాంజేరి రైల్వేస్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా అదే వ్యక్తులు సూట్‌కేస్‌తో ఓ ఆటోలో వెళ్తున్న దృశ్యాలు పోలీసులకు కనిపించాయి. ఆటోను అనుసరిస్తూ వెళ్లిన పోలీసులు గూడువాంజేరి మసీదు వీధిలో వారు నివసిస్తున్న ఇంటిని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా అక్కడ హత్య జరిగినట్లు అనుమానించే కీలక ఆధారాలు లభించాయి. గదుల్లో రక్తపు మరకలు కనిపించడంతో పోలీసుల అనుమానాలు మరింత బలపడ్డాయి. పోలీసుల తనిఖీల్లో ఓ భారీ బిర్యానీ పాత్ర కనిపించింది. దానికి మూతపెట్టి చుట్టూ మైదాపిండి అతికించినట్లు గుర్తించారు. మూత తొలగించి చూడగా బియ్యంతో పాటు మానవ శరీరానికి సంబంధించిన ముక్కలు కనిపించడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. హత్యకు గురైన మహిళ శరీరాన్ని ముక్కలు చేసిన తర్వాత కొన్ని భాగాలను సూట్‌కేస్‌లో పెట్టి రైలులో తరలించినట్లు, మిగిలిన భాగాలను వండుతూ ఆనవాళ్లులేకుండా చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి తల మాత్రం ఇంకా లభించలేదు. దానికోసం పోలీసులుగాలిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో మృతురాలిని ఒడిశాకు చెందిన హయాత్ నిషాగా గుర్తిం చారు. ఆమె భర్త నుంచి విడిపోయి చెన్నైలో ఉంటున్నట్లు తెలిసింది. ఆమె 19 ఏళ్ల కుమారుడు తాంబరంలో ఏసీమెకానిక్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిషాతో కలిసి మాణిక్ ఉత్తిన్ లస్కర్, అతని భార్య భాగమతి మాజిక్ నివసిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

# సొమ్ములిస్తేచాలు అయోధ్యలో దొడ్డిదారిన దర్శనం



**అయోధ్య, ఆగస్టు 23:** అయోధ్య ఆలయ విరాళాలకు సంబంధించి పలు ఆరోపణలు బయటపడిన క్రమంలో ఆలయంలో జరుగు తున్న మరిన్ని అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. అయోధ్య రాముడి దర్శనానికి గంటల తరబడి లైన్లలో వేచి ఉండక్కర్లేదు. మీరు అక్కడ ఉన్న బ్రోకర్లకు లంచం ఇస్తే చాలు. వారే మేజిస్ట్రేట్ కార్యాలయం నుంచి ప్రొటోకాల్స్ జారీ చేస్తారు. స్వయంగా ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ మీ వెంట వచ్చి ఆలయ దర్శనం చేయిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శుభమ్ దూబే అనే ప్రచారకుడు స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మాకు రూ.7,300 ఇస్తే మీకు దగ్గరుండి విఐపి దర్శనం చేయిస్తాం అని ఆతడు పేర్కొన్నాడు. అయోధ్య విరాళాల చోరీ, ఆలయంలోని అక్రమాలు బయటపడి సంచలనం సృష్టించినా ఈ దొడ్డిదారి దర్శనం మాత్రం యథేచ్ఛగా కొనసాగు తున్నది. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆలయ అధికారులు, మహంతులు, పూజారులు భాగస్వాములేనని ఆయన తెలిపాడు. ఆలయ రద్దీ కారణంగా ఎంట్రీ పాస్‌ల జారీ నిలిపివేసినా బ్రోకర్లు వీటిని యథేచ్ఛగా భక్తులకు అమ్ముతుండటం కన్పించింది. సొమ్ములిస్తే ఆలయంలోని నిషేధిత ప్రాంతాల్లో యథేచ్ఛగా రీల్స్ చేసుకోవచ్చు. కెమెరాతో షూటింగ్‌లు చేసుకోవచ్చు. అయోధ్య విరాళాల చోరీ కేసులో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా, ఆలయ అధికారి గోపాల్ రావులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేకపోతే తదుపరి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# బంగ్లాలో హిందూ టీచర్ కుటుంబం దారుణ హత్య

**ఢాకా, ఆగస్టు 23:** బంగ్లాదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు. ఈ సంఘటన రంగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసు కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్ అయి హోమియోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పూర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23). కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మిగతా కుటుంబసభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి కప్పుపైన, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైన, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయ్యాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీసు కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## ఇస్లామిక్ నాటోలో చేరేందుకు బంగ్లాదేశ్ ఆసక్తి



**ఢాకా, ఆగస్టు 23:** ఇరాన్ వార్ తర్వాత పశ్చిమాసియాతో పాటు అంతర్జాతీయంగానూ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ వార్ కంటే ముందే జరిగిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌సౌదీ అరేబియా కలిసి మక్కా రక్షణ ఒప్పందం చేసుకున్నాయి. ఇపుడు భారత్ పొరుగునే ఉన్న బంగ్లాదేశ్ ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు సానుకూలత వ్యక్తం చేసారు.

## ముగ్గురు సజీవ దహనం, పలువురికి గాయాలు

**భక్తియార్‌పూర్, ఆగస్టు 23:** బీహార్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదంలో ముగ్గురు సజీవ దహనమవ్వగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన పాట్నా జిల్లా బఖ్తియార్‌పూర్‌లో రాత్రి పొద్దుపోయాక పురానీ బైపాస్ ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పురానీ బైపాస్ ప్రాంతంలోని ఒక బైక్ విడిభాగాల దుకాణం, దానికి ఆనుకుని ఉన్న ఇంట్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అత్త, కోడలు, ఆరు నెలల చిన్నారి పాపతో సహా ముగ్గురు సజీవ దహనమయ్యారు.


## అమెరికాలో భారత సంతతి వ్యాపారి హత్య

**టెన్నెస్సీ, ఆగస్టు 23:** అమెరికాలో మరో భారత జాతీయుడు దుండగుడి కాల్పులకు బలైపోయారు. టెన్నెస్సీ రాష్ట్రంలోని జాక్సన్ నగరంలో గురువారం సాయంత్రం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గుజరాత్‌కు చెందిన సురేష్ పటేల్ (56), తన కుమార్తెతో కలిసి షాపులో ఉండగా ఈ దాడి జరిగింది. కుమార్తె కళ్లెదుటే తండ్రిని దుండగుడు కాల్చి చంపడం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

## బలూచ్‌ప్రావిన్స్‌లో హిందూ వ్యాపారి దారుణ హత్య

**క్వెట్టా, ఆగస్టు 23:** బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఒక హిందూ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని సాయుధులు ఆయన దుకాణంలోకి చొరబడి కాల్చి చంపారు. పాకిస్థాన్‌కు చెందిన డాన్ వార్తాపత్రిక కథనాన్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ వివరాలను వెల్లడించింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నుష్కి పట్టణంలోని ఖాదిరాబాద్ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగులు వ్యాపారి రాకేశ్ కుమార్ దుకాణంలోకి చొరబడగా, ఆయన వారిని ప్రతిఘటించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిందితులు ఆయనపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు.

## కేరళ డివైఎఫ్ఐకి తొలిసారి మహిళ చీఫ్



**తిరువనంతపురం, ఆగస్టు 23:** సిపిఎం అనుబంధ యువజన విభాగం డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కేరళ విభాగం చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలిగా తొలిసారి ఒక మహిళా నేత ఎన్నికయ్యారు. త్రిశూర్‌లో జరిగిన 16వ రాష్ట్ర మహాసభలో చింతా జెరోమ్‌ను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎ.ఎ. రహీం అధికారికంగా ప్రకటించారు.

## జపాన్‌లో 5.9 తీవ్రతతో భూకంపం

**టోక్యో,ఆగస్టు 23:** జపాన్‌లో వరుస భూకంపాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి అక్కడ భూమి కంపించింది. ఈరోజు తెల్లవారుజామున తూర్పు జపాన్‌లో సంభవించిన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రతతో నమోదైంది. రాజధాని టోక్యోలోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అయితే, అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



## తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**తిరుమల,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఆదివారం ఉదయం తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని సురక్షితంగా గుర్తించి పోలీసులు అతని తల్లి దండ్రులకు అప్పగించారు. కమాండ్ కంట్రోల్ టీమ్ సిబ్బంది సిసిటివి ఫుటేజ్ ఆధారంగా తల్లిదండ్రులను గుర్తించారు. గుంటూరు జిల్లా పొన్నూరు కు చెందిన భక్తుడు వంశీ తన ఐదేళ్ల కుమారుడు భువనేశ్వర్‌తో కలిసి తిరుమలకు వచ్చాడు. తిరుమలలో శంకుమిట్ట ప్రాంతానికి వచ్చిన సమయంలో బాలుడు అనుకోకుండా తల్లిదండ్రుల నుంచి తప్పిపోయాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని గమనించిన కొంతమంది యాత్రికులు వెంటనే స్పందించి అతనని కమాండ్ కంట్రోల్ కార్యాలయానికి చేర్చారు. అక్కడ కమాండ్ కంట్రోల్ సిబ్బంది బాలుడిని సురక్షితంగా తమ వద్ద ఉంచుకుని తల్లిదండ్రుల వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు.సిబ్బంది వెంటనే శంకుమిట్ట ప్రాంతంలోని సిసిటివి కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి,బాలుడి కదలికలను అనుసరిస్తూ అతని తల్లి దండ్రులను గుర్తించారు.అనంతరం తల్లిదండ్రులకు సమాచారమందించి, బాలుడు భువనేశ్వర్‌ను ఎటువంటి ప్రమాదం లేకుండా వారి వద్దకు సురక్షితంగా అప్పగించారు కుమారుడిని క్షేమంగా తిరిగి అప్పగించిన కమాండ్ కంట్రోల్‌సిబ్బందికి, పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## విజయవాడలో ఎన్‌టిఆర్ పిజి సెంటర్

### కృష్ణా వర్సిటీ విసి ప్రొఫెసర్ కూన రామ్‌జీ

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఉన్నత విద్యకు మరో ప్రతిష్టాత్మక వేదిక అందుబాటులోకి వచ్చింది. విద్యార్థుల విద్యా అవసరాలతో పాటు నేటి ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో డా. ఎన్‌టీఆర్ పీజీ సెంటర్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేయడంవిశేషమని ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కూన రామ్‌జీ తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా వాసులకు, విజయవాడ వాసులకు, అమరావతి ప్రాంత విద్యార్థులకు మరింత చేరువగా ఉండేలా నగర నడిబొడ్డున "ఎన్ టీ ఆర్" పేరుతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఉన్నత విద్యను స్థానికంగానే అభ్యసించాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశంగా మారుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యా, వృత్తి భవిష్యత్తును మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. 2026-27 విద్యా సంవత్సరానికి కేంద్రంలో ఎం.ఎస్సీ మైక్రోబయాలజీ, ఎం.ఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎం.ఏ. హ్యూమానిటీస్ అండ్ కమ్యూనికేటివ్ స్టడీస్ వంటి పీజీ కోర్సులతో పాటు, ఒక సంవత్సరం వ్యవధి గల పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపయోగపడే డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఎన్ టీ ఆర్ పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. దిలీప్ మాట్లాడుతూ ఈ కోర్సుతో పాటు కేంద్రంలో అందు బాటులో ఉన్న వివిధ కోర్సులను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయవాడలో ఉన్నత విద్యకు కొత్త చిరునామా గా విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త బాట గా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు కృష్ణా యూనివర్సిటీ కృషి చేస్తోందని వీసీ ప్రొఫెసర్ కూన రామ్‌జీ తెలిపారు.

## బిసిలపై ప్రభుత్వం కక్ష సాధింపు: దేవినేని అవినాష్

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టు అక్రమమని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ అన్నారు. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే జరిగిందని తీవ్రంగా మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీలో బీసీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వ్యవ హరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ఉద్దేశంతో అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని దేవినేని అవినాష్ పేర్కొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు పాఠశాలల్లోనే పింఛను అందజేత

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద వైకల్యం కలిగిన విద్యార్థులకు అందజేస్తున్న నెలవారీ రూ.6 వేల పింఛను పంపిణీ విధానంలో కీలక మార్పులు చేసింది. రాష్ట్రంలోని వివిధ అంధుల, బధిరుల గురుకులాల్లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులు తమకు ఏ పద్ధతిలో పింఛను అందాలో స్వయంగా ఎంచుకునే వెసులుబాటును కల్పించింది. దూర ప్రాంతాల నుండి వచ్చి వసతి గృహాల్లో చదువు కుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం అక్టోబర్ నెల నుండి ఈ నూతన విధానాన్ని అమలు చేసేందుకు సెర్ప్ అధికారులు అవసరమైన కసర త్తును వేగవంతం చేశారు. రాష్ట్రంలో ఉన్న 6 అంధుల, బధిరుల గురుకుల పాఠశాలలు, ఒక కళాశాలలో మొత్తం 424 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం 116 మంది విద్యార్థులు తమ పింఛను మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మరో 17 మంది విద్యార్థులు తాము చదువుకునే గురుకులానికి సమీపంలో ఉన్న స్వర్ణ సచివాలయానికి వివరాలు మ్యాప్ చేసి, పాఠశాల ప్రాంగణంలోనే అందించాలని విన్నవించారు. మిగిలిన 178 మంది పాత విధానంలోనే తమ ఇంటి వద్దకే పింఛను అందించాలని స్పష్టం చేశారు. గురుకులాల్లో చదువుతున్న వారిలో దాదాపు 113 మంది విద్యార్థులకు కొన్నేళ్లుగా పింఛను అందడం లేదని ఈ సర్వేలో వెల్లడైంది. సాధారణంగా కొత్త పింఛన్ల మంజూరుతో సంబంధం లేకుండా తీవ్ర వైకల్యం ఉన్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ల సిఫార్సు ఆధారంగా ప్రభుత్వం ప్రతి నెలా సహాయం అందిస్తుంది. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే ఈ 113 మందికి కూడా త్వరలోనే క్రమం తప్పకుండా పింఛను అందే అవకాశముంది.

## తిరుమలపై రగులుతున్న రగడ

**తిరుపతి,ఆగస్టు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పవిత్రత కాపాడటంలో పోలీసుయంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తున్నా తరచూ విమర్శలు, వాదనలు వ్యక్తమవుతున్న ఉదంతాలు కోకొల్లలు. తిరుపతి నుండి తిరుమలకు నిషేధిత పదార్థాలు తీసుకెళ్ళాలన్నా తరలించాలన్నా అలిపిరి తనిఖీ కేంద్రం,కాలినడక మార్గాలు ప్రధానం. భారీ మొత్తంలో మద్యం బాటిళ్ళు తిరుమలలో పట్టుబడ్డాయని అయితే ఆ కేసు అలిపిరి పోలీసులు నమోదు చేశారని వైసిపి నేతల ఆరోపణలు ఇప్పుడు సంచలనం కలిగిస్తోంది. ఇటీవల తిరుమల కౌస్తుభం గెస్ట్ హౌస్ సమీపంలో ఈగ రాము అనే వ్యక్తి బాలాజీ అనే వ్యక్తికి 182 మద్యం బాటిళ్ల అమ్ముతుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారని, తదనంతరం ఆ కేసును తిరుమల 2టౌన్ పోలీసులకుగానీ, ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులకుగానీ అప్పగించాల్సి ఉంది,అయితే అదేగాక ఆరోజే వెయ్యికిపైగా గుట్కా ప్యాకెట్లు అమ్ము తూ నాగ తీర్థం సమీపంలో పట్టుబడ్డారనేది మరో ప్రధాన ఆరోపణ. ఈ ఉదంతంలో పట్టుబడిన వారిని తెల్లవారుజామున అలిపిరి పోలీసు లకు అప్పగించారని వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు.

పట్టుబడిన ఆ మరుసటి రోజు ఉదయం బాలాజీ లింక్ బస్‌స్టాండ్ వద్ద కేవలం 20 బాటిళ్లతో పట్టుకున్నట్లు కేసు ఎలా నమోదైంది? కాదా అనేది నిజాలు వెల్లడించాలని ఆదివారం సాయంత్రం కరుణాకర్‌రెడ్డి దిమాండ్ చేయడంతో ఇప్పుడు ఆ వివాదం కాస్త పెను దుమా రం రేపుతోంది. దీనివెనుక ఉన్న వాస్తవాలు మాత్రం పోలీసులు వెల్లడిం చాల్సిన అవసరం ఉంది. దమ్ముంటే కౌస్తుభం గెస్ట్ హౌస్, నాగతీర్థం, బాలాజీ లింక్ బస్‌స్టాండ్ వద్ద సిసిటివిఫుటేజ్‌ను విడుదల చేయాలని కరుణాకర్‌రెడ్డి సవాల్ విసిరారు.

# బ్రిక్స్ సైక్లింగ్‌లో ఫిట్‌నెస్ జోష్..

### విశాఖ నుంచి దేశానికి ఆరోగ్య సందేశం!

### 1,800 నగరాల్లో 'సండే ఆన్ సైకిల్'..

### 50 లక్షల మంది యువత భాగస్వామ్యం




**విశాఖపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బ్రిక్స్ సదస్సు సందర్భంగా విశాఖలో ఆదివారం నిర్వహించిన 'బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్' ఉత్సాహంగా సాగింది. బ్రిక్స్ దేశాల ప్రతినిధులతో కలిసి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవియా సైక్లింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ 'ఫిట్ ఇండియా' ఉద్యమంలో కీలక భాగమని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచుతోందన్నారు. ఆదివారం దేశంలోని సుమారు 1,800 నగరాల్లో 50 లక్షల మంది యువత సైక్లింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ వారానికి ఒకరోజైనా సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.నోవాటెల్ హోటల్ నుంచి సీ హారియర్ వరకు, అక్కడి నుంచి తిరిగి నోవాటెల్ వరకు నిర్వహించిన ఫ్రెండ్లీ సైకిల్ ర్యాలీలో కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బ్రిక్స్ ప్రతినిధులు, శాప్ ఎండీ భరణి, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, క్రీడా అధికారులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

### ప్రమాదానికి గురైన పోలీసు వాహనం

## మృతి చెందిన కానిస్టేబుల్ సీర వెంకట రమణ



**విజయనగరం, ఆగస్టు 23, ప్రభాతవార్త :** విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి ఆగస్టు 23న విచారణ నిమిత్తం రూరల్ ఎస్సై మరియు పోలీసు సిబ్బంది తిరిగి వస్తుండగా వాహనం బ్రేక్స్ ఫెయిల్ అయి రహదారి ప్రక్కనగల లోయలో పడిన ఘటనలో ఒక కానిస్టేబుల్ మృతి చెందగా, ఎస్ఐతో సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సీర వెంకట రమణను మెరుగైన చికిత్స కోసం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తక్షణమే చికిత్స అందించిన ప్పటికీ సీర వెంకట రమణ (49) మృతి చెందారు. వి.అశోక్ కుమార్, ఎస్సై, జి.నాగేంద్ర ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్, కే. రాజబాబు, ఎఆర్ కానిస్టేబుల్/వాహన డ్రైవరులు తీవ్రంగా గాయపడ్డారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాచారం అందిన వెంటనే తిరుమల మెడికవర్ ఆసుపత్రికి వెళ్లి, క్షతగాత్రులను పరామర్శి, వారికి అందిస్తున్న వైద్యం గురించి వైద్యు లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరుపున అన్ని చర్యలు చేపడతామని, గాయపడిన పోలీసు కుటుంబాలకు, మరణించిన వెంకట రమణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సమాచారాన్ని రాష్ట్ర హోంమంత్రికి తెలిపినట్లు, ప్రభుత్వం తరుపున అండగా ఉంటామన్నారు. గాయపడిన ఎస్సై అశోక్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జి.నాగేంద్ర ప్రసాద్, డ్రైవర్/ఎఆర్ కానిస్టేబుల్ కె.రాజబాబుకు అవసరమైన వైద్య సహాయం అందే విధంగా చర్యలు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర ప్రసాద్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ అపోలో ఆసుపత్రికి తరలించామన్నారు. డ్రైవరు రాజు తక్షణ వైద్యంలో భాగంగా శస్త్రచికిత్స చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు ఎస్సై అశోక్ కుమార్ కు అవసరమైన మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందించాలని తిరుమల మెడికవర్ ఆసుపత్రి వైద్యులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. మరణించిన వెంకట రమణ భార్య కుమారి, అతని తల్లిదండ్రులను జిల్లా ఎస్పీ ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసాకల్పించారు. పోస్టుమార్టం త్వరగా జరిపించే విధంగా చర్యలుచేపట్టాలని డీఎస్పీ ఎస్.రాఘవులును జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశించారు.

**సంఘటనా స్థలాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ :** ప్రమాదం జరిగిన జెఎన్‌టియు సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్ భవనం మలుపు వద్ద సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ సందర్శించి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సుమారు 20 అడుగుల గోతిలో వాహనం పడిపోయినట్లుగా గుర్తించారు.

## న్యూఢిల్లీలో దుర్గమ్మ ఆలయాభివృద్ధికి చర్యలు

### ఇఒ వికె శీనా నాయక్ వెల్లడి

### నేడు హుండీల లెక్కింపు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 23, ప్రభాతవార్త :** భారత దేశ రాజధాని న్యూఢిల్లీలో వున్న దుర్గమ్మవారి ఆలయాభివృద్ధికి తగిన చర్యలు చేపడతామని ఇఒ వికె శీనా నాయక్ అన్నారు. ఆదివారం ఆయన న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రాంగణంలో గల పురాతన శివాలయాన్ని, అలాగే శ్రీ కనకదుర్గా దేవి మందిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. న్యూఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయ సూచనలు, మరియు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం ఏపీ భవన్ ఎస్టేట్ అధికారులు స్వాధీనం చేసుకున్న పురాతన శివాలయాన్ని దేవస్థానం ఈవో క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ శివాలయం అభివృద్ధి రీత్యా నూతన శాశ్వత అర్చకుడిని నియమించే వరకు, ప్రస్తుతం ఏపీ భవన్‌లోని శ్రీ కనకదుర్గా దేవి మందిరంలో అర్చక విధులు నిర్వహిస్తున్న అర్చకస్వామిని ఈ శివాలయంలో కూడా నిత్య కైంకర్యాలు నిర్వహించేందుకు అదనపు బాధ్యతలు అప్పగించామని ఈవో తెలిపారు. ఈ శివాలయంలో పూజా ద్రవ్యాలు, ఇతర సామాగ్రిని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం సమకూరుస్తుందని, ఢిల్లీ శివాలయంలో ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం పూజాదికాలు నిర్వహించేందుకు ఆలయ వైదిక కమిటీ మరియుస్థానాచార్యుల అభిప్రాయాలు, సలహాలు తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఈవో శీనా నాయక్ తెలిపారు. అనంతరం ఏపీ భవన్ ప్రాంగణంలో ఇంద్రకీలాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కనకదుర్గ అమ్మవారి మందిరాన్ని ఈవో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఢిల్లీ ఏపీ భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు హుండీ లెక్కింపు:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఆగస్టు 24 ఉదయం 7 గంటలనుండి మహామండపం 6వ అంతస్తులో నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) లో ఆదివారం ఉదయము సూర్యోపాసన సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది. లోక కల్యాణార్థం మరియు భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ పాల్గొని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వేద పఠనం: ఆలయ వేద పండితులు అరుణ పారాయణం, మహాసౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఒ తెలిపారు.

## నేటితరం మాతృభాషను పరిరక్షించాలి

### ఆంధ్రప్రదేశ్ నాటక అకాడెమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ

### సృజనోత్సవంలో మల్లెతీగ-గిడుగు పురస్కారాల ప్రదానం



ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** నేటి యువతలో పుస్తక పఠనం, కవిత్వం, సంగీతం, సాంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచాల్సిన అవసరం వుందని, ఆ దిశగా సృజనోత్సవం వంటి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సమాజానికి ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో సృజనోత్సవం కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని గిడుగు రామమూర్తి పంతులు మునిమనవడు గిడుగు వెంకట నాగేశ్వరరావు అతిథిగా హాజరై జ్యోతి ప్రకాశనం చేసి ప్రారం భించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా హాజరైన గుమ్మడి మాట్లా డుతూ మాతృభాషా పరిరక్షణను నేటితరం కనీస పౌర బాధ్యతగా స్వీకరించాలన్నారు. తెలుగు విలువ తెలిసిన మన రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.సుప్రసిద్ధ మానసిక వైద్య నిపుణులు డా. ఇండ్ల రామ సుబ్బారెడ్డి తన అధ్యక్షోప న్యాసంలో సాహితీ మూర్తుల్ని, కళాకారుల్ని ప్రభుత్వం గుర్తిస్తున్నప్పటికీ అందరినీ గుర్తించడం సాధ్యం కాదు కాబట్టి సామాజిక బాధ్యతతో మల్లెతీగ వంటి సంస్థలు ముందుకొచ్చి గిడుగు వారి పేరుతో పురస్కారాలివ్వడం అభినందించాల్సిన విషయమన్నారు. ఆంధ్ర నాటక కళాసమితి వ్యవస్థాపకులు నన్నపనేని నాగేశ్వరరావు, సుప్రసిద్ధ రచయిత డా. యం.ప్రభాకర్, సుప్రసిద్ధ కవి, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సలహాదారులు చిన్ని నారాయణరావు, ఠాగూర్ గ్రంథాలయ గ్రేడ్ 1 గ్రంథ పాలకురాలు కె. రమాదేవి ,విజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. పైనేని తులసీనాధం నాయుడు(చిత్తూరు జిల్లా), షేక్ కరీముల్లా (పల్నాడు జిల్లా), డా. తూములూరి రాజేంద్రప్రసాద్ (గుంటూరుజిల్లా), విల్సన్ రావు కొమ్మవరపు (ఎన్టీఆర్ జిల్లా), రేపాక రఘునందన్ (ఎన్టీఆర్ జిల్లా), జ్యోతి ముప్వల (విశాఖపట్నం), ఎం. వరలక్ష్మీ కళ్యాణి (గుంటూరు జిల్లా), డా. వి.రఘుపతి (చిత్తూరు జిల్లా), డా. టి. పార్థసారధి (ఏలూరు జిల్లా), వసుధ బసవేశ్వరరావు (కృష్ణాజిల్లా)లకు మల్లెతీగ గిడుగు పురస్కారాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 130 మంది కవులు తెలుగుభాష, పర్యావరణం, సంస్కృతి సంప్రదాయాలపై కవితా పఠనం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో కళాక్షేత్ర ది డాన్స్ అకాడమీ నిర్వాహకులు ఎ. గీత, పి. మోనిక శిష్యబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు, గాయకులు పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతరంగ వీక్షణం నిడదవోలు చరిత్ర,,విశ్వకవి సమ్రాట్ మూడు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సృజనోత్సవం వంటి వినూత్న కార్యక్రమాలు సాహిత్య సాంస్కృతిక రంగాన్ని మరింత సజీవం చేస్తాయని వక్తలు కొనియాడారు. వ్యాఖ్యాతగా వంగిపురపు శారద వ్యవహరించగా సభను మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ పర్యవేక్షించారు.



### భోగాపురం విమానాశ్రయంలో బ్రిక్స్ ప్రతినిధులకు తెలుగు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం

**విజయనగరం, ఆగస్టు 23, ప్రభాతవార్త:** విశాఖపట్నంలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల నుంచి విచ్చేస్తున్న ప్రతినిధులకు భోగాపు రంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విజయనగరం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా మేళతాళాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో విదేశీ ప్రతినిధులకు ఆత్మీయ స్వాగతం పలికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పారు. ప్రతినిధుల రాక సందర్భంగా విమానాశ్రయంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.బ్రిక్స్ సదస్సుకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రతినిధుల జాబితా ప్రకారం రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. రష్యా తరఫున క్రీడల ఉప మంత్రి అలెక్సీ మొరోజోవ్, చైనా తరఫున క్రీడల సాధారణ పరిపాలనా సంస్థ ఉప మంత్రి కుయ్ జియాన్, దక్షిణాఫ్రికా తరఫున క్రీడలు, కళలు మరియు సంస్కృతి శాఖ ఉప మంత్రి పీస్ మాబే, ఈజిప్ట్ తరఫున కౌన్సిలర్ మొహమ్మద్ ఖాటర్, ఇండోనేషియా ప్రతినిధి బృందానికి కాన్సుల్ జనరల్ ఎడీ వార్డోయో తదితరులు ఉన్నారు.అలాగే ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, బ్రెజిల్ దేశాల నుంచి కూడా ప్రతినిధులు హాజరవుతున్నారు.భారతదేశం తరఫున కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ, కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, క్రీడల కార్యదర్శి హరి రంజన్ రావు పాల్గొంటున్నారు.భోగాపురం విమానాశ్రయంలో ప్రతినిధులకు జిల్లా హౌసింగ్ పీడీ మురళీమోహన్, జిల్లా టూరిజం అధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తదితర అధికారులు స్వాగతం పలికారు. విదేశీ ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలను పరిచయం చేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.బ్రిక్స్ సదస్సు సందర్భంగా విజయనగరం జిల్లాలోని భోగాపురం విమానాశ్రయానికి వస్తున్న అంతర్జాతీయ ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టింది.



## ఫిట్ శ్రీకాకుళమే నా లక్ష్యం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 23 ప్రభాతవార్త :** చెస్ క్రీడ ద్వారా మెదడుకు వ్యాయామం లభిస్తుందని, ప్రత్యర్థి ఎత్తును సైతం పసిగట్టి ఆడే ఈ ఆట ద్వారా ముందు చూపు మనకు అలవాటు అవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టిఆర్ భవన్ లో శనివారం నుండి జరుగుతున్న ఎంపి కప్ 2026 చెస్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. మొదటగా కేంద్ర మాజీ మంత్రి దివంగత ఎర్రంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెస్ క్రీడను ఆడుతున్న క్రీడాకా రులను పరిచయం చేసుకున్నారు. అభినందనలు తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నీలో పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడికి ప్రశంసా పత్రాన్ని అందించారు. కరణం మల్లీశ్వరి లాంటి క్రీడాకారులు పుట్టిన శ్రీకాకుళం నేల లో ప్రతిభకు కొదవ లేదని ప్రోత్సాహం అటు తల్లితండ్రుల నుండి కూడా మరింత అందాల్సిన అవసరం ఉందని అన్నారు. భవిష్యత్ లో మరిన్ని పోటీలు నిర్వహిస్తూ ఉంటామని స్పష్టం చేశారు. టోర్నీ విజయవంతంగా జరిగేలా పూర్తి తోడ్పాటు అందించిన చెస్ అసోసియేషన్ సభ్యులకు, క్రీడాకారులకు, క్రీడాభిమానులను ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, వంశధార ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ అరవల రవీంద్ర బాబు, నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాండ్రంకి శంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసు నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుంగ భాస్కర్, కొర్ను నాగార్జున ప్రతాప్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలగ ప్రహర్ష, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సనపల భీమారావు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ తదితరులు

## శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలి

### ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికులు తమ శ్రమ దోపి డీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని ఎం. రామకృష్ణ అన్నారు. గాంధీనగర్ ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఆదివారం కె.వి.రమణ అధ్యక్షతన జిల్లా ఐఎఫ్టియు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎం. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంఘటిత, అసం ఘటిత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే వాటిని పరిష్కరించడంలో తీవ్ర వైఫల్యం చెందిందని విమర్శించారు. అధికా రంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు పాత పెన్షన్ స్కీము అమలు చేయాలని కోరుతున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు అనుకూలంగా కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధం గా పని గంటలను 10కు పెంచి కార్మికులకు అన్యాయం చేశారని విమర్శిం చారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పదేపదే వారి దృష్టికి తీసుకొచ్చిన స్పందన కరువైందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని పరిష్కారం వైపు దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. హరికృష్ణారెడ్డి, కె. రవీంద్ర, కొప్పుల కుమార్, బాజీ, పి. సుబ్బారావు, పెద్దిరాజు, చిన్నరావు, విజయారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## వేడుకలా సాగరతీర మహాగణపతి మట్టి సేకరణ

### మూడు స్తంభాల సెంటర్ నుండి మంగినపూడి వరకు మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఊరేగింపు


**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్టణం శివారు మంగినపూడి సముద్రతీరంలో ఏర్పాటు చేస్తున్న సాగరతీర మహాగణపతి విగ్రహ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములవ్వడం ఆనందంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని ఇళ్ల నుండి, వ్యవసాయ క్షేత్రాల నుండి సేకరించిన మట్టిని భారీ ఊరేగింపుగా మంగినపూడి బీచ్ వద్దకు తరలించారు. మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు, నగర ప్రజలు భారగా పాల్గొన్నారు. మూడు స్తంబాల సెంటర్లోని విజయగణపతి ఆలయం వద్ద, జెడ్పీ సెంటర్లోని గణపతి ఆలయం వద్ద సహా.. దారి పొడవునా ప్రజల నుండి మట్టి సేకరించారు.మన సంప్రదాయానికి, మన సంస్కృతికి, మరీ ముఖ్యంగా మన ప్రకృతికి దగ్గరగా ఉండే లక్ష్యంతో మట్టి సేకరణ ప్రారంభించామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 63 అడుగుల భారీ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని.. అత్యంత శోభాయమాణంగా నవరాత్రులు నిర్వహించాలని నిర్ణయించాం. ఈ మహాత్కార్యంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామిని చేయడం లక్ష్యంగా.. ప్రతి ఇంటి నుండి, ప్రతి వ్యవసాయ క్షేత్రం నుండి మట్టిని సేకరించాలని పిలుపునిచ్చామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ట్రాఫిక్ నియంత్రణను అత్యంత పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసు కుంటాం. వినాయక చవితి అంటేనే ప్రకృతిని ఆరాధించడం. ఈ విషయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ కార్యక్రమంతో ఈ ప్రాంతంతో పాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకూడా అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందని నమ్ముతున్నాం. ఆ విఘ్నాధిపతి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



## ఊచగుంటపాలెంలో గుప్త నిధుల తవ్వకాల కలకలం

### శివాలయం గర్భగుడి వెనుక సుమారు 15 అడుగుల లోతులో గుంతలు తవ్వినట్లు గ్రామస్తుల ఆరోపణలు, పోలీసుల విచారణ

**దగదర్తి (నెల్లూరు), ఆగస్టు23, ప్రభాతవార్త :** మండలంలోని ఊచగుంటపాలెం గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గ్రామంలోని శివాలయం గర్భగుడి వెనుక ఆలయ పూజారి, మరికొందరు వ్యక్తులతో కలిసి గుప్త నిధుల త్రవ్వకాలు చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆలయంలో గుప్త నిధులు ఉన్నాయనే అనుమానంతో వాటిని వెలికితీయాలనే ఉద్దేశంతో అమ్మవారి విగ్రహం వెనుక సుమారు 15 అడుగుల లోతు వరకు గుంతలు తవ్వినట్లు గ్రామస్తులు ఆరోపించారు. గత నాలుగు రోజులుగా త్రవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల రాత్రి వేళలలో కార్లు, ఇతర వాహనాలలో కొంతమంది గ్రామానికి వచ్చిపోతున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. త్రవ్వకాల విషయం బయటికి రావడంతో బయటనుంచి తెచ్చిన జంతువుల ఎముకలు గుంతలో వేసి వాటిని వెలికి తీసేందుకే త్రవ్వకాలు జరిపినట్లు పూజారి చెప్పడంపై మరల సగం గుంతను అదే మట్టితో పూడ్చి వేసిన క్రమంలో పూజారి స్వర్ణ రమేష్ పై గ్రామస్తుల అనుమానాలు మరింత బలపడ్డాయి. గ్రామస్తులు ఆలయ చైర్మన్ రాజశేఖర్ ను నిలదీయగా కాలభైరవ విగ్రహం ప్రతిష్టించాలని పూజారి చెప్పాడని గుంతలు తవ్వకాల విషయం తనకేమీ తెలియదంటూ చెప్పడంతో ఇరువురి పొంతనలేని సమాధానాలతో అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలయ పూజారిని అదుపులోకి తీసుకొని ఎస్ఐ మహేంద్ర విచారిస్తున్నారు. తవ్వకాలు ఎందుకు చేపట్టారు.. ఎవరెవరు ఇందులో పాల్గొన్నారు. అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఉన్న పూజారిని తొలగించి సంవత్సరం క్రితం అద్దంకి నుండి మరో పూజారిని నియమించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆలయ ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగినట్లు ఆరోపిస్తున్న తవ్వకాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని గ్రామస్తులు కోరుచున్నారు.



## దాతల సహకారంతో జీజీహెచ్‌లో 2 రెస్ట్ హౌస్‌లు

### 5వేల లీటర్ల వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన

**నెల్లూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త - వైద్యం:** నిరుపేదలు, రోగులకు గౌరవప్రదమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నెల్లూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో కోటి రూపాయల వ్యయంతో దాతల సహకారంతో చేపట్టిన 2 రెస్ట్ హౌస్‌లు, వాటర్ ప్లాంట్ నిర్మాణాలకు మల్లెల శ్రీహరితో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదన్నారు. ఆ కోవలో తాను తన నియోజకవర్గంలో అభివృద్ధి పట్ల ప్రజలు నన్ను నిలదీయవచ్చుని ప్రకటించినప్పుడు స్థానిక భక్తవత్సల నగర్ వాసి వరంగల్‌లో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థి మల్లెల శ్రీహరి తనకు ఒక మెసేజ్ పంపాడని, అందులో నిరుపేదలకు వైద్య సేవలు అందించే జిజిహెచ్‌లో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయమని పంపిన మెసేజ్ తనను ప్రభావితం చేసిందని వివరించారు. ఆయన సూచనలనుదృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంతో కూడా చర్చిం చాన న్నారు. అనంతరం అనేకమంది దాతలతో చర్చించిన మీదట డిఎస్ఆర్ గ్రూపు దేవి రెడ్డి రఘురామిరెడ్డి, ఇస్కాన్ సిటీ వాసి రసం రామకృష్ణారెడ్డి స్పందించి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వచ్చారని వెల్లడించారు.

## ఎపిలో ఆయుష్‌కు భారీ ఊతం

## రూ.185.75కోట్లతో వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం

### ఐటీడీఏ ప్రాంతాల్లో 19 మొబైల్ మెడికల్ యూనిట్లు

### డిస్పెన్సరీల ఆధునికీకరణ, ఆల్కహాల్ డీఅడిక్షన్ కేంద్రాలు, యోగా వెల్నెస్ కేంద్రాలు, ఇతర వాటికి నిధుల ఆమోదం: మంత్రి సత్యకుమార్



**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మధ్య సమన్వయం రాష్ట్ర ప్రయోజనాలకు ఏ స్థాయిలో దోహదపడుతుందో మరోసారి స్పష్టమైందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ నాయకుడు సత్యకుమార్ వ్యాఖ్యానించారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ఆయుష్ రంగానికి నిధులు సాధించేందుకు చేసిన ప్రయత్నాలు ఒక్కొక్కటిగా ఫలిస్తున్నాయి. ఇటీవలే గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో రూ. 100 కోట్ల తో సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ యోగ అండ్ నేచురోపతి 100 పడకల రీసెర్చ్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం సమర్పించిన 2026-27 రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక కు కేంద్ర ఆయుష్ మిషన్ డైరెక్టరేట్ రూ.185.75 కోట్లకు ఆమోదం తెలిపింది. 2014లో జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపులు ఇవే కావడం విశేషం. గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు 9 ఐటీడీఏల పరిధిలో 19 మొబైల్ మెడికల్ యూనిట్లను సేవల్లోకి తీసుకురావడం ఈ ప్రణాళికలో అత్యంత ప్రాధాన్యతంశంగా చేసారు. నేషనల్ ఆయుష్ మిషన్ కేంద నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2014 నుండి 2024 వరకు పదేళ్ల కాలంలో మొత్తం రూ. 120.17 కోట్లు మంజూరు చేయగా, 2024 నుండి 2027 వరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం మూడేళ్ల కాలానికే రూ. 434.64 కోట్ల నిధుల కేటాయింపులకు కేంద్ర ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన రూ.185.75 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయుష్ శాఖ ఉన్నతాధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీనివాసరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణలో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన పార్టీ ఇప్పటి నుంచే కసరత్తు ప్రారం భించింది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎన్నికలకు ఇతర పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా జనసేన రాజకీయంగా ముందడుగు వేసింది. గతంలో వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన గడల శ్రీనివాసరావును పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయాలని పార్టీ నేతలు నేమూరి శంకర్ గౌడ్, రామ్ తాళ్లూరి జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పలు అంశాలను పరిశీలించిన అనంతరం గడల శ్రీనివాసరావు పేరును ఖరారు చేసినట్లు జనసేన ప్రకటించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో జనసేన ఇప్పటి నుంచే కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటర్లను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థి ఎంపికపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. వైద్య, ఆరోగ్య రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న గడల శ్రీనివాసరావును బరిలోకి దింపడం ద్వారా పట్టభద్రులు, ఉద్యోగులు, యువతతోపాటు వివిధ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా ప్రచారం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ముందుగానే దృష్టి పెట్టే అవకాశం జనసేనకు లభించింది. పవన్ కల్యాణ్ ఆమోదంతో అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## ఖలిస్థానీ నిజ్జర్‌ను చంపింది మేమే

### గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ సంచలన ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** భారత్, కెనడాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను హత్య ఉదంతంలో తాజాగా సరికొత్త విషయాలు వెలుగు చూశాయి. నిజ్జర్‌ను చంపింది తామేనని అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ సంచలన ప్ర కటన చేశాడు. డ్రగ్స్ స్మగ్లింగ్, ఆయుధాల అక్రమ రవాణా కారణాలతోనే నిజ్జర్‌ను చంపినట్లు బ్రార్ వెల్లడించాడు. 2023 జూన్ 18వ తేదీన నిజ్జర్‌ను కెనడాలోని గురుద్వార వద్ద పార్కింగ్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అతి సమీపం నుంచి తుపాకులతో కాల్చి చంపడం తెలిసి ందే. ఆ సమయంలో కెనడా ప్రధానిగా వున్న జస్టిన్ ట్రూడో నిజ్జర్ హత్యలో భారత నిఘా వర్గాల హస్తం వుందని తమ ఇంటెలిజెన్స్ అధికా రులు గుర్తించినట్లు ఆ దేశ పార్లమెంట్‌లో వెల్లడించడం సంచలనం రేపింది. దీనిని భారత్ తీవ్రంగా ఖండించింది. అయితే భారత్ వాదనలను కెనడా పట్టించుకోక పోవడంతో దౌత్య యుద్ధం ముదిరి ఇరుదేశాలు



కెనడాలో 2023 జూన్‌లో హత్యకు గురైన నిజ్జర్

పరస్పరం రాయబారులను బహిష్క రించుకున్నాయి. ఈ ఘటన తరువాత భారత్, కెనడాల మధ్య రెండేళ్లకు పైగా దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చివరకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం కూలిపోవడం, కొత్త స ర్కారు రావడం, అనంతరం జరిగిన పరిణామాల వల్ల తిరిగి రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుపడ్డాయి. ఇదే సమయంలో అమెరికా, బ్రి టన్ ప్రభుతాలు నిజ్జర్ హ త్యలో భారత్ హస్తం లేదని ప్రకటించడం, ఇది నిజమని కెనడా సర్కారు అంగీకరించిన తరువాత దౌత్య సంబం ధాలను పూర్వస్థాయికి వచ్చాయి. ఇక తాజా విషయానికి వస్తే నిజ్జర్ హత్యలో తమ హస్తం వుందని అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ పే ర్కొనడం సంచలనం రేపింది. బ్రిటన్‌కు చెందిన మరో ఖలిస్తాని ఉగ్రవాది పరంజిత్ సింగ్ పన్నూతో మాట్లాడిన సమయంలో బ్రార్ ఈ విషయ ం వెల్లడించినట్లు కెనడాతో పాటు బ్రిటన్ దేశాల నిఘా వర్గాలకు సమాచారం అందాయి.

నిజ్జర్ ఒక దుర్మార్గుడని డ్రగ్స్ స్మగ్లింగ్ ద్వారా కోట్లాది డాలర్లు సంపాదించాడని, 16, 17 ఏళ్ల యువకులను ఇందుకోసం ఉపయోగించే వాడని, యువకులను డ్రగ్స్ స్మగ్లింగ్‌కు రావాలని బ్లాక్ మెయి ల్ చేసేవాడని బ్రార్ చెప్పాడని నిఘా వర్గాలు అందించిన నివేదికలో వుంది. దీంతో పాటు మైనర్లను టీనేజి యువకులను ఇన్‌ఫార్మర్లుగా వాడు కునేవాడని, తన మాటకు ఎదురుచెప్పితే వారిని నిర్దాక్షిణ్యంగా చంపేసేవాడని బ్రార్ తెలిపాడు. దీంతో పాటు నిజ్జర్ ఆయుధాల వ్యాపారంలో నూ ఆరితేరాడని, అందుకే అతన్ని చంపేసినట్లు బ్రార్ తెలిపాడు.

## చిన్నారెడ్డి సంజాయిషీ సంతృప్తిగా లేదు: వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యాఖ్యా నించడమే కాకుండా క్రమశిక్షణ కమిటీ నోటీసులకు చిన్నారెడ్డి ఇచ్చిన సంజాయిషీ కూడా సరిగాలేదని క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీ నాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి క్రమశిక్షణా కమిటీ సంఘం ముందు హాజరై, తాను పార్టీ కార్యకర్తల మనోభావాలు మాత్రమే చెప్పాను తప్ప ఏ ఒక్కరినీ అవమా నించేలా వ్యాఖ్యానించలేదని సంజాయిషీ ఇచ్చుకున్నారు.అయితే దీనిపై వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి ఆదివారం స్పందిస్తూ చిన్నారెడ్డిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కరిస్తాం

### సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం

### సమ్మె నిర్ణయాన్ని వారు ఉపసంహరించాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** డీజిల్,పెట్రోల్ ఆటోలను రేటిరోఫిట్మెంట్ చేయడానికి ప్రతి ఆటోకు రూ.150లక్షలు ఆర్థిక సహాయం చేసిఎల్రక్టిక్ ఆటో లకు మారేందుకు చర్యలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటోకార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సమ్మె నిర్ణయం వెనక్కితీసుకోవాలని మంత్రి పొన్నం కోరారు.2015 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదనీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామనీ హామి ఇచ్చారు.కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.ఆటో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామనీ తెలిపారు. దీనికి అవసరమైన విధివిధానాలను రూపొందించి బోర్డు ఏర్పాటు చేస్తామనీ తెలిపారు.

హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌కు ప్రభుత్వం ప్రోత్సాహం అంది స్తుందనీ చెప్పారు.ఎలక్ట్రిక్ ఆటోలకు మారేందుకు ప్రతి ఆటోకు రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వ సహాయం చేసేందుకు కేబినెట్ లో నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ గుర్తుచేశారు. పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుంది.హైదరాబాద్‌లో దశలవారీగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. .గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందనీ చెప్పారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి విధానంతో వారికి మరింత ప్రయోజనం కల్పించవచ్చో ప్రభుత్వం పరిశీలిస్తోందని వివరించారు. ఆటో కార్మికులు కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన ఆటో కార్మికుల కుటుంబాలకు కూడా ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందనీ తెలిపారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన విధంగానే ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. సమ్మె ద్వారా సమస్యలు పరిష్కారం కావు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.హైదరాబాద్ లో లేకపోవడం వల్ల ఆటో కార్మిక సోదరులకు హుస్నాబాద్ నుండి విజ్ఞప్తి చేస్తున్నాటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి సహకరించాలనీ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## బిజెపిని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** బిజెపిని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం నగర కార్యాలయంలో జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షుల సమావేశం జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, భవిష్యత్తులో పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'సర్' విషయంలో బూత్ స్థాయిలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, రాష్ట్ర నాయకులు ఒ. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రభారి వీరెల్లి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, గడ్డం వెంకటస్వామి, కన్నె రమేష్‌యాదవ్, జె.ఎల్.రాహుల్‌చంద్ర, మోతుకుల శ్యాంరాజ్, కుంబాల గంగరాజు, పందిర్ల ప్రసాద్, పవన్, సుప్రియగౌడ్, ఏకల కన్నా, ఆఫీస్ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, మీడియా కన్వీనర్ భుజేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గణేష్, ఒబిసి మోర్చా అధ్యక్షులు బంగారు ప్రకాష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు అంబేద్కర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, యువమోర్చా అధ్యక్షులు భరత్ గౌడ్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'సర్' ఫేజ్-2 పై కాంగ్రెస్ జూమ్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** 'సర్' ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఐదున్నరకు అత్యవసర జూమ్ సమావేశం ఏర్పాటు చేశామని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, పోటిచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు పార్లమెంట్ సర్ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ సర్ కోఆర్డినేటర్లు విధిగా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సావంత్ ఈ సమావేశంలో పాల్గొని 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో గ్రామసభ / వార్డు సభలను నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఈ సమావేశంలో సమీక్షించి, తుది కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుందని వివరించారు. అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో 100 బూత్‌ల వారీగా కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకో వడానికి వ్యూహారచన చేసి వివరిస్తారని తెలిపారు.

## ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై నేటి నుంచి బిజెపి దీక్ష

### పోలీసుల ఆంక్షలపై భయపడేది లేదు:

### పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు23:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణలో ఛత్రోంకీ గూంజ్ పెట్టాలని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు సవాల్ విసిరారు. తెలంగాణకు రావాలని రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణకు రాహుల్ గాంధీని ఒక్క విద్యార్థి కూడా రానివ్వడని అన్నారు. తెలంగాణలో అడుగుపెడితే రాహుల్ గాంధీని విద్యార్థులే అడ్డుకుంటారని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలు మరిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై బీజేపీ కార్యాలయం ముందు రెండు రోజులు నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు.ఫీజు రీయింబర్స్ మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఫీజ్ రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లు ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి విద్యాసంస్థలు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తమ నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. పోలీసుల అనుమతి లేకున్నా.. పార్టీ కార్యాలయంలోనే తమ దీక్ష చేపడతామని ప్రకటించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని హైకోర్టు నడిపిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి మారుపేరని తెలిపారు.

## ఆక్రమణల చెరలో ఆగ్రోస్ భూములు

### బెల్లంపల్లిలో 543 ఎకరాలు కబ్జా

### వివిధ ప్రాంతాల్లో మరికొన్ని ఆక్రమణలు

### సర్కార్‌కు అధికారుల నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) సంస్థకు చెందిన వందలాది ఎకరాల విలువైన భూములు అక్రమార్కుల కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మోలాలితో పాటు, ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో ఆగ్రోస్ భూములు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించినట్లు తెలియవచ్చింది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఆక్రమణలకు సంబంధించి ముఖ్యంగా రాష్ట్రంలోని ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లి పరిధిలో ఏకంగా 543 ఎకరాల ఆగ్రోస్ భూమి కబ్జా అయినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా పరిధిలోని మోలాలిలో 24 ఎకరాలు కబ్జా అయ్యాయి. ఈ మేరకు ఆగ్రోస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆగ్రోస్‌కు చెందిన 29/1, 31 సర్వే నంబర్లు కలిగిన 23 ఎకరాల 28 గుంటల భూములు హైదరాబాద్ జిల్లాలోని మారేడ్‌పల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ మండలాల తహసీల్దార్ల పరిధిలో ఉంది. ఆగ్రోస్ అధికారులు ఈ భూములకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో రియల్టర్లు, స్థానికులు, భూబకాసురుల కన్ను ఈ భూములపై పడి ఆక్రమణలకు గురైంది. అలాగే మేడ్చల్ జిల్లా బాలానగర్ మండలం చింతల్‌లోని సర్వే నంబర్లు 221, 222లోనూ ఆగ్రోస్‌కు 10 ఎకరాల భూమి ఉండగా, అందులో కొంత భాగం కబ్జాకు గురైంది. ఇక హైదరాబాద్ జిల్లా షేక్‌పేట్‌లోని సర్వే నంబర్ 403లో 687 గజాలను కూడా కబ్జాదారులు కబళించేందుకు యత్నించగా ఆగ్రోస్ ఇటీవల కంచె నిర్మించి, బోర్డును ఏర్పాటు చేసింది. ఇక ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలోని సర్వే నెంబర్లు 18/19, 18/26, 18/27లో ఆగ్రోస్‌కు 543 ఎకరాల 15 గుంటల భూమి ఉంది. ఇది ఆక్రమణకు గురైందని ఆగ్రోస్ అధికారులు ఇటీవలే గుర్తించి, ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించారు. హైదరాబాద్ శివారులోని మోలాలిలో ఆగ్రోస్‌కు చెందిన సుమారు 24 ఎకరాల భూమి కబ్జాలపై స్పందించిన ఆగ్రోస్ అధికారులు ప్రభుత్వానికి, అలాగే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరినట్లు తెలుస్తోంది. కాగా మోలాలిలోని వివాదాస్పద మరియు మిగిలిన ఆగ్రోస్ భూమిని రక్షించి వినియోగించుకునేలా రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌కు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.




## డ్యూరాండ్ కప్: ఛాంపియన్‌గా ఈస్ట్ బెంగాల్

**న్యూఢిల్లీ:** కోల్‌కతా డెర్బీలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌ను ను ఓడించి, 22 ఏళ్ల తర్వాత డ్యూరాండ్ కప్ 2026 ఫైనల్‌ను గెలుచుకున్న ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో, ఎడ్మండ్ లాల్‌రిండికా తొలి అర్ధభాగంలో సాధించిన హ్యాట్రిక్, బిపిన్ సింగ్ చేసిన మరో గోల్ కారణంగా బెంగాల్ జట్టు, సూపర్ జెయింట్‌ను 4-1 తేడాతో చిత్తుగా ఓడించి డ్యూరాండ్ కప్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో రెడ్ అండ్ గోల్డ్ బ్రిగేడ్‌ను ఓడించిన బాగాన్, రక్షణ విభాగంలో చాలా వెనుకబడి ఉంది. మరియు ఈస్ట్ బెంగాల్ తన ప్రత్యర్థి యొక్క హైలైన్‌ను వేగవంతమైన ఎదురుదాడితో దండించింది. మహమ్మద్ రషీద్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న బిపిన్, 10వ నిమిషంలో విశాల్ కైత్‌ను దాటుకుంటూ బంతిని నెట్‌లోకి పంపి స్కోరింగ్‌ను ప్రారంభించాడు. దీంతో బిపిన్ సింగ్ మొదటి గోల్‌ను నమోదు చేశాడు. తరువాత ఎడ్మండ్ లాల్‌రిండికా కేవలం ఒక నిమిషం తర్వాత స్కోరు పెంచాడు. 27 సంవత్సరాల వయస్సున్న లాల్‌రిండికా 22వ, 44వ నిమిషాల్లో కూడా గోల్ కొట్టి అద్భుతమైన హాట్‌ట్రిక్‌ను పూర్తి చేశాడు. మోహన్ బగాన్‌కు చెందిన మన్వీర్ సింగ్ 33వ నిమిషంలో గోల్ కొట్టాడు. కానీ ఆ సమయంలో ఆంటోనియా ఆబాస్ యొక్క బృందం 4-1తో ముందంజలో ఉంది. లాల్‌రిండికా హాట్‌ట్రిక్ ఈస్ట్ బెంగాల్‌కు మోహన్ బగాన్‌పై జరిగిన రెండవ హాట్‌ట్రిక్. బగాన్ తేరుకునేలోపే, ఎడ్మండ్ రెండు నిమిషాల్లోనే గోల్ చేసి ఈస్ట్ బెంగాల్‌కు ఆధిక్యం తెచ్చాడు. దాని రామిరెజ్ బాక్స్‌లో ఎడ్మండ్‌కు బంతిని అందించగా, అతను సంయమనం కోల్పోకుండా కైత్‌ను ఓడించి రెండవ గోల్‌ను సాధించాడు. అయితే, గత సీజన్‌లో ఇండియన్ సూపర్ లీగ్ గెలిచిన ఈస్ట్ బెంగాల్ అప్పటికే మంచి ఊపు మీద ఉంది, దానితో ఎడ్మండ్ అర్ధ సమయానికి ఒక నిమిషం ముందు తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. రషీద్, జయ్ గుప్తాతో కలిసి ఆడగా, గుప్తా ఇచ్చిన క్రాస్‌ను ఫార్వర్డ్ నెట్‌లోకి నెట్టాడు. డ్యూరాండ్ కప్‌లో కోల్‌కతా డెర్బీలో నమోదైన మొట్టమొదటి హ్యాట్రిక్ ఇది. రెండవ భాగంలో బాగాన్ పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, హాబాస్ తన అత్యంత ప్రభావవంతమైన వ్యూహాలలో ఒకటైన డిఫెన్సివ్‌లోబ్లాక్‌ను ఉపయోగించి మెరైనర్స్‌ను నిలువరించాడు. ఈస్ట్ బెంగాల్ మరో 2 దశాబ్దాల ట్రోఫీ నిరీక్షణకు తెరపడింది.

## 2వ టెస్ట్‌లో పడిక్కల్ సెంచరీతో భారత్ 300 స్కోరు



**కొలంబో:** కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకుపోతుంది. వన్‌డౌన్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ సెంచరీ (117; 193 బంతుల్లో 12 ఫోర్లు)తో చెలరేగడంతో మొదటి రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. క్రీజులో ధ్రువ్ జురెల్ (7), సారాంశ్ జైన్ (4)లు ఉన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. 18 పరుగులు మాత్రమే చేసిన కేఎల్ రాహుల్ జట్టు స్కోరు 37 పరుగుల వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (45; 53 బంతుల్లో 9 ఫోర్లు) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నప్పటికి కూడా గత మ్యాచ్ హీరో దేవ్‌దత్ పడిక్కల్ మరోసారి చెలరేగి ఆడాడు. అతడి ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు క్లిష్టమైన క్యాచ్‌లను లంక ఆటగాళ్లు వదిలివేయడాన్ని సద్వినియోగం చేసుకున్న పడిక్కల్ ఆచితూచి ఆడాడు. అసలు సిసలైన టెస్టు ఇన్నింగ్స్ ఆడాడు. మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులను బౌండరీలకు తరలించాడు. ముందు యశస్వి జైస్వాల్, ఆ తరువాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50; 108 బంతుల్లో 6 ఫోర్లు)లతో భాగస్వామ్యాలు నెలకొల్పాడు. రెండో మ్యాచ్‌లోనూ శతకంతో చెలరేగి వన్‌డౌన్ స్థానానికి తానే సరైన వాడినని నిరూపించుకున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ వ్యక్తిగత స్కోరు 3 పరుగుల వద్ద రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరిగాడు. ఇంకొద్ది సేపటిలో తొలి రోజు ఆట పూర్తి అవుతుందనగా రవీంద్ర జడేజా (43; 83 బంతుల్లో 4 ఫోర్లు) ఔట్ అయ్యాడు. ధ్రువ్ జురెల్, సారాంశ్ జైన్ లు మరో వికెట్ పడకుండా తొలి రోజును ముగించారు.

# టెస్ట్ క్రికెట్‌లో షాకింగ్ రికార్డు

### దారుణమైన ఇన్నింగ్స్..

### భారత్ సహా 50 పరుగులూ చేయలేని జట్లు



**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్ అంటేనే బ్యాటర్ల సహనానికి, నైపుణ్యానికి అసలైన పరీక్ష. ఎంతటి దిగ్గజ జట్టయినా కష్టమైన పరిస్థితుల్లో తడబడితే ఘోరమైన పతనం తప్పదు. మైదానంలో పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా మారినప్పుడు ఎంతటి దిగ్గజ బ్యాటింగ్ లైనప్ అయినా క్షణాల్లో కూలిపోతుంటుంది. సుదీర్ఘ టెస్టు చరిత్రలో కొన్ని జట్లు కనీసం 50 పరుగులు కూడా చేయలేక పెవిలియన్‌కు క్యూ కట్టిన అత్యంత దారుణమైన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఈ అత్యల్ప స్కోర్ల జాబితాలో న్యూజిలాండ్ అగ్రస్థానంలో నిలవగా, వెస్టిండీస్, టీమిండియా, దక్షిణాఫ్రికా వంటి దిగ్గజ జట్లు కూడా ఈ షాకింగ్ రికార్డును నమోదు చేశాయి. టెస్ట్ క్రికెట్ ఒకే ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసిన షాకింగ్ రికార్డు న్యూజిలాండ్ పేరిట ఉంది. మార్చి 25, 1955న ఆక్లాండ్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 26 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు నిలబడలేకపోయారు. కేవలం 27 ఓవర్లలోనే ఇన్నింగ్స్ ముగిసిపోయింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అతి తక్కువ టీమ్ స్కోరు ఇదే కావడం గమనార్హం. ఈ జాబితాలో వెస్టిండీస్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. జూలై 2025లో కింగ్‌స్టన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ కేవలం 27 పరుగులకే ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా పేసర్ల దాడికి విండీస్ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా పెవిలియన్ చేరారు. జట్టులోని ఏ ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరును దాటలేకపోవడంతో ఈ దారుణమైన రికార్డు వెస్టిండీస్ ఖాతాలో చేరింది. దక్షిణాఫ్రికా ఈ జాబితాలో పలుమార్లు కనిపిస్తుంది. 1896లో గెబెహాలో ఇంగ్లాండ్‌పై 30 పరుగులు, 1924లో బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌పై మళ్లీ 30 పరుగులకే ఆలౌట్ అయింది. ఇవే కాకుండా 1899లో కేప్‌టౌన్‌లో 35 రన్స్, 1932లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 36 రన్స్ చేసింది. ఇక భారత జట్టు విషయానికి వస్తే 2020లో అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన డేనైట్ టెస్ట్ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా కేవలం 36 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది భారత టెస్ట్ చరిత్రలో అత్యల్ప స్కోరుగా నిలిచింది. అంతకుముందు 1974లో లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ 42 పరుగులకే కుప్పకూలింది.




## వరల్డ్ అథ్లెటిక్స్: రోహిత్‌కు జావెలిన్ టైటిల్

### రాణించిన శ్రీశంకర్

**న్యూఢిల్లీ:** భారత క్రీడాకారుడు రోహిత్ యాదవ్ తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో పురుషుల జావెలిన్ టైటిల్‌ను గెలుచుకోగా, స్టార్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ తన స్థాయికి తగ్గట్టుగా రాణించి వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ సిల్వర్‌లెవల్ మీట్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. నాలుగో రౌండ్ ముగిసేసరికి నాలుగో స్థానంలో వెనుకబడి ఉన్న రోహిత్, ఐదో రౌండ్ ముగిసేసరికి కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత యశ్వీర్ సింగ్ వెనుక రెండో స్థానానికి చేరుకున్నాడు. ఆ తర్వాత తన ఈటెను 87.68 మీటర్ల దూరం విసిరి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను చేసుకున్నాడు.

ఐదవ రౌండ్‌లో 82.94 మీటర్ల ప్రదర్శనతో యశ్వీర్ రెండవ స్థానంలో నిలవగా, శ్రీలంకకు చెందిన సుమేధ రణసింఘే 80.29 మీటర్లతో మూడవ స్థానంలో నిలిచారు. గత సంవత్సరం ఇక్కడ కాంస్యస్థాయి పోటీని విజయవంతంగా నిర్వహించిన తర్వాత, ఈ పోటీ భారతదేశానికి మొట్టమొదటి వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ రజత ఈవెంట్‌గా నిలిచింది. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత శ్రీశంకర్, తన రెండవ మరియు మూడవ ప్రయత్నాలలో 8.07 మీటర్ల దూరం నమోదు చేశాడు. కానీ దక్షిణాఫ్రికాకు చెందిన దివాన్ మాన్యుయెల్ తన చివరి ప్రయత్నంలో 8.03 మీటర్లు దూకాడు. శ్రీశంకర్, చివరికి కేవలం 4 సెం.మీ. తేడాతో గెలుపొందాడు. అతని సీజన్ బెస్ట్ 8.38 మీటర్లు కాగా, పర్సనల్ బెస్ట్ 8.41 మీటర్లు.

## రెండో టెస్టులో బంగ్లాదేశ్ చిత్తు

### 51 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం

**సౌత్ మక్కే:** డార్విన్ టెస్టులో చారిత్రాత్మక విజయం సాధించి ఆస్ట్రేలియాపై పైచేయి సాధించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టులో మాత్రం ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మక్కే టెస్టులో బంగ్లాదేశ్‌ను ఒక ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తుగా ఓడించింది. మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లతో అదరగొట్టాడు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 64, రెండో ఇన్నింగ్స్ కేవలం 95 పరుగులకే ముగియడంతో మ్యాచ్ రెండో రోజు ఆదివారం నాటికే పూర్తయింది. దీంతో రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమమైంది. ఆస్ట్రేలియా ఈ మ్యాచ్ గెలవడంలో స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్ బ్యాటింగ్ విభాగం నడ్డివిరిచిన స్టార్క్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే దాడిని కొనసాగించి మరో 4 వికెట్లు తీశాడు. మొత్తం గా ఈ మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి బంగ్లాదేశ్ కోలుకోలేని దెబ్బతీశాడు. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బాంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 64 పరుగులకే కుప్పకూలింది. అందులో 11వ స్థానంలో వచ్చిన షోరిఫుల్ ఇస్లాం చేసిన 14 పరుగులే టాప్ స్కోర్ కావడం గమనార్హం. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కామెరాన్ గ్రీన్ (67), స్టీవ్ స్మిత్ (42) రాణించడంతో 210 పరుగులు చేసి 146 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. బంగ్లాదేశ్ హౌలర్ షోరిఫుల్ ఇస్లాం 7 వికెట్లతో పోరాడినా జట్టుకు మేలు జరగలేదు. మిచెల్ స్టార్క్ మెరుపు బౌలింగ్ కారణంగా బాంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ తరపున కెప్టెన్ నజ్ముల్ హోస్సెన్స్ శాంటో 31 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముష్ఫికుర్ రహీమ్ 29 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిగిలిన 9 మంది బ్యాటర్లలో ఎవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. వారిలో ముగ్గురు ఖాతా కూడా తెరవలేకపోయారు. కెప్టెన్ పాట్ కమిన్స్, నాథన్ లియాన్ చెరో 3 వికెట్లుతో స్టార్క్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో రెండో రోజు టీ విరామం తర్వాత ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది.



## ఎఫ్‌డిఐ నిబంధనల్లో మరిన్ని సడలింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సరళీకరించి, దేశంలోకి విదేశీ మూలధననిధులరాక పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలుచేపట్టింది. ఇందులో భాగంగా కంపెనీల అనుబంధ సంస్థలు (సబ్సిడరీలు) విదేశీ పెట్టుబడి నిబంధనల్లో సడలింపులు కోరితే, సంబంధిత సమయంలో వాటిని పరిశీలించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెపుతున్నాయి. ఎఫ్‌డిఐ ప్రతిపాదనలకు ఆమోద ప్రక్రియను సులభతరం చేయడంలో భాగంగా, క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ పరిశీలనకు వెళ్లాల్సిన పెట్టుబడి ప్రతిపాదనల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెంచే ప్రతిపాదన కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ మార్పు అమల్లోకి వస్తే రూ.15,000 కోట్ల వరకు ఉన్నఎఫ్‌డిఐ ప్రతిపాదనలను సంబంధిత మంత్రిత్వ శాఖలే ఆమోదిస్తాయి. వాటిని కేబినెట్‌కమిటీకి పంపాల్సిన అవసరం లేకుండా, ఆమోద ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రూ.5,000 కోట్ల పరిమితి 2015 నవంబర్ నుంచి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతోంది. డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన నిబంధనలను కూడా సరళీకరించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, ఒక భారతీయ అనుబంధ సంస్థకు



పరోక్షంగా విదేశీ పెట్టుబడి వచ్చినప్పుడు, దాని మాతృ సంస్థ లేదా పైస్థాయి సంస్థ ఇప్పటికే అవసరమైన ప్రభుత్వ అనుమతి పొందినట్లయితే ఆ అనుబంధ సంస్థకు మరోసారి ప్రత్యేక ప్రభుత్వ అనుమతి అవసరం లేకపోవచ్చు. ప్రతిపాదిత మార్పులపై అభిప్రాయాలను సేకరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే70 మంది భాగస్వాములతో సంప్రదింపులు జరిపింది. ఈ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం తుది ప్రతిపాదనలను ఖరారు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎఫ్‌డిఐ నిబంధనలను సమీక్షిస్తోంది. ప్రస్తుతం భారత్‌లోకి వస్తున్న మొత్తం ఎఫ్‌డిఐల్లో 90 శాతానికి పైగా ఆటోమేటిక్ రూట్ ద్వారా వస్తోంది.

## 8 మెట్రోనగరాల్లో ఇళ్ల విక్రయాలు డల్!





**ముంబయి, ఆగస్టు 23:** దేశంలోని ఎనిమిది ప్రధాన రెసిడెన్షియల్ మార్కెట్లలో ఈ ఏడాది తొలిత్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 6.1 శాతం తగ్గి 91,729 యూనిట్లకు పరిమితమయ్యాయి. ముందస్తు రుతుపవనాల ప్రభావం, కొనుగోలుదారుల అప్రమత్త వైఖరి కారణంగా హౌసింగ్ మార్కెట్‌లో కార్యకలాపాలు మందగించాయని ఆరమ్ ప్రాప్‌టెక్ విడుదల చేసిన ప్రాప్‌టైగర్ డాట్‌కామ్ రియల్ ఇన్‌సైట్ రిపోర్ట్ వెల్లడించింది. గత త్రైమాసికంతో పోల్చినా విక్రయాలు 4.4 శాతం తగ్గాయి. 2026 జనవరి-మార్చి త్రైమాసికంలో 95,973 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ తగ్గుదలను విస్తృత స్థాయి మందగమనంగా కాకుండా మార్కెట్‌లో కొనసాగుతున్న కన్సాలిడేషన్ దశగా చూడాలని నివేదిక పేర్కొంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 97,674 యూనిట్ల అమ్మకాలు నమోదైన నేపథ్యంలో ప్రస్తుత గణాంకాలపై పోలిక ప్రభావం కూడా ఉందని తెలిపింది. అమ్మకాలు తగ్గినప్పటికీ డెవలపర్లు కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో వెనుకడుగు వేయలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఎనిమిది నగరాల్లో మొత్తం 89,161 ఇళ్లను కొత్తగా మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 6 శాతం పెరుగుదల. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే కొత్త ప్రాజెక్టుల ప్రారంభాలు 4.2 శాతం తగ్గాయి.కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్ల కంటే అమ్ముడైన ఇళ్ల సంఖ్య 2,568 యూనిట్లు అధికంగా ఉండటంతో డిమాండ్-సప్లై సమతుల్యత పెద్దగా దెబ్బతినలేదని నివేదిక తెలిపింది. ఎనిమిది మార్కెట్లలోనూ వార్షిక ప్రాతిపదికన ధరలు పెరిగాయి. చెన్నైలో కనిష్ఠంగా 4.4 శాతం పెరగ్గా, బెంగళూరులో గరిష్ఠంగా 26 శాతం ధరల వృద్ధి నమోదైంది. పుణెలో తొలిసారిగా చదరపు అడుగు ధర రూ.8,000ను దాటింది. అమ్మకాల పరంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ మార్కెట్‌గా కొనసాగింది. బెంగళూరు, పుణె, హైదరాబాద్ మార్కెట్లలో టెక్నాలజీ రంగంలోని ఉపాధిపై ఆధారపడటం కూడా కీలక అంశంగా మారిందని ప్రాప్‌టైగర్ డాట్‌కామ్ సీఈఓ ప్రకాశ్ తేజ్‌వానీ తెలిపారు.

## నాలుగైదేళ్లలో 30 కోట్లమంది పిఎఫ్ చందాదారులు

### -పిఎఫ్‌ఆర్డీయే ఛైర్మన్ వెల్లడి



**చెన్నై, ఆగస్టు 23:** వచ్చే నాలుగైదేళ్లలో నేషనల్ పెన్షన్ సిస్టమ్, అటల్ పెన్షన్ యోజనలో కలిపి దాదాపు 30 కోట్ల మంది ప్రత్యేక చందాదారులను చేర్చుకోవాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ పిఎఫ్‌ఆర్డీయే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఎపివైలో 10 కోట్ల మంది, ఎన్‌పిఎస్‌లో 2.2 కోట్ల మంది చందాదారులు ఉన్నారని పిఎఫ్‌ఆర్డీయే ఛైర్మన్ శివసుబ్రమణియన్ రామన్ తెలిపారు.ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, రైతులు తదితరులు పదవీ విరమణ అనంతర అవసరాల కోసం పొదుపు, పెట్టుబడులు చేసేలా ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. ముఖ్యంగా నాలుగోశ్రేణి ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌పిఎస్, ఎపివైపై అవగాహన పెంచి పెట్టుబడి అలవాటును పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.పిల్లల కోసం ఎన్‌పిఎస్ వాత్సల్య, ఎన్‌పిఎస్ సంచయ్ వంటి పథకాలను ఇప్పటికే ప్రారంభించామని, ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌ఫిఎస్ స్వాస్థ్య పథకాన్ని మరో రెండు నెలల్లో అధికారికంగా ప్రారంభించనున్నట్లు రామన్ తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న తరహా ఆస్తుల కేటాయింపు ప్రయోజనాలు ప్రైవేటు ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, రైతులకు కూడా అందాలన్నదే PFRDA ఉద్దేశమన్నారు.



వాణిజ్యం

## ఫెడ్‌రిజర్వు నిర్ణయాలే మార్కెట్లకు కీలకం!

**ముంబయి, ఆగస్టు 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారంలో నష్టాల్లో ముగియడంతో వచ్చే వారం సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ తొలి కీలక ప్రసంగం, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, చర్చల పరిణామాలు, ముడి చమురు ధరల కదలికలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు.అమెరికా బాండ్ రాబడులు పెరుగుతుండటం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కొనసాగడం, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్వల్ప లాభాలు నమోదైనప్పటికీ వారాంత ప్రాతిపదికన రెండు ప్రధాన సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ సుమారు 0.47 శాతం, సెన్సెక్స్ దాదాపు 0.60 శాతం చొప్పున క్షీణించాయి. వచ్చే వారం మార్కెట్లకు ప్రధాన ట్రిగ్గర్‌గా అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ప్రసంగం నిలవనుంది. ఈనెల 28న వ్యోమింగ్‌లో జరిగే వార్షిక జాక్సన్ హాల్ ఎకనామిక్ పాలసీ సింపోజియంలో ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు. వడ్డీ రేట్లపై ఫెడ్ వైఖరికి సంబంధించి ఆయన చేసే వ్యాఖ్యలను ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ దిశను ప్రభావితం చేయవచ్చు. కొత్త ఆంక్షలు విధించాలన్న అమెరికా ప్రణాళికను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పరిస్థితులు మళ్లీ తీవ్రతరం అయితే ప్రపంచ మార్కెట్లలో రిస్క్‌కు దూరంగా ఉండే ధోరణి పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

దేశీయ ఈక్విటీ మార్కెట్ల దిశను నిర్ణయించడంలో ముడి చమురు ధరలు కూడా కీలకంగా మారనున్నాయి. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో శుక్రవారం చమురు ఫ్యూచర్స్ ధరలు పెరిగాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

## టాప్ 4 కంపెనీల్లో రూ.88వేల కోట్ల ఎంక్యాప్ నష్టం



**ముంబయి, ఆగస్టు 23:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో నాలుగు సంస్థల మార్కెట్ విలువ గత వారంలో రూ.87, 960. 29 కోట్లు క్షీణించింది. స్టాక్ మార్కెట్లలో ప్రతికూల ధోరణి ఇందుకు కారణమైంది. టాప్10 కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.28,052.96 కోట్లు తగ్గి రూ.12,14, 963.15 కోట్లకు చేరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మార్కెట్ విలువ రూ.22,070. 34 కోట్లు తగ్గి రూ.8,31, 436.51 కోట్లకు చేరింది.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.20,861.20 కోట్లు తగ్గి రూ.9,64,968.76 కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.16,975.79 కోట్లు తగ్గి రూ.4,73,912.56 కోట్లకు చేరింది.ఆరు కంపెనీలకు లాభాలుమరోవైపు టాప్ 10లోని ఆరు కంపెనీలు గత వారం మార్కెట్ విలువలో వృద్ధిని నమోదు చేశాయి.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) మార్కెట్ విలువ రూ.12,650 కోట్లు పెరిగి రూ.5,35,980.31 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.8,119.53 కోట్లను జోడించడంతో దాని మార్కెట్ విలువ రూ.17,78,175.59 కోట్లకు పెరిగింది.లార్సెన్ అండ్ టూబ్రో మార్కెట్ విలువ రూ.3,487.83 కోట్లు పెరిగి రూ.5,62,460.94 కోట్లకు చేరగా, బజాజ్ ఫైనాన్స్ రూ.3,424.28 కోట్లు పెరిగి రూ.6,80,621.62 కోట్లకు చేరింది.ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.752.47 కోట్లు పెరిగి రూ.10,18,330.45 కోట్లకు చేరగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.356.95 కోట్లు జోడించడంతో దాని మార్కెట్ విలువ రూ.11,21,159.05 కోట్లకు చేరింది.

## మూడేళ్లలో రూ.200 లక్షల కోట్లకు ఎస్‌బిఐ టర్నోవర్



**ముంబయి,ఆగస్టు 23:** దేశంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ భారతీయ స్టేట్‌బ్యాంకు మొత్తం వ్యాపారం 2030 నాటికి రూ.200 లక్షల కోట్లకు చేరుకు ంటుందని బ్యాంక్ ఛైర్మన్ సి.ఎస్. శెట్టి తెలిపారు. ప్రస్తుత వృద్ధి రేటు కొనసాగితే 2030 నాటికి మొత్తం వ్యాపారం రూ.170-180 లక్షల కోట్ల స్థాయికి చేరవచ్చని, అనుకూల పరిస్థితుల్లో రూ.200 లక్షల కోట్ల మైలురాయిని కూడా అధిగమించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తొలిసారిగా బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. 2026 జూన్ చివరి నాటికి అది మరింత పెరిగి రూ.110.01 లక్షల కోట్లకు చేరింది.2030 నాటికి బ్యాంక్ ప్రస్తుత వృద్ధి కొనసాగితే రూ.170-180 లక్షల కోట్లకు, అవకాశం ఉంటే రూ.200 లక్షల కోట్లకు చేరుకోవచ్చని తెలిపారు.భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుతో ఎస్‌బీఐ కార్యకలాపాల స్థాయి ముడిపడి ఉంటుందని శెట్టి వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ 7-8 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తే, ఎస్‌బీఐ బ్యాలెన్స్ షీట్ ఏటా 11-12 శాతం మేర విస్తరించే సామర్థ్యం ఉందన్నారు. ఈ వేగంతో బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ ప్రతి ఆరు సంవత్సరాలకు దాదాపు రెట్టింపు కావచ్చని చెప్పారు. నాలుగు ప్రధాన భాగస్వాములపై దృష్టిఎస్‌బీఐ విజన్ 2030లో భాగంగా ఖాతాదారులు, ఉద్యోగులు, వాటాదారులు, ప్రభుత్వం-నియంత్రణ సంస్థలు అనే నాలుగు ప్రధాన భాగస్వాముల అవసరాలపై దృష్టి సారిస్తున్నట్లు శెట్టి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాంకులతో పోల్చుకుని ప్రతి విభాగంలో అత్యున్నత ప్రమాణాలను అందుకోవడమే లక్ష్యమన్నారు.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 24 ఆగస్టు 2026 | I




# ఆదివాసీ చట్టాల పరిరక్షణ మన అందరి బాధ్యత

**చింతూరు ఆగస్టు 23 (ప్రభాత వార్త).** ఆదివాసీ ప్రజానీకం చట్టాలపై సంపూర్ణ అవగాహనతో ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ నాయకులు పోడియం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కులు, చట్టాలపై ప్రతి ఆదివాసీ యువతకు సంపూర్ణ అవగాహన కల్పించి, వాటి పరిరక్షణ కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆదివారం చింతూరు డివిజన్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో ఆదివాసీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు అనేక రక్షణలు కల్పించాయని తెలిపారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల స్వయం పరిపాలన, గ్రామసభల పాత్ర, సహజ వనరులు, భూమి మరియు జీవనోపాధిపై ఉన్న హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా 1/70 చట్టం వంటి భూ పరిరక్షణ నిబంధనలపై ప్రతి ఆదివాసీ కుటుంబం, ముఖ్యంగా యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనుల వ్యవసాయ భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పర్వ నాగేశ్వరరావు, మడకం సాయికుమార్, వంజం జయమ్మ, సింకం జ్యోతి, దూది బొజ్జమ్మ, మిడియం దూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరంలో నత్త నడకన డ్రైనేజీ పనులు

## దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**రంపచోడవరం, ఆగస్టు 23 ప్రభాతవార్త.** నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లా పరిపాలన కేంద్రం రంపచోడవరంలో ప్రజలు మౌలిక వసతుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య లోపం, అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనుల కారణంగా మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. సుమారు రూ.3.6 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు నెలలు గడిచినా పూర్తి కాకపోవడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సగం పూర్తయిన కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో సాయంత్రం వేళ దోమల బెడద అధికమై ప్రజలు ఇళ్ల బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగునీటి మధ్యే తాగునీటి పైపులు కనిపించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ పనుల వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు కూడా సక్రమంగా అమలు కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం మలేరియా, డెంగ్యూ నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ రంపచోడవరం కేంద్రంలో మాత్రం ఆ చర్యలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. గత నెలలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రంపచోడవరాన్ని తాత్కాలికంగా అందంగా తీర్చిదిద్దడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. అయితే సీఎం పర్యటన ముగియగానే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారిందని, "మూడు రోజుల ముచ్చట"గానే మిగిలిపోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పరిపాలన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని, డ్రైనేజీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నిల్వ నీటిని తొలగించడంతో పాటు దోమల నిర్మూలన చర్యలను ముమ్మరం చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# ఆదివాసీ ప్రాంత జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

### రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**రాజవొమ్మంగి, అగస్టు 23, ప్రభాతవార్త** రాష్ట్ర జానపద కళలు గిరిజన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య ఆమెతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా ఆమెకు ఆమె భర్త నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ లకు పుష్పగుచ్ఛం అందించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన మర్యాద పూర్వక భేటీలో ప్రాంతాల్లో జానపద కళల ప్రచారం, కళాకారుల సంక్షేమం గురించి చర్చించారు. ఆదివాసీ ప్రాంతాలలో గిరిజన జానపద కళలను, సంస్కృతిని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కళాకారులకు ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహంపై క్షుణ్ణంగా చర్చించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్. డి. ఏ. కూటమి పొత్తు ధర్మం ప్రకారం ముందుకు సాగాలని చర్చించారు. ఎన్. డి. ఏ కూటమి శ్రేణులు అందరూ సఖ్యతగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీరి భేటీ ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకొంది.

# అగ్ని ప్రమాదంలో మూడు తాటాకు ఇల్లు, బడ్డీ కొట్టు దగ్ధం.

### బాధితులకు అండగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**తాళ్లరేవు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు పంచాయతీ సంత మార్కెట్, పెంకె వారి కాలనీ సరిహద్దులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకు ఇళ్లు, ఒక బడ్డీ కొట్టు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో బొచ్చ పోలారావు, పోతా బత్తుల సూరకర్ణం, సోమాదుల అంజిబాబు కి చెందిన తాటాకు ఇల్లు దగ్ధం కాగా, వల్లు సత్యనారాయణ కు చెందిన బడ్డీ కొట్టు, లోపల ఉన్న టెంట్ సామాన్లు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. అయితే ఈ ప్రమాద సమయంలో తాటాకు ఇళ్లలోని గ్యాస్ సిలిండర్ దగ్గర కావడంతో ప్రమాదం తీవ్రత మరింత పెరిగింది. ఈ మూడు కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే సర్వస్వం కోల్పోయారు. గృహాలు దగ్ధమైన బాధితులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఒక్కొక్కరికి రూ .5000 నగదు,నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, కాయగూరలు అందించారు. బడ్డీ కొట్టు దగ్ధమైన వళ్ళు సత్యనారాయణ కు ప్రభుత్వం ద్వారా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చెల్లి వివేకానంద, టేకుమూడు లక్ష్మణరావు, వాసంశెట్టి శ్రీనివాస్, మందాల గంగ సూర్యనారాయణ, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్తిబాబు, పెంకె శ్రీమన్నారాయణ, యనమంద్ర విజయకుమార్, కుడిపుడి దుర్గారావు, సతీష్ ,సతీష్ రాజు, వళ్ళు భీష్మ, భజన సత్తిబాబు, అన్వేష్ అన్వేష్, వీఆర్వోలు వీరబాబు, సత్యవతి పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం ప్రజలతో మంత్రి సుభాష్



**రామచంద్రపురం,ఆగస్టు 23 (ప్రభాతవార్త):** ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రామచంద్రపురం పట్టణంలోని 27వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలు,అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. పేదలు,రైతులు,మహిళలు, యువత,విద్యార్థులు,వృద్ధుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రహదారులు,తాగునీరు,డ్రైనేజీ,విద్య,వైద్య రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. అలాగే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,కూటమి నాయకులు,వార్డు నాయకులు,కార్యకర్తలు,మహిళలు,యువత పాల్గొన్నారు.

# వాతంగిలో సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన



**రాజవొమ్మంగి, అగస్టు 23, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో వాతంగి గ్రామంలో ఆదివారం జడ్డంగి ఎస్. ఐ. చినబాబు ఆధ్వర్యంలో సి. ఐ. సన్యాసినాయుడు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పవద్దని అన్నారు. బ్యాంకు వివరాలు, ఎటిఎం పిన్‌లు ఇతరులకు చెప్పొద్దని సూచించారు. మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ను దరించా లన్నారు. కారు వినియోగదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ఈకార్యక్రమంలో సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. చినబాబు, ఏ. ఎస్. ఐ. సురేష్, కానిస్టేబుల్ దేవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి :బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు మూర్తి



**కె గంగవరం, ఆగస్టు 23, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం అముజూరు గ్రామానికి చెందిన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అవసరాల వెంకటరమణమూర్తి, పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తున్న నూకరాజు కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సాహిద్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి పనులు చేయడానికి భయపడేలా దోషులకు శిక్షలు పడేలా ఉండాలని అన్నారు. హిందూ బాలికలు, హిందూ సమాజం అప్రమత్తంగా ఉండాలని ,ఐక్యంగా ఉంటూ లవ్ జిహాదీ మతమార్పిడి చేసే అన్య మతస్తుల నుండి పిల్లలను కాపాడుకోవాలని,న్యాయవాదులందరూ ఒకటిగా ఉండి నూకరాజు కుటుంబానికి మద్దతుగా నిలవాలని అవసరాల వెంకటరమణమూర్తి కోరారు.

# పవన్ కళ్యాణ్ ఆశయాలే లక్ష్యంగా పని చేస్తాం

### జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి సూర్యకిరణ్

### కత్తిపూడి లో జనసేన పార్టీ నూతన కార్యాలయం శంకుస్థాపన



**శంఖవరం ఆగస్టు 23 ప్రభాతవార్త** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలే లక్ష్యంగా పని చేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ పేర్కొన్నారు. కత్తిపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ నూతన మండల కార్యాలయానికి ఆదివారం ఘనంగా శంకుస్థాపన చేపట్టారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా సూర్యకిరణ్ (బాబి) మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యాలయం పని చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ఆ అభివృద్ధిలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో గల గ్రామాలను ముందు వరుసలో ఉంచేందుకు ఈ కార్యాలయం వేదిక కానుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు, సామాన్య ప్రజలకు ఈ కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజల నుండి వచ్చే వినతులను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వీర మహిళలు, జనసైనికులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి దాసం శేషారావు లింగపర్తి పిఏసి ఎస్ చైర్మన్ శ్రీ పెంటకోట మోహన్ తుని ఆత్మ బ్లాక్ వైస్ ఛైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం శంఖవరం మండల అధ్యక్షులు గాబు సుభాష్ మండల ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి కత్తిపూడి గ్రామ అధ్యక్షులు పోసిన శ్రీను కత్తిపూడి పిఏసిఎస్ డైరెక్టర్ సర్నం జయాబాబు కత్తిపూడి సత్రం డైరెక్టర్ పాలకుర్తి సతీష్ కత్తిపూడి గ్రామ జనసేన నాయకులు కీర్తి కుమార్ ఇంధన సత్తి వీర్రాజు యర్రంశెట్టి బాబ్జీ నాలుగు మండలాల్లో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# 10,060 పోస్టుల భర్తీకి ఆమోదముద్ర

### నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట: ఆగస్టు 23 (ప్రభాత వార్త)** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు శుభవార్త అందించిందని, వివిధ శాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీకి ఆమోదముద్ర వేసిందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని పేజ్ వన్ 1523 ఉత్తమ విద్యకు సంబంధించిన పోస్టులు, పేజ్ టు సెప్టెంబర్ 15న గ్రూప్-1, పోలీస్ శాఖ, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, జైల్ల శాఖ కు సంబంధించిన 3,231 పోస్టులు, పేజ్ 3 అక్టోబర్ 15న గ్రూప్-2 పోస్టులు, ఇరిగేషన్ శాఖ, ఎక్సైజ్ శాఖ, రోడ్డు రవాణా శాఖ సంబంధించిన 2,311 పోస్టులు, పేజ్4, అక్టోబర్ 15న డీఎస్సీ 2995 పోస్టులు, మొత్తం నాలుగు విడతలలో 1,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని తెలిపారు. ఇది రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశమని, గత ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం యువత ఎదురుచూసి నిరాశ చెందిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి నిరుద్యోగుల్లో భరోసా నింపిందని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అంతా అప్రమత్తంగా ఉండి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమై మన నియోజకవర్గం నుండి అత్యధిక ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ వైస్ ఎంపీపీ మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

# కెమిస్ట్ సంఘంలో ఎన్నికల వేడి..

### పారదర్శకతకు సభ్యుల పట్టం

**పిఠాపురం, ఆగస్టు 23 ( ప్రభాతవార్త )** ఏళ్ల తరబడి సామరస్య వాతావరణంలో కొనసాగిన పిఠాపురంకెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్‌లో ఇటీవల ఏర్పడిన మనస్పర్థలు ఎన్నికలకు దారితీశాయి. ముఖ్యంగా సంఘం జమాఖర్చుల్లో మరింత పారదర్శకత ఉండాలంటూ ఒక వర్గం నుంచి వచ్చిన ఆరోపణలు, అభ్యంతరాలు ఎన్నికల అనివార్యతకు కారణమయ్యాయి. దీంతో రెండు వర్గాలు బ్యాలెట్ పోరులో తలపడ్డాయి. బ్యాలెట్ నంబర్--1 నుంచి సీబీఎస్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షుడిగా, కొత్త సుధాకర్ కార్యదర్శిగా, చక్కా సురేష్‌గుప్తా కోశాధికారిగా పోటీ చేశారు. మరోవైపు బ్యాలెట్ నంబర్--2 నుంచి డీ. వెంకటకృష్ణ అధ్యక్షుడిగా, కే. మాణిక్య శ్రీకాంత్ కార్యదర్శిగా, నగేష్ కోశాధికారిగా బరిలో నిలిచారు. ఎన్నికల ఫలితాల్లో బ్యాలెట్--1 ప్యానెల్ ఆధిక్యం సాధించింది. అధ్యక్షుడిగా సీబీఎస్ ప్రభాకర్‌రెడ్డి 22 ఓట్ల మెజారిటీతో, కార్యదర్శిగా కొత్త సుధాకర్ 28 ఓట్ల మెజారిటీతో, కోశాధికారిగా చక్కా సురేష్‌గుప్తా 36 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. ఎన్నికలతో విభేదాలకు తెరదించి, ఇక సంఘ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన బాధ్యత కొత్త కమిటీపై ఉంది. సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు జమాఖర్చుల్లో పారదర్శకత, సంఘ సంక్షేమ కార్యక్రమాలు, సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కొత్త కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని విజేతలు తెలిపారు. విజేతలకు సభ్యులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

### 18 గ్రామపంచాయతీలకు

# 198 పోలింగ్ స్టేషన్లు

**గోపాలపురం ఆగష్టు 23 (ప్రభాతవార్త):** గ్రామపంచాయతీ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి గోపాలపురం మండలంలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించినట్లు ఎంపీడీవో రాజ్ మనోహర్ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 18 గ్రామపంచాయతీలకు సంబంధించి 198 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదిస్తూ ముసాయిదా జాబితాను సిద్ధం చేసి ప్రజల పరిశీలన కోసం మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఎంపీడీవో తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను రూపొందించనున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు--2026ను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను దశలవారీగా చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజ్ మనోహర్ వెల్లడించారు.

# రక్షిత మంచినీటి పథకంతో చిద్రమవుతున్న రోడ్లు...

- పైపులైన్ల కోసం ఇష్టాను సారంగా రహదారుల తవ్వకం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- రూ.850 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకం పనుల్లో

### నిబంధనలు గాలికి.. చోద్యం చూస్తున్న అధికారులు

**ఆత్రేయపురం, ఆగస్టు 23(ప్రభాత వార్త)** రూ.850 కోట్లతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రక్షిత మంచినీటి పథకం పనులు ఆత్రేయపురం మండలంలో వివాదానికి దారితీస్తున్నాయి. నాలుగు మండలాలు, ఏడు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 8 లక్షల మందికి సురక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంతో ఈ భారీ ప్రాజెక్టు చేపట్టారు. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పైలైన్ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పైప్లు పెట్టడం కోసం రోడ్డు చెంతన వీరు సాగిస్తున్న తవ్వకాలు నిబంధనలకు అనుగుణంగా జరగడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలాచోట్ల ప్రధానమైన ఆర్ అండ్ బీ రహదారులను పూర్తిగా చిద్రం చేస్తుండడం ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? రహదారుల భద్రతకు తీసుకుంటున్న చర్యలేంటి? తవ్విన రోడ్లను తిరిగి అదే నాణ్యతతో పునరుద్ధరిస్తారా? అన్న ప్రశ్నలు స్థానికులు నుంచి వినిపిస్తున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు రక్షిత మంచినీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.850 కోట్ల నిధులతో అమరజీవి జలధార కార్యక్రమాన్ని చేపట్టింది. సెంట్రల్ డెల్టా పరిధిలో సుమారు 8 లక్షల మందికి తాగునీరు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామంలోని దేశాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో మెగా వాటర్ ప్రాజెక్టుకు గత ఏప్రిల్ 10న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్తో కలిసి శంఖుస్థాపన చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అప్పట్లో వెల్లడించారు. కానీ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం భద్రత ఏర్పాట్లు కూడా ఎక్కడ సవ్యంగా చేయడం లేదని విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో వీళ్లు తవ్విన గోతులు వల్ల అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధన ప్రకారం పనులు వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉంది. అలాగే ప్రధానమైన రోడ్లు ధ్వంసమైనచోట్ల ఖచ్చితంగా దాన్ని ఇబ్బంది లేకుండా పునర్నిర్మించాల్సి ఉంది. కానీ అవేవీ ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నాలుగు అడుగుల పైపులు.. రోడ్ల పక్కనే తవ్వకాలు: ఈ ప్రాజెక్టు పనులను దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ సంస్థ ఆత్రేయపురం మండలంలోని వసంతవాడ తదితర ప్రాంతాల్లో పనులు ప్రారంభించింది. సుమారు నాలుగు అడుగుల వ్యాసంతో భారీ పైప్లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే పైప్లైన్ వేసేందుకు రహదారుల పక్కభాగాలను భారీగా తవ్వుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమలాపురం-బొబ్బర్లంక, రాజవరం-పొదలాడ తదితర ఆర్అండ్బి రహదారుల వెంట చేపడుతున్న పనుల్లో రహదారుల స్థితిగతులను పట్టించుకోకుండా తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపైన్ కోసం రోడ్డు అంచులను తవ్వడంతో ప్రధాన రహదారి నిర్మాణానికి చాలా చోట్ల నష్టం వాటిల్లుతోంది. అనేకచోట్ల ప్రధాన రహదారి బీటలు వారింది. కానీ తీసిన గోతులను మట్టితో కప్పి, కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల బీటలు వారిన రోడ్డుపై ప్రమాదాలు సంభవిస్తే సమాధానం ఎవరు చెబుతారు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో తవ్విన ప్రాంతాల్లో మట్టి కుంగిపోవడం, రోడ్డు అంచులు బలహీనపడటం, వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు భారీది కావడం అతిపెద్ద కాంట్రాక్టర్లు దీన్ని సొంతం చేసుకుని, పనులు చేపట్టడంతో.. అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కనీస పర్యవేక్షణ కూడా ఈ పనుల్లో కరువైనట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ వ్యాసం కలిగిన పైపులను ఏర్పాటు చేసిన తర్వాత తవ్విన ప్రాంతాలను ఎలా పూడుస్తున్నారు? ఏ ప్రమాణాలతో పునరుద్ధరిస్తున్నారు? రహదారి అసలు నాణ్యతను తిరిగి తీసుకువస్తున్నారా? అనే అంశాలపై రక్షిత మంచినీటి శాఖ అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆర్ అండ్ బి రహదారులు చాలా చోట్ల దెబ్బతింటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు కూడా వీటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అసలు ఈ కాంట్రాక్ట్లో భాగంగా దెబ్బతిన్న నిర్మాణాలు వీళ్లే నిర్మిస్తారా..? ఏక ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా మళ్లీ పునర్నిర్మిస్తుందా అన్నది తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ పెద్ద కాంట్రాక్ట్ సంస్థ కావడంతో.. సంబంధిత అధికారులు పనుల తీరుపై గట్టిగా స్పందించడం లేదనే ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రహదారులకు నష్టం కలగకుండా తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్అండ్ బీ రహదారులను ఒక ప్రాజెక్టు కోసం ధ్వంసం చేసి వదిలేస్తే.. ప్రజలకు ఇబ్బందులు తప్పవని స్థానికులు పేర్కొంటున్నారు. మంచినీటి ప్రాజెక్టు ప్రజల కోసం ఎంతో అవసరమైనదే అయినప్పటికీ, దాని పనుల పేరుతో ప్రజా ఆస్తులకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు అవసరమే.. కానీ నాణ్యతతో చేయాలి రక్షిత మంచినీటి పథకాన్ని ప్రజలు స్వాగతిస్తున్నప్పటికీ, పనులు శాస్త్రీయంగా, నిబంధనల ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో జరగాలని కోరుతున్నారు. పైప్లాన్ పనులు పూర్తయిన వెంటనే తవ్విన రహదారి భాగాలను యథాతథంగా, మరింత నాణ్యతతో పునరుద్ధరించే బాధ్యతను కాంట్రాక్ట్ సంస్థపై ఉంచాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఆర్అంద??బ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రహదారుల ధ్వంసానికి కారణమవుతున్న పనులను నియంత్రించాలని, పైడ్లైన్ పనులకు నిర్దిష్ట ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. రూ.850 కోట్ల భారీ ప్రాజెక్టు.. లక్షలాది మందికి తాగునీటి భరోసా.. కానీ అదే సమయంలో రహదారులు మాత్రం చిద్రమవుతుంటే... అభివృద్ధి పనులపై ప్రశ్నలు తలెత్తడం సహజమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెగా పనులకు నాణ్యత, నిబంధనలే ప్రామాణికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







## ఓటు హక్కు నమోదు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి

**స్పెషల్ క్యాంపెయిన్ డే లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డీవో సత్యనారాయణ**



**కొత్తపేట ఆగస్టు 23, (ప్రభాతవార్త)** ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా కొత్తపేట మండలంలోని వాడపాలెం గ్రామ పోలింగ్ స్టేషన్ నెం 177 వానపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం186 187 193 బిళ్లకుర్రు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం195 లను ఆర్డీవో నియోజకవర్గ ఎన్నికల అధికారి జి వి వి సత్యనారాయణ సందర్శించారు ఈ సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించుటకు అధికారులకు సంబంధిత పోలింగ్ పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు ప్రస్తుతం జరుగుచున్న సర్ ప్రక్రియ లో నమోదైన నోటీసుల విచారణ ప్రక్రియ నిర్ణిత సమయంలో పూర్తి చేయాలని అందుకు బి యల్ ఓ ఎన్నికల సూపర్వైజర్లు అదనపు సహాయ నమోదు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు తహసీల్దార్ మండల అభివృద్ధి అధికారి వై రాంబాబు మండల స్త్రీ శిశు సంక్షేమ అధికారి గజలక్ష్మి ఎంఎసి ఉపాధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు మండల ఉద్యానవన అధికారి కొత్తపేట సంబంధిత పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లు హాజరయ్యారు

## రూ. 17 లక్షలు అటవీ ఫలసాయ కొనుగోలు లక్ష్యం.. మేనేజర్ బేబీరాణి



**రాజవొమ్మంగి, ఆగస్టు 23, ప్రభాతవార్త** రాజవొమ్మంగి జి. సి. సి. బ్రాంచ్ పరిధిలో 2026- 27 సం. లో భాగంగా రూ. 17 లక్షలు విలువైన అటవీ ఫలసాయాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యమని మేనేజర్ బేబీరాణి అన్నారు. ఈ అటవీ ఫలసాయాన్ని అక్టోబర్ నెల నుండి ప్రారంభించి మార్చి నెలాఖరుకు పూర్తి కావాలని వివరించారు. అటవీ ఫలసాయ కొనుగోలుకు ఇన్ ఛార్జి గా కె. వి. రమణ విధులను నిర్వహిస్తూ శరభవరం, ఎస్. వనకరాయి ప్రాంతాల్లో కొనుగోలు చేస్తారన్నారు. రాజవొమ్మంగి, వయ్యారకు లోసుల లక్ష్మి, బడదనాంపల్లి, వట్టిగడ్డకు సుభాషిణి, లబ్బర్తి, కొమరాపురం ప్రాంతాల్లో ఎల్. చిన్నయ్య, సబ్ ప్లాన్ మాతయ్యపేట ప్రాంతంలో వై. పి. సూరిబాబు అటవీ ఫలసాయాన్ని కొనుగోలు చేస్తారని మేనేజర్ బేబీరాణి తెలిపారు. అటవీ ఫలసాయ కొనుగోలు ధరలు ఇలా ఉన్నాయి. ముసిడి పిక్కలు కిలో రూ. 100లు, కరక్కాయలు కిలో రూ. 18లు, తానికాయలు రూ. 18 లు, నల్లజీడిపిక్కలు కిలో రూ. 35 లు, కుంకుడు కాయలు కిలో రూ. 35 లు, నరమామిడి చెక్క కిలో రూ 18లు, షీకాయ కిలో రూ. 40లు ధరలు అని అన్నారు. తేనే, మైనం, కొండచీపుర్లు, చింతపండు, చింతగింజలు, కొండ గోగు జిగురు, తిప్పతీగ, రెల్లబేరడు, బొబ్బర్లు, రాగులు కూడా కొనుగోలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మేనేజర్ బేబీరాణి, డి. మాతయ్య, ప్రమీలారాణి, డి. ఇ. ఓ. శ్రీహరి, సిబ్బంది జ్యోతి పాల్గొన్నారు.

**నాలుగు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు**

## 17అర్జీలు : ఎంఇఓ సత్యనారాయణదొర



**రాజవొమ్మంగి, ఆగస్టు 23, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో రాజవొమ్మంగి, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నాలుగు అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు 17 దరఖాస్తులు వచ్చాయని రాజవొమ్మంగి మండల విద్యాశాఖాధికారి కె. వి. వి. సత్యనారాయణదొర తెలిపారు. రాజవొమ్మంగి ఉన్నత పాఠశాలలో బయాలజీ 2 పోస్టులకు రెండు, ఫిజికల్ సైన్స్ ఒక పోస్టుకు ఒక ధరఖాస్తు వచ్చిందన్నారు. జడ్డంగి ఉన్నత పాఠశాలలో ఒక బయాలజీ సైన్స్ పోస్టుకు 14 ధరఖాస్తులు వచ్చాయని ఎం. ఇ. ఓ. వివరించారు. ఈనెల 21 తేదీతో ధరఖాస్తు గడువు ముగిసిందన్నారు. ధరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపామన్నారు.

## రెండవ రోజు వైభవంగా వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

**వకుళ మాత అన్నదాన భవన పనులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు.**



**ఆత్రేయపురం, ఆగస్టు 23,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానం లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు రెండవ రోజు ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఉదయం పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన–ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, మహాస్నపనం, నీరాజనం, మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సేవలో ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు శ్రావణి దంపతులు,ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, కనకదుర్గ దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలు, పవిత్రారోహణ, విశేషార్చన, నీరాజనం, మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, స్వామివారి ప్రత్యేక సేవలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. భక్తుల సౌకర్యార్థం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణ పనులను డిప్యూటీ కమిషనర్ ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు పరిశీలించారు.

## కన్నుల పండుగగా పరదేశమ్మ తీర్థం

**దేవతలకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దాట్ల.**



**తాళ్లరేవు ఆగస్టు 23 (ప్రభాతవార్త):** తాళ్లరేవు గ్రామ దేవతల పరదేశమ్మ ,ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పరదేశమ్మ తీర్థానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో తాళ్లరేవు పరదేశమ్మ వీధి ప్రజలతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, అద్దేపల్లి సత్తిరాజు (సతీష్), కుడుపూడి దుర్గారావు, అప్పలరాజు, సామా ప్రదీప్, సతీష్ రాజు, సతీష్, ఆలయ పూజారులు కాటాడి శ్రీను, కాటాడి రాజేష్, భాస్కర రావు, భైరవ స్వామి, కాటాడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పరామర్శ



**మామిడికుదురు.ఆగస్టు 23(ప్రభాతవార్త)** వైఎస్సార్ సీపీ నాయకుడు దాకే విశ్వనాథం తల్లి దాకే నాగరత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గం కో––ఆర్డినేటర్ పాముల రాజేశ్వరీదేవి ఆదివారం గోగన్నమఠం గ్రామంలో మాతృ వియోగంతో బాధపడుతున్న విశ్వనాధాన్ని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం నాగరత్నం చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబు రాజు, నాయకులు భూపతిరాజు సతీష్ రాజు, సాగి సత్యనారాయణ రాజు, ముత్యాల లక్ష్మణరావు, చింతా శ్రీనివాస్ తదితర వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని మృతురాలి కుటుంబానికి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆంధ్ర కేసరి టంగుటూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23(ప్రభాతవార్త)** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఆదివారం జిల్లా కలెక్టరేట్లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఆర్డీవో కే ఆనందరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా న్యాయవాదిగా రాజకీయ నాయకుడిగా ప్రకాశం పంతులు ప్రజలకు విశేషాలు సేవలందించారని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమ సమయంలో బ్రిటిష్ పోలీసులు తుపాకులకు ఎదురుగా నిర్భయంగా నిలబడి ప్రజల్లో స్ఫూర్తిని నింపారేనే అందుకే ప్రజలు ఆయనను ఆంధ్రకేసరిగా గౌరవించారని తెలిపారు. స్వతంత్ర సమరయోధులుగా దేశానికి సేవలు అందించడంతో పాటు మద్రాస్ ప్రెసిడేన్సీ ముఖ్యమంత్రిగా అనంతరం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో నిబద్ధత నిజాయితీ ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రకాశం పంతులకు నివాళులర్పించారు.

## యానాంలో కుక్కల బెడద.. ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిది



**యానం, ఆగస్టు 23: (ప్రభాతవార్త)** యానాం పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. రహదారులు, నివాస ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కల గుంపులు వెంటపడటం, దాడులకు పాల్పడే పరిస్థితులు నెలకొనడంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. కుక్కల దాడిలో ఎవరైనా గాయపడినా, ప్రాణాపాయం సంభవించినా బాధ్యత ఎవరిది ప్రజల భద్రతకు సంబంధించిన ఈ సమస్యపై అధికారులు స్పందించేది ఎప్పుడు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాకుండా ముందుగానే నివారణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టి, ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## నీట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 23, ప్రభాతవార్త,** 21వ డివిజన్లో ఏళ్ల తరబడి ప్రజలను వేధిస్తున్న నీట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. యర్రాళ్ల వారి వీధిలో రూ. 7.56 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. లోతట్టు ప్రాంతాన్ని సుమారు 1.5 అడుగుల మేర ఎత్తు పెంచేందుకు రూ. 8 లక్షలతో పనులు చేపట్టామని చెప్పారు. పాత మేజర్ డ్రైన్ను పునరుద్ధరించి వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వెంటుల విస్తరణకు రూ. 6 లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామని, దీంతో నీరు గంటల తరబడి నిలిచిపోకుండా నిమిషాల్లోనే బయటకు వెళ్లే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## తాళ్లరేవు హైస్కూల్ కి 93, 94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల చేయూత.



**తాళ్లరేవు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్లో 1993, 94 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హైస్కూల్ కు చేయూత అందించారు. హైస్కూల్లో ఉపాధ్యాయులు కూర్చునే కుర్చీలు పూర్తిగా పాడైపోవడంతో సుమారు 20 కుర్చీలు మరమ్మత్తులు చేయించడానికి రూ. 20 వేల ను హైస్కూల్ చైర్మన్ పెంకే శ్రీమన్నారాయణ తో కలిసి హెచ్.ఎం. కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగతాని రవి వర్మ, దుప్పి శ్రీను,పినపోతు లక్ష్మణరావు, వేలూరి శ్రీకాంత్,కొప్పల చక్రవర్తి, పెంకె శ్రీమన్నారాయణ మట్టపర్తి తాతారావు కేశనకుర్తి దుర్గాప్రసాద్, పెమ్మాడి శ్రీను, సిహెచ్ సూరిబాబు, మందారపు శ్రీనివాస్, కడమశెట్టి విశ్వనాథం, గీసాల సత్యనారాయణ, పి. శ్రీనివాస్ సహాయం అందజేశారు.

## శ్రీ నరసింహుని సుదర్శన నిత్యహోమం, అభిషేకం నకు విరాళం....



**సఖినేటిపల్లి ఆగస్టు 23, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు నిర్వహించు సుదర్శన హోమము, నిత్యాభిషేకం నకు శాశ్వత విరాళముగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాస్తవ్యులు పెనుమత్స వెంకట రామరాజు, దుర్గా నాగమణి దంపతులు రూ. 1,00,000. లు, శాశ్వత నిత్యాభిషేకమునకు రూ. 50,000.లు, మొత్తం రూ 1,50,000. రూ.లు విరాళముగా సమర్పించినారు. వీరికి శ్రీ స్వామి వారి దర్శనానంతరము ఆలయ సూపర్డెంట్ పి. విజయసారథి శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములు అందజేసినారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడిపై దాడిని ఖండించిన అడ్డతీగల ప్రెస్క్లబ్



**అడ్డతీగల, ఆగస్టు 23, ప్రభాతవార్త** పూసపాటివేగ మండలానికి చెందిన విశాలాంధ్ర విలేకరి పందిరిపల్లి గోవిందుపై రియల్ ఎస్టేట్ మాఫియాకు చెందిన వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనను అడ్డతీగల ప్రెస్క్లబ్ తీవ్రంగా ఖండించింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అక్రమ కార్యకలాపాలను ప్రశ్నిస్తున్న పాత్రికేయుడిపై దాడి చేయడం భావప్రకటన స్వేచ్ఛకు, పాత్రికేయుల భద్రతకు విఘాతం కలిగించే చర్యగా పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అడ్డతీగల ప్రెస్క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని తెలిపారు. ఈ మేరకు అడ్డతీగల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు స్థానిక పోలీస్స్టేషన్కు వెళ్లి ఎస్సై బి. వినోద్కు మెమోరాండం అందజేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, విలేకరులు పాల్గొన్నారు. పాత్రికేయులపై దాడులు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు.

## నేడు పిజిఆర్ఎస్ రెవిన్యూ క్లినిక్



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23 (ప్రభాతవార్త)** ప్రజల ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్ మండల స్థాయి కేంద్రాలు సచివాలయంలో యధావిధిగా పిజిఆర్ఎస్ రెవిన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పి జి ఆర్ ఎస్ పై అవగాహన కోసం 1100 కాల్ సెంటర్, వెబ్ సైట్ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఫిర్యాదుల పరిష్కారంపై పౌరుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు రూపొందించిన తాజా క్యూఆర్ కోడ్ అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ప్రదర్శించాలని ఆదేశించారు.

## నేరస్తులు రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించాలి,

**రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్**



**తూర్పుగోదావరి అర్బన్: ఆగస్టు 23, ప్రభాతవార్త,** నేరస్తులు, రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తుపదార్థాల వినియోగం, రవాణాలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెడు వ్యసనాలను విడిచి మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, గొడవలు లేదా నేరాలకు పాల్పడితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## శ్రీ నృసింహుని నిత్యాన్నదానమనకు లక్ష విరాళం...



**సఖినేటిపల్లి ఆగస్టు 23, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో ప్రతి నిత్యం నిర్వహించే నిత్యాన్నదానము నకు పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు వాస్తవ్యులు అన్నాబత్తుల నితిన్ కమల్ చైతన్య దంపతులు 1,00,000 రూ.లు విరాళముగా సమర్పించినారు. వీరికి శ్రీ స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సిబ్బంది శ్రీ స్వామి వారి చిత్రపటము, ప్రసాదములను అందజేసినారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, సత్తిబాబు, విజయ్, పాల్గొన్నారు.

## ఘనంగా పట్టాలమ్మ తిరునాళ్లు





**శంఖవరం ఆగస్టు 23 ప్రభాతవార్త** శ్రావణమాసం సందర్భంగా శంఖవరం మండలం ఎస్ జగ్గంపేట గ్రామంలో కొలువైన పట్టాలమ్మ అమ్మవారి తిరునాళ్ళు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ముందు ఆదివారం బోనాలు సమర్పించగా, పలువురు మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు కలిసి జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. పట్టాలమ్మ తల్లి చల్లని చూపులతో గ్రామాన్ని, భక్తులను చల్లగా చూడాలని అందరూ మొక్కుకున్నారు.

## ఓటర్ల లిస్టు ప్రక్షాళన లో తాళ్లరేవు ఫస్ట్. : తహసీల్దార్ జి ఆర్ వి భద్రరావు



**తాళ్లరేవు, ఆగస్టు 23( ప్రభాతవార్త):** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఓటర్ల లిస్టు ప్రక్షాళన చేయడంలో జిల్లాలోనే తాళ్లరేవు మండలం మొదటి స్థానంలో ఉందని తహసిల్దార్ జి ఆర్ వి భద్రరావు తెలిపారు. మొత్తంగా 67,350 మంది ఓటర్లకు గాను అందరికీ దరఖాస్తులు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో 61 వేల 290 మంది తమ సమాచారాన్ని బిఎల్వోలకు ఇవ్వడం జరిగిందన్నారు. 6 వేల 54 మంది ఓటర్లు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. వారంతా రెండుసార్లు నమోదు కావడం, చనిపోవడం, శాశ్వతంగా మరొక చోటకి వెళ్లిపోవడం,లేదాచనిపోయిన ఓటర్లని తెలిపారు. అప్లోడ్ చేసిన ఓటర్లు లిస్టులో పేరు తప్పులు, ఇతర కారణాలవల్ల 96 మంది ఓటర్ల వివరాలు తిరిగి తీసుకోవాలని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. వాటిలో 94 మంది ఓటర్లు తమ తప్పులు సరిదిద్దుతూ వివరాలు అందజేశారు అన్నారు. ఇద్దరు మాత్రం అందుబాటులో లేరని తహసీల్దార్ భద్రరావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే తాళ్ళరేవు మండలం ఈ కార్యక్రమం నిర్వహణలో ముందుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రక్షాళనకు సహకరించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**సీతానగరం, ఆగస్టు 23, (ప్రభాతవార్త) :** మండలంలోని కాటవరం గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్సై ఎల్.శ్రీనునాయక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 2,200 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రభుత్వం కంటే ముందుగానే కోనసీమ ప్రత్యేక ప్రాంతాన్ని జిల్లాగా గుర్తించిన బికేఎస్..

**కోనసీమ రైతులు చాలా చైతన్యవంతులు..**

**బికెఎస్ అఖిల భారత సంఘటనా కార్యదర్శి దినేషన్ జా కులకర్ణి..**



**అంబాజీపేట,ఆగస్టు 23,(ప్రభాతవార్త):** రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా కోనసీమ ప్రాంతాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వ నిర్ణయం కంటే ముందుగానే భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్) కోనసీమ ప్రాంతాన్ని జిల్లాగా గుర్తించి పలు కార్యక్రమాలు చేపట్టామని బి కే ఎస్ అఖిల భారత సంఘటనా కార్యదర్శి దినేష్ జూ కులకర్ణి అన్నారు.రాష్ట్ర బికెఎస్ అధ్యక్షులు సహదేవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పతిరాజుతో కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో కోనసీమ జిల్లా అధ్యక్షులు చేకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన రైతులు,బికెఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులకర్ణి మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్లోని కోనసీమ జిల్లా రైతులు చాలా చైతన్యవంతులని, గతంలో క్రాప్ హాలీడే ప్రకటించి సంచలనం సృష్టించారన్నారు.తాను 10 ఏళ్ల తర్వాత కోనసీమ ప్రాంతానికి వచ్చానని ఇక్కడ రైతులు ఎంతో ఆదర్శవంతులని,అంతేకాకుండా నైపుణ్యవంతులనికితాబిచ్చారు. బికేఎస్ కోనసీమ ప్రాంతంలో 20 ఏళ్లుగా రైతుల తరపున కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అప్పటినుండి పనిచేస్తున్న ఎంతోమంది ఇప్పుడు కూడా ఉన్నారన్నారు. 15 ఏళ్ల క్రితం రాష్ట్రంలో వచ్చిన పెను తుఫానుకు ఇబ్బందులు ఎదుర్కొన్న రైతుల పక్షాన నిలబడి బికేఎస్ ఎంతో సేవ చేసిందన్నారు.బికె ఎస్ రైతులు ప్రతినెలా ఒకటో తేదీన సమావేశాన్ని వారి ప్రాంతాల్లో నిర్వహించుకుంటున్నారని, దీనిని ఆదర్శంగా తీసుకొని తాము కూడా తమ తమ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించుకోవడం కోనసీమ రైతులకు గర్వకారణమన్నారు. ప్రతి నెల రైతులు సమావేశాలు నిర్వహించు కోవడం వల్ల రైతువారీ విషయాలు సమస్యలు చర్చించుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయవచ్చునన్నారు. దేశవ్యాప్తంగా రైతులు వ్యవసాయ కూలీల సమస్యను ఎదుర్కొంటున్నారని దీని పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.దీనిలో భాగంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి విబిజి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనివల్ల రైతులకు మేలు చేకూరే పనులు ప్రభుత్వం చేపడుతోందని, వ్యవసాయ అనుబంధ పనుల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోందని కులకర్ణి తెలిపారు.రైతులు గో ఆధారిత వ్యవసాయం చేస్తూ మినీ గోకులాలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని దీని వల్ల భూమితో పాటు మానవుల ఆరోగ్యం బాగుంటుందని కులకర్ణి చెప్పారు. కోనసీమ బి కే ఎస్ సభ్యులు అందించిన విజ్ఞాపన పత్రంలో ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత బికెఎస్ కార్యకారిణి సభ్యులు శ్రీధర్ రెడ్డి, సంఘటనా సభ్యులు దోనూరి రాము, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల జమీల్, అంబాజీపేట మండల బి.కె.ఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## బుర్రకథతో హెచ్ఐవీపై అవగాహన



**రామచంద్రపురం, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనల మేరకు ఐఈసీ కార్యక్రమంలో భాగంగా దిశా, జనకల్యాణ్, లింక్ వర్కర్స్, సీఎస్ఓ సిబ్బంది సహకారంతో హెచ్ఐవీ/ ఎయిడ్స్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం పట్టణంలోని మార్కెట్ సెంటర్,వెల్ల గ్రామంలోని కామెర్ల మందు సెంటర్ వద్ద కళాజాత నిర్వహించారు.గొర్రెల రాము,కృష్ణ,శ్రీనివాసరావుల బృందం బుర్రకథ ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి,నివారణ,చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించింది.హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సుఖవ్యాధులు,టీబీ,డ్రగ్స్ వినియోగం,హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదనే అంశాలను కళాజాత ద్వారా వివరించారు.1097 టోల్ఫ్రీ నంబర్,ఏఆర్టీ కేంద్రాలు,అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పించారు.అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

# వైద్యం.. అందదిక్కడ

**ఆరోగ్య కేంద్రంపై పిర్యాదులు?**

**జనసేన ఫైవ్ మెన్ కమిటీ సబ్యులు కిషోర్ ఆకస్మిక తనిఖీ**



**యు.కొత్తపల్లి, ఆగస్టు 24 (ప్రభాతవార్త) :** ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ గతంలో స్వయంగా పరిశీలించి అభివృద్ధికి నిధులు కూడా మంజూరు చేసిన కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు మండలంలోనే వైద్య సేవలకు వెన్నెముకగా నిలిచి శస్త్రచికిత్సలు కూడా నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం సాధారణ వైద్య సేవలు సంతృప్తి కరంగా అందడం లేదనే ఆరోపణలతో పాటు పిర్యాదులు కూడా అందుతున్నట్లు తెలుస్తుంది. జనసేన పార్టీ ఫైవ్ మెన్ కమిటీ సభ్యుల్లో ఒకరైన ఓదురి కిషోర్ శనివారం రాత్రి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి, వార్డు ను పరిశీలించి అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. అత్యవసర వైద్యం సేవలు అవసరమైతే పరిస్థితి ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రితో పాటు పరిసరాలు విద్యుత్ వెలుగులు లేవని, ఏర్పాటు చేయాలని గ్రామ అభివృద్ధి అధికారిణి అనంతలక్ష్మిని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ విద్య, వైద్యం, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్దేశ్యమన్నారు. అలాగే అధికారులు సమస్యల పరిష్కానికి కూడా కృషి చేయాలనేది ఆయన తపన అన్నారు.

## కనుమరుగవుతున్న సంప్రదాయానికి జీవం



**రామచంద్రపురం,ఆగస్టు 23 (ప్రభాతవార్త):** చోడవరం గ్రామంలో ఆవు––ఆంబోతు కళ్యాణ వేడుకను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు.కదలి పట్టాభి,ధర్మపత్ని సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఆవు,ఆంబోతులను అలంకరించి పసుపు,కుంకుమలతో పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ జరిగిన కళ్యాణాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.కనుమరుగవుతున్న పూర్వీకుల ఆచారాలు, గ్రామీణ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుక నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.తెలుగు సంస్కృతి,పశుసంపదకు ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పిన ఈ కార్యక్రమం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మరిన్ని వార్తలు 6లో

## నేడు మండలమహిళా సమాఖ్య సమావేశం



**రాజవొమ్మంగి, అగస్టు 23, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు పప్పుల బాలమ్మ అధ్యక్షతన సోమవారం ఉదయం జరుగుతుందని ఏ. పి. ఎం మద్రి లక్ష్మి తెలిపారు. సీసీలు, వి. ఓ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఏ. పి. ఎం. లక్ష్మి తెలియజేస్తున్నారు.

## మొండి బకాయిలుతో శ్రీ నిధి కొత్త రుణాలు లేనట్లే....

**రాజవొమ్మంగి, అగస్టు 23, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య కార్యాలయం పరిధిలో శ్రీ నిధి కొత్త రుణాలు ఇవ్వడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం 2018 సం. లో తీసుకొన్న రుణాలు నేటికీ చెల్లించకుండా మొండి బకాయిలు పేరుకొని పోయాయి. సుమారు రూ. 41 లక్షలు వసూలు కావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది కింద్ర, కొమరాపురం, వెలగలపాలెం ప్రాంతాలకు చెందిన ఏడు గ్రూపులు వారు మాత్రమే రుణాలను పొందారు. కొత్తవారు రుణాలు ఇవ్వడానికి వీలు లేని స్థితి ఏర్పడింది. లాగరాయి. 2 వి. ఓ పరిధిలో 7 గ్రూపు లకు చెందిన 36 మంది రూ. 13 లక్షల 28 వేలు మొండి బకాయిలు ఉన్నాయని అన్నారు.

## యానం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన



**యానం, అగస్టు 23: ( ప్రభాతవార్త )** మృతురాలు రేఖ బంధువులు యానం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. రేఖకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. రేఖ మృతికి సంబంధించి హత్యకు సహకరించినట్లు అనుమానిస్తున్న కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి పుదుచ్చేరికి తరలించాలని బంధువులు డిమాండ్ చేశారు. ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి అసలు విషయాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని బంధువులు పోలీసులను కోరారు. ఆందోళన నేపథ్యంలో యానం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్



**ఆత్రేయపురం, ఆగస్టు 23,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని విజయవాడకు చెందిన సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## పంచాయతీల సాధారణ ఎన్నికల జాబితా



**గండేపల్లి. ఆగస్టు 23. ప్రభాత వార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశములను అనుసరించి గ్రామ పంచాయితీల సాధారణ ఎన్నికలు 2026 కు సంబందించి గండేపల్లి మండలం లోని 18 గ్రామపంచాయితీల కు సంబందించి 192 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను మండలపరిషత్ కార్యాలయ నోటీసు బోర్డు నందు,ఆయా గ్రామపంచాయితీ కార్యాలయముల నోటీసు బోర్డుల నందు మరియు ఆయా గ్రామముల యందు రెండు ముఖ్యమైన ప్రదేశముల యందు పబ్లికేషన్ చేయడమైనది. ఈ పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా నందు ఏమైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉన్నయెడల ది. 24.08.2026 నుండి ది. 26.08.2026 తేదీ లోపు లిఖిత పూర్వకముగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి,గండేపల్లి వారికి సమర్పించ వచ్చునని తెలియజేయడ మైనది.

## స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం

### పట్నంలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం



**రామచంద్రపురం,ఆగస్టు 23 (ప్రభాతవార్త):** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ చప్పిడి వారి సావరం 16వ వార్డులో జనసైనికులు,వీర మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రజలను నేరుగా కలుసుకుని పార్టీ విధానాలు,స్థానిక సమస్యలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు.కార్యక్రమంలో జనసేన నాయకులు,వీర మహిళలు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలో రామచంద్రపురం పట్టణంలోని వార్డుల్లో టీడీపీ,వైసీపీ ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.తాజాగా జనసేన కూడా రంగంలోకి దిగడంతో పట్టణంలో రాజకీయ వేడి పెరుగుతోంది. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రచారం ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.గత స్థానిక ఎన్నికల్లోనూ జనసేన పలు స్థానాల్లో పోటీ చేసి తన ఉనికిని చాటుకుంది.నియోజకవర్గ పరిధిలో 14 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన నియోజకవర్గంగా రామచంద్రపురం నిలిచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.పట్టణంతో పాటు పంచాయతీల్లోనూ పార్టీ బలాన్ని మరింత పెంచుకుని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటే లక్ష్యంతో జనసేన శ్రేణులు కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి.

# ఎమ్మెల్యే సత్యప్రభకు వెన్నా శివ ఆధ్వర్యంలో ఘన సన్మానం

## కత్తిపూడిలో పీహెచ్‌సీ కోసం అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే



**శంఖవరం ఆగస్టు 23 ప్రభాతవార్త** శంఖవరం మండలం కత్తిపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలన్న ప్రజల విజ్ఞప్తిని అసెంబ్లీలో ప్రస్తావించి,ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కత్తిపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ ప్రాథమిక వైద్యం అందే అవకాశం ఉంటుందని వెన్నా శివ పేర్కొన్నారు.ప్రజల విజ్ఞప్తికి స్పందించి అసెంబ్లీ వేదికగా కత్తిపూడి పీహెచ్‌సీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సత్యప్రభకు ధన్యవాదాలు తెలిపారు.పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు బద్ది రామారావు,కత్తిపూడి సొసైటీ అధ్యక్షులు గాబు కృష్ణమూర్తి,మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు,కంచిబోయిన శ్రీను,మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయుడు సూరిబాబు,కత్తిపూడి టౌన్ ప్రెసిడెంట్ కేళంగి జనార్దన్,కొయ్యా రమణ,కత్తిపూడి యూత్ ప్రెసిడెంట్ గాబు శివ,యువ నాయకులు రౌతు శివ,నాయుడు బుజ్జి,మచ్చా కొండ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తాం : కంబాల



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 23, ప్రభాతవార్త,** హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన సంస్కృతి, సంప్రదాయాల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మంజీరా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. హిందూ ధర్మం, దేవాలయాల పరిరక్షణతో పాటు సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు రామసేన ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంగారు వరలక్ష్మి సీజన్ 4 కార్యక్రమంలో భాగంగా నాలుగువేల బంగారు రూపులు లక్ష పట్టు చీరలను కులమతాలకు అతీతంగా పంపిణీ చేశామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరుపేదలకు విద్యా వైద్య పరంగా ఆర్థిక సహాయం ఇతర చేయూత అందిస్తున్నామని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలను కించపరిచిన దాడిశెట్టి రాజా క్షమాపణ చెప్పాలి

### ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త,** వైసిపి నాయకుడు రాజా దాడిశెట్టి రాజా బీసీలపై అనుచితంగా మాట్లాడి కించపరిచిన విధానంపై బీసీలకు క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ఆంధ్ర ప్రదేశ్ యాదవ సంఘం సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బి సి నాయకులు అంకం గోపి, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, మరి కుర్తి రవి యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అంకం గోపి మాట్లాడుతూ , రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బీసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా దాడిశెట్టి రాజా మాట్లాడాన్ని ఖండిస్తున్నామన్నారు. దాడిశెట్టి బేషరత్తుగా కొల్లి మురళి కుటుంబానికి క్షమాపణ చెప్పాలని లేనియెడల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద ఎత్తున బీసీలు ఉద్యమానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. నరేష్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి లో ఉన్నంతకాలం కొల్లి మురళి కుటుంబానికి దాడిశెట్టి రాజాకు సత్సంబంధాలు ఉండేవని ఇటీవల స్వతంత్రంగా కొల్లి మురళి మాజీ ముఖ్యమంత్రి జగన్ కలవడం తో దాడిశెట్టి రాజా అతనిపై కక్ష పెంచుకొని అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. రవి యాదవ్ మాట్లాడుతూ రాజకీయాల్లో కులమతాలతీతంగా వ్యవహ రించాల్సిన దాడిశెట్టి రాజా ఒక బీసీ సామాజిక వర్గం పట్ల అనుచితంగా మాట్లాడటం బీసీల మనోభావాలు మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. క్షమాపణ చెప్పాలని లేదంటే దాడిశెట్టి ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు కందిరెల్లి సత్యనారాయణ , సూరారపు శ్రీను, కందిరెల్లి సత్తిబాబు, కొత్తల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీల్లో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా



**కాత్రేనికోన ఆగస్టు 23 ప్రభాత వార్త)** గ్రామ పంచాయతీల్లో 202 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను (డ్రాఫ్ట్ లిస్ట్) ప్రచురణ (పబ్లికేషన్ ) చేసినట్టు ఎంపీడీఓ బి.రాజేశ్వర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీసుబోర్డులో, ప్రధాన కూడళ్ల వద్ద ఆయా పంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్రచురణ చేసినట్టు స్పష్టం చేశారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డు నందు ప్రచురించినట్టు తెలిపారు.పోలింగ్ స్టేషన్ల జాబితా పట్ల ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 26 వ తేదీలోపు తెలియజేయాలనీ ప్రజలను,ప్రజా ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు ఎన్ శంకర్ నారాయణ, ఎస్ సూర్య నారాయణ రాజు, మండల పరిషత్ ఏవో ఎం సంఘ మిత్ర, పంచాయతీ కార్యదర్శులు, సీవోలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## అడ్డతీగలలో పోలీసులు వాహనాలు తనిఖీ ఎస్సై బి.వినోద్



**అడ్డతీగల , ఆగస్టు 23, ప్రభాతవార్త** 8 గంటలకు అడ్డతీగల సీతపల్లి జంక్షన్ లో అడ్డతీగల ఎస్సై బి .వినోద్ ఆధ్వర్యంలో వాహనాలతానికి నిర్వహించారు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాహన పత్రాలను పరిశీలించారు. వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అని వాహనానికి సంబంధించిన పత్రాలను వాహనంలో ఉంచాలని రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై వాహనదారులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, అలా జరిగిన ఎడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్ఐ వినోద్ తెలిపారు.

# గుప్త నిధులు దొరికాయా?

### అధికారుల హెచ్చరికలతో తవ్వకాలు నిలిపివేత

### గొయ్యి ఒకవైపు పూడ్చడంపై గ్రామస్తుల అనుమానాలు





**యు.కొత్తపల్లి, ఆగస్టు 23 (ప్రభాతవార్త) :** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామంలో గత జూన్ నెలలో ఒక వ్యక్తి తన స్థలంలో ఇంటి నిర్మాణ పునాది పేరుతో జరుపుతున్న తవ్వకాలపై పంచాయతీ కార్యదర్శి జియన్న తహసిల్దార్, ఎంపీడీవో, ఎస్ఐలకు సమాచారం అందించారు. దీంతో తహశీల్దారు జి.చిన్నారావు హుటాహుటిన సదరు వ్యక్తి తవ్వకాలు జరుపుతున్న స్థలాన్ని జూలై 3 తేదీన పరిశీలించారు. తక్షణమే తవ్వకాలు నిలిపివేయాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అప్పటికి తవ్వకాలు నిలిపివేశాడు. అయితే గత వారం రోజులుగా అక్కడ యధావిధిగా తవ్వకాలు జరుగుతున్నట్లు ప్రచారం జరగడంతో మరలా అధికారులకు సమాచారం అందడంతో తహసీల్దార్ తక్షణమే తవ్వకాలు నిలిపివేయకపోతే ఈసారి ఉపేక్షించబోమని హెచ్చరించడంతో తవ్విన గొయ్యిని పూడ్చే పనులు అనుమానాస్పదంగానే జరుగుతున్నాయి.

**లోయను తలపించే గొయ్యి :**

గుప్త నిధుల కోసం లోయను తలపించే విధంగా గొయ్యి తవ్వకాలు జరుగుతున్నాయని తెలియడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. సుమారు 20 అడుగుల లోతు తవ్వేశారని ప్రచారం జరగడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలో ఉన్న ఇళ్లు కూలిపోతాయని ఆందోళనలు కుడా వ్యక్తమయ్యాయి.

**గుప్త నిధులు దొరికాయా ?**

గుప్త నిధుల కోసం జరిగిన తవ్వకాలలో దొరికే ఉంటాయని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్ళు జరిపిన తవ్వకాలతో గుప్త నిధులు దొరికితే గుట్టుచప్పుడు కాకుండా తరలించేసి ఉంటారని ప్రచారం జరుగుతుంది.

**గుప్త నిధులు ఉన్న ప్రదేశాన్ని గుర్తించారా?**

గుప్త నిధులు ఉన్న ప్రదేశాన్ని ఖచ్చితంగా గుర్తించి ఉంటారని, అక్కడ వదిలేసి మిగిలిన గొయ్యిని పూడ్చుతున్నారంటూ ప్రచారం జరుగుతుంది.

**నూతి వరలు ఎందుకు?**

తవ్వకాల ప్రదేశంలో నూతులు తీసే భారీ వరలు అధిక సంఖ్యలో ఉంచడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక పక్కగా ఉంచిన గొయ్యిలో అందులో వరలు వేసి ఏమీ లేనట్లుగా చూపించడానికే పూడ్చే పని పెట్టారని అనుకుంటున్నారు. ఈ వ్యవహారాలు గమనిస్తున్న గ్రామస్తులు గుప్త నిధులు ఉండడం నిజమేమోనని, ప్రస్తుతానికి గుప్త నిధుల అంశం నుండి గ్రామస్తుల, అధికారులు ధృష్టి మరల్చడానికే గొయ్యిని పూడ్చే పని మొదలు పెట్టారని గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## నేటి స్మార్త,వేద విద్యార్థులే, రేపటి ధర్మ రథసారథులు..

### వేద విద్యార్థుల విజయ సంకల్ప దీక్ష..

### ప్రముఖ మనస్తత్వ నిపుణుడు హరికిషోర్..



**అంబాజీపేట, ఆగస్టు 23, ప్రభాతవార్త):** వేద,స్మార్త,సనాతన ధర్మ విద్య యొక్క గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, విద్యార్థులు విద్యతో పాటు వినయం, సంస్కారం, ధర్మనిష్ట, గురుభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలని విజయవాడకు చెందిన ప్రముఖ మనస్తత్వ వేత్త, క్రికెట్ కోచ్ బుద్ధవరపు హరి కిషోర్ అన్నారు.కంచి కామకోటి పీఠాధీషులు,జగద్గురువులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారిచే పవిత్ర బ్రహ్మ సత్రం నిర్వహించబడిన ముక్కామలలో విశ్రాంత మండల విద్యాశాఖాధికారి , ఆధ్యాత్మిక వేత్త దువ్వూరి లక్ష్మీ నారాయణ సోమయాజులు స్వగృహంలో కోనసీమ బ్రాహ్మణ సనాతన విద్యార్థుల విజయ సంకల్ప దీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి కిషోర్ మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని భాషలకు మూలమైన సంస్కృత భాషలో ఉన్న వేదాలను, వేద విద్యను భావితరాలకు అందించే బాధ్యతను వేద పండితులు,విద్యార్థులు తీసుకోవాలన్నారు.నేటి సమాజంలో వేద విద్యకు ఆదరణ పెరుగుతోశీదని,అయితే వేద విద్యార్థులు ఎక్కువసేపు కూర్చునే విద్యను అభ్యసించడంతో శారీరకంగా వ్యాయామం ఉండడం లేదని, దీనివల్ల భవిష్యత్తులో పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని హరికిశోర్ చెప్పారు. ముఖ్యంగా వేద,స్మార్త,సనాతన, ధర్మ విద్యను అభ్యసించడం దాని గొప్పతనాన్ని భావితరాలకు అందించవలసిన బాధ్యత వేద విద్యార్థులపైనే ఉందన్నారు.విద్యార్థులు మానసిక వేదనకు గురికాకుండా సూర్య నమస్కారాలు, సనాతన వ్యాయామాలు చేయడం వలన శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విదేశస్థులు సైతం భారతీయ సంస్కృతి,సంప్రదాయాల పట్ల మక్కువ చూపుతున్నారని హరి కిషోర్ చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరిరక్షణపై రాజమహేంద్రవరంకు చెందిన ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల నిపుణులు వి.మారుతి శ్రీరామ్ విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ముక్కామల,మోడేకుర్రు స్మార్త,వేద పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి బ్రాహ్మణ పెద్దల చేతుల మీదుగా దీక్ష వస్త్రాలు, రుద్రాక్ష మాలలు ప్రధానం చేశారు. అనంతరం వేద విద్యార్థులకు దువ్వూరి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చదువుకునేందుకు టేబుల్స్ పంపిణీ చేశారు. గురువందన కార్యక్రమంలో ఐదుగురు వృద్ధ బ్రాహ్మణ దంపతులను సత్కరించారు. పలువురు అతిథులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ళ నారాయణమూర్తి అవధాని, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పి.కె.రావు,మాజీ డైరెక్టర్ దువ్వూరి సురేష్, టీటీడీ మాజీ డైరెక్టర్ డొక్కా నాథ్ బాబు,గ్రామస్థులు భమిడిపాటి శేఖర్, వక్కలంక నాగేశ్వరరావు, కొంపెల్ల కామేశ్వరరావు,గుళ్లపల్లి వెంకట్రామ్,టి. బిందుమాధవ రావు, అద్దాల రాంబాబు, మిర్తిపాటి రామ చయనులు, వెలవెలపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి, దువ్వూరి నాగయజ్ఞ ఫణి కుమార్, బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## నేడు పీజీఆర్ఎస్--రెవెన్యూ క్లినిక్

### ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



**రంపచోడవరం, ఆగస్టు 23 ప్రభాతవార్త.** ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పి జి ఆర్ ఎస్ లో భాగంగా సోమవారం పీజీఆర్ఎస్--రెవెన్యూ క్లినిక్ యథావిధిగా నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజల నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ అర్జీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా జిల్లా పీజీఆర్ఎస్ కేంద్రంలో సమర్పించవచ్చని సూచించారు. అదేవిధంగా 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ సేవల ద్వారా కూడా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే లక్ష్యంతో జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు



**కె గంగవరం,ఆగస్టు 23,(ప్రభాతవార్త):** కె గంగవరం మండలం బాలాత్రం గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికకు, వరుసకు మేనమామ అయ్యే వ్యక్తి తో ఆగస్టు 26వ తేదీన ద్రాక్షారామంలో బాల్య వివాహం జరిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వివాహం నిలుపుదల చేసి బాలిక, ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించి బాలికకు, ఆమె తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వివాహం రద్దు చేయించారు.ఈ సందర్భంగా బాల్య వివాహ నిరోధక చట్టం, 2006 ప్రకారం బాలికకు 18 సంవత్సరాలు, బాలుడికి 21 సంవత్సరాలు పూర్తయ్యే వరకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. బాలికకు 18 సంవత్సరాలు పూర్తికాకుండా వివాహం జరిపిస్తే చట్ట ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ.1 లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. అదేవిధంగా, బాలలపై లైంగిక దాడులకు సంబంధించి ఫోక్సో చట్టం కూడా వర్తించే సందర్భాల్లో కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అవగాహన కల్పించారు. చట్టపరమైన పరిణామాలను కూడా బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేసి, బాల్య వివాహం జరిపించబోమని కుటుంబ సభ్యుల నుంచి బాల్య వివాహం నిలుపుదల అంగీకార పత్రం తీసుకోవడం జరిగింది.ఈ బాల్య వివాహాన్ని అడ్డుకునే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా. మానస, జి. సూర్యనారాయణ మూర్తి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. పార్వతి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఎం. లక్ష్మణ్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ సిబ్బంది,గ్రామ రెవెన్యూ అధికారి సత్యనారాయణ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం. నాగేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సి.హెచ్. భాస్కర లక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, బాల్య వివాహం గురించి సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన శశిభవ్యత పరామర్శించిన డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి ఆగస్టు 23 (ప్రభాతవార్త)**అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన 17 సంవత్సరాల సలాది శశిభవ్యతను ఆమె కుటుంబాన్ని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పరామర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ, గత రెండేళ్లుగా మంచానికే పరిమితమైన పాప పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సదరం సర్టిఫికేట్ ఉన్నప్పటికీ, నేటి వరకు ప్రభుత్వ పరంగా ఈ అమ్మాయికి రూపాయి సహాయం కానీ, వికలాంగులకు ఇచ్చే ?15,000 పింఛను కానీ అందకపోవడం విచారకరమన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గానీ, ఇతర అధికార పార్టీ నాయకులు గానీ ఇప్పటివరకు ఈ కుటుంబాన్ని పరామర్శించిన దాఖలాలు లేవని, వికలాంగుడైన తండ్రి ఉన్న ఆ పేద కుటుంబం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎక్కడో ఉన్న సినీ నటుడు రామ్ పోతినేని ఈ బాలిక పరిస్థితిపై స్పందించి వైద్య సాయం అందిస్తానని మాట ఇచ్చారని, కానీ స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ పాప సంరక్షణకే రోజంతా సమయం కేటాయించాల్సి రావడంతో ఆ కుటుంబం ఉపాధికి దూరమై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. ఈ సందర్భంగా దుప్పలపూడి మాజీ సర్పంచ్ వల్లభశెట్టి శివ పద్మిని రామ్ సతీష్ పిలుపు మేరకు వైయస్ఆర్సీపీ కార్యకర్తలంతా కలిసి ?35,000, పీరా రామచంద్రపురం గ్రామం నుండి 5000, ఒక దాత నుండి 5000 సేకరించి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని, అలాగే బాలిక తమ్ముడికి స్కూలుకు వెళ్లేందుకు రామ్ సతీష్ మిత్రులు ఒక సైకిల్‌ను అందించారని తెలిపారు. దాతలు ఎవరైనా మానవతా దృక్పథంతో ఈ కుటుంబానికి సహాయం చేయాలనుకుంటే స్థానిక నాయకుడు వల్లభశెట్టి సతీష్‌ను సంప్రదించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఈ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, వెంటనే పింఛను మంజూరు చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తి వెంకటరెడ్డి, వాడ్రేవు శ్రీ చంద్రశేఖర్, చిలకమర్తి శ్రీను, వల్లభశెట్టి శ్రీను, నాగారపు శేషారావు, పంచికట్ల కొండయ్య, వరిగిటి శ్యాంకుమార్, ఎంపీటీసీ కొండా హేమలత సత్తిబాబు, శాంతి, నందికోళ్ల శ్రీను, ఓగిరెడ్డి సుబ్బారెడ్డి, ఓగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహేంద్ర, పీరా రామచంద్రపురం వైయస్ఆర్సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**దాతలు సంప్రదించాల్సిన మొబైల్ నెంబర్:**

తూర్పుగోదావరి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మరియు దుప్పలపూడి మాజీ సర్పంచ్ వల్లభశెట్టి శివ పద్మిని రామ సతీష్: 9724466666

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps